Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 15 | సంచిక: 358 | కరీంనగర్ | ఆదివారం 11 మే, 2025 | పేజీలు: 12 | వెల: 2.00

## రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే10 : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే రెండు లేదా మూడు డిగ్రీలు తక్కువ ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. పలు జిల్లాల్లో ఈరోజు ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 కి.మీ. నుంచి 40 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు(శ) పడతాయని సూచించింది. రానున్న రెండు రోజులు కూడా గంటకు 40 కి.మీ. నుంచి 50 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరించింది.

## సరిహద్దు ఉద్రిక్తతలతో రైల్వే స్టేషన్ల భద్రత పెంపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 10 : భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ వెల్లడించారు. ప్రయాణికుల భద్రతతో పాటు ఆస్తులపైనా ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామని అన్నారు. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లైన సికింద్రాబాద్, కాచిగూడలో భారీగా భద్రతను పెంచినట్లు తెలిపారు. సీసీ కెమెరాల సంఖ్యను సైతం పెంచి పర్యవేక్షణ చేస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు. భద్రత కారణాల దృష్ట్యా దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలను మూసి వేయడంతో రైల్వేస్టేషన్లకు ప్రయాణికుల తాకిడి పెరిగిందన్నారు. దీంతో భద్రత కోసం ప్రత్యేక బలగాలను మోహరించినట్లు చెప్పారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని సీపీఆర్వో శ్రీధర్ వెల్లడించారు.



# ఉగ్రదాడి ఇక యుద్ధ చర్యే...

- అందుకు దీటుగా బదులిచ్చేందుకు సిద్ధం
- పాక్‌ను హెచ్చరించిన భారత ప్రభుత్వం
- పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి ఆమోదం
- ప్రధాని సమక్షంలో త్రివిధ దళాల సమావేశంలో నిర్ణయం
- గత రెండు రోజుల పరిణామాలపై సుదీర్ఘంగా చర్చ
- ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేసిన ఆర్మీ
- సంధి ప్రేలాపనలను నమ్మొద్దంటున్న నిపుణులు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : పాకిస్తాన్‌కు భారత్ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. పాకిస్థాన్ రెచ్చిపోతే అంతకు మించి ప్రతిదాడితో విరుచుకుపడాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన త్రివిధ దళాధిపతులతో జరిపిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. పాక్‌పై పూర్తి స్థాయి యుద్ధానికి మోదీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించాలని, అంతే తీవ్ర స్థాయిలో బదులివ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌లో 26 లొకేషన్లపై పాక్ డ్రోన్ దాడులకు ప్రతిగా శనివారం తెల్లవారు జామున నాలుగు పాక్ ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మోదీ ఈ సమావేశం నిర్వహించారు. దేశ భద్రతా విషయంలో మరింత కఠిన వైఖరి ప్రదర్శించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రయోజనాలను దెబ్బతీసేలా భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడినా దానిని యుద్ధ చర్యగా పరిగణించాలని

8లో

భారత్-పాకిస్థాన్ మధ్య

# తక్షణ కాల్పుల విరమణ

- అధికారంగా ప్రకటించిన భారత్
- భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం
- స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల నుంచి అమలు
- భూమి, గగనతలం, సముద్ర మార్గాల్లో కాల్పులు, సైనిక చర్యల నిలిపివేత
- ఇరు దేశాల డీజీఎంఓల మధ్య కుదిరిన అంగీకారం
- మే 12న మరోసారి చర్చలు జరిపే అవకాశం



గత కొన్ని రోజులుగా తీవ్ర ఉద్రిక్తతలతో వేడెక్కిపోయిన వాతావరణం చల్లబడేలా అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరినట్లు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అధికారికంగా ప్రకటించారు. ఈ ఒప్పందం తక్షణమే అమల్లోకి రానుండటం సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత వాతావరణానికి దోహదపడుతుందని భావిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల నుంచి భూమి, గగనతలం మరియు సముద్ర

8లో

# దెబ్బకు దిమ్మతిరిగిన పాక్



- నడ్డివిరిగి నిలబడలేని దుస్థితి
- ఉగ్రదాడిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని భారత్ హెచ్చరిక
- భారత్ హెచ్చరికలతో బెంబేలెత్తిన పాక్ పాలకులు
- కాల్పుల విరమణకు అమెరికాతో మధ్యవర్తిత్వం
- భారత్ దెబ్బకు పాక్ ఎయిర్ బేస్‌లన్నీ ధ్వంసం
- చేసేది లేక కాళ్లబేరానికి వచ్చిన పాక్ పాలకులు
- పరిమిత దాడులతో సైనికి శక్తిని చాటిన భారత్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విజ్ఞప్తిని అంగీకరించిన భారత్
- ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకారం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : దెబ్బకు దిమ్మ తిరిగింది. నడ్డి విరిగి..నడవలేని పరిస్థితుల్లో పాకిస్తాప్ కాళ్లబేరానికి వచ్చింది. నేరుగా భారత్ కాళ్లనే పట్టుకున్నా...కాదనడంతో అమెరికాను ఆశ్రయించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చెప్పించింది. ఐదు రోజుల్లోనే పాక్ ఇక ముందుకు అడుగు వేయలేని దుస్థితికి చేరింది. భారత రక్షణ దళాల దెబ్బకు పాక్ కోలుకోలేని దెబ్బతింది. ఇక యుద్ధంకాదుకదా...భారత సైన్యం ముందు నిలబడలేని దుస్థితికి వచ్చింది. ఈ క్రమంలో యుద్ధం వద్దంటూ కాళ్లావేళ్లా పడింది. మరోవైపు ప్రతీ ఉగ్రదాడిని యుద్ధచర్యగానే పరిగణిస్తామని శనివారం భారత్ చేసిన ప్రటకనతో వణికిపోయింది. మరోవైపు బలూచీస్థాన్ స్వతంత్రం ప్రకటించకుంది. ఈ క్రమంలో భారత్‌తో తలపడలేని పరిస్థితిలో చేతులెత్తేసింది. ఇప్పటికే చేయాల్సిన నష్టం చేసిన భారత్ కూడా... కాల్పుల విరమణకు సరేనంది. అయితే..షరతలు వర్తిస్తాయని తేల్చిచెప్పేసింది. ఈ క్రమంలో విదేశాంగ మంత్రి జై శంకర్ కాల్పుల విరమణ ప్రకటిస్తూ ట్వీట్ చేశారు. మొత్తంగా పహల్గామ్ ఊచకోత తరవాత..పివోకెలో ఉగ్ర శిబిరాలపై దాడితో పాక్ దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యింది. తామేమీ తక్కువ తినలేదని బీరాలకు పోయి యుద్ధానికి కాలు దువ్వింది. గత బుధవారం భారత్ ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయగానే ..పాక్ యుద్ధానికే దిగింది. దీంతో భారత్ తన దెబ్బ ఎలావుంటుందో రుచి చూపింది. ఈ దెబ్బకే దిమ్మతిరిగిన పాక్ చేతులెత్తేసింది.

8లో




# అబద్ధాల ప్రచారంలో ఆరితేరిన పాక్

- జనావాసాలు, ప్రార్థనా మందిరాలు లక్ష్యంగా దాడులు
- రెండురోజులగా రెచ్చగొట్టేలా పాక్ చర్యలు
- భారత్ ప్రతిదాడులు మాత్రమే చేస్తోంది
- నియంత్రన రేఖ వెంబడి కాల్పులకు తెగబడుతున్న పాక్
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన రక్షణశాఖ

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : పాకిస్తాన్ అబద్దాలు ప్రచారం చేస్తూనే... జనావాసాలు, ప్రార్థనా మందిరాలు లక్ష్యంగా దాడులు చేస్తోందని, అయితే వీటిన భారత్ దళాలు తిప్పికొట్టాయని భారత రక్షణశాఖ వెల్లడించింది. విదేశాంగశాఖ కార్యదర్వి విక్రమ్ మిస్త్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఆపరేషన్ సింధూర్‌పై ఢిల్లీలో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం జరిగిన ఈ మీడియా సమావేశంలో మిస్త్రీ మాట్లాడుతూ... గత రెండు రోజుల నుంచి పాకిస్తాన్ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తోంది. పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు భారత్ కేవలం ప్రతిస్పందిస్తోంది.పాకిస్తాన్ దాడులను అడ్డుకుంటోంది.. తిప్పికొడుతోంది' అని అన్నారు.అనంతరం కల్నల్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ..' పశ్చిమ భాగం వైపు పాకిస్తాన్ దాడులకు పాల్పడుతోంది. భారత సైనికులు లక్ష్యంగా డ్రోన్లు, లాంగ్ రేంజ్ ఆయుధాలతో దాడులు చేస్తోంది. నియంత్రణ రేఖ వెంబడి కూడా కాల్పులకు తెగబడుతోంది. మిస్సైల్స్‌తో కూడా దాడులకు ప్రయత్నించింది. వాటిని ఆర్మీ విజయవంతంగా ధ్వంసం చేసింది. భారత ఏయిర్ బేస్‌లపై దాడులకు యత్నించింది. ఉదమ్ పూర్, పఠాన్ కోట్, ఆదమ్ పూర్‌లతో పాటు మరికొన్ని చోట్ల కాల్పులకు తెగబడింది. పలువురు సైనికులు గాయపడ్డారని అన్నారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. ఇండియన్-ఎస్ 400 సిస్టమ్‌ను.. సిర్సా, సూరత్ ఘర్‌లోని ఏయిర్ ఫీల్డ్స్‌ను ధ్వంసం చేసినట్లు ప్రచారం చేస్తోంది. పాకిస్తాన్ చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలు. అందులో ఎలాంటి సందేహం లేదు' అని అన్నారు. పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోందని ఆర్మీ ప్రతినిధి సోఫియా ఖురేషీ పేర్కొన్నారు.

8లో

## కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి

- రాత్రంతా వారితో చర్చలు జరిపి ఒప్పించారు
- సోషల్ మీడియాలో డోనాల్డం ట్రంప్ పోస్ట్



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

వాషింగ్టన్, మే 10 : భారత్-పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్‌లో శనివారం సాయంత్రం ఓ పోస్ట్ పెట్టారు.

8లో

## కాల్పుల విరమణపై అఖిలపక్షం

- ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పటు
- అన్ని విషయాలు సమగ్రంగా చర్చించాలి
- ప్రభుత్వానికి కాంగ్రెస్ డిమాండ్
- కాల్పుల విరమణను స్వాగతించిన ఒమర్
- శాంతికి భారత్ పెద్దన్న పాత్ర పోషించాలన్న మెహబూబా

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రధాని మోదీ నేతృత్వం లో అఖిలపక్ష సమావేశం

8లో



## అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు

- జయజయహే రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభం
- 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన
- ప్రారంభ వేడుకలకు దూరంగా ఉన్న సిఎం రేవంత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే10 : నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం

8లో

## పాక్ అరాచకాలకు గట్టిగా సమాధానం చెబుతున్న మోడీ

- రక్షణ దళాలకు స్థైర్యం కలిగించాలని అమ్మవారికి మొక్కులు
- బహీర్ బాగ్ కనకదుర్గమ్మ ఆలయంలో కిషన్ రెడ్డి పూజలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, మే 10 : పాకిస్తాన్ చేసిన అరాచకాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గట్టిగా సమాధానం చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి గట్టిగా భారత ఆర్మీ జవాబు చెప్పిందని అన్నారు. భారత సైనికులు ధైర్యంతో, సాహసంతో వీరోచితంగా పాకిస్తాన్‌లోని 9 ప్రాంతాల్లో ఉగ్రవాదుల శిక్షణా కేంద్రాలు, ఉగ్రవాదుల ఇండ్లను మట్టు-బెట్టారని చెప్పారు. పాకిస్తాన్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా భారత సైన్యం వీరోచితంగా పోరాటం చేస్తోందని అన్నారు. భారతదేశం మీద జరిగిన

8లో

## రహిమ్యార్ ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేసిన భారత్

- స్వతంత్ర దేశంగా ప్రకటించుకన్న బలూచీ
- వరుస దెబ్బలకు తోడు ఆర్థికంగా కుదేలు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : యుద్ధం వల్ల పాకిస్తాన్‌కు తేరుకోలేని దెబ్బ తగులుతోంది. పాక్ ఆర్థికంగా కోలుకోవడానికి ఇంకో వందఏళ్ళ పడుతుందని అంటున్నారు. అసలుకే ఆర్థికంగా చితికి పోయిన పాక్ ఈ యుద్ధంతో భారీగా నష్టపోయింది. ఇంకా

8లో








# రాజీమార్గం ద్వారా వివాదాల పరిష్కారం

## - తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 10 : మధ్యవర్తిత్వం, రాజీమార్గం ద్వారా వివాదాలను పరిష్కరించేందుకు కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్ల ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. రమేష్, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్.పి. డి.వి. శ్రీనివాస్ రావు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, జిల్లా న్యాయమూర్తులు యువరాజా, అనంతలక్ష్మి, అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ లతో కలిసి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ నిర్వహణపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జడ్జ్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా ఇరు వర్గాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో మధ్యవర్తిత్వ కేంద్రం కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. కేరళలో ప్రారంభమైన కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లలో చిన్నచిన్న కుటుంబ, ఇతర తగాదాలను కమ్యూనిటీ పెద్దల సమక్షంలో చర్చించుకుని రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడంతో ఇరు పార్టీలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని, రాబోయే తరం ఎలాంటి తగాదాలు లేకుండా తయారు కావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సయోధ్యతో రాజీమార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడంతో పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలలో కేసులు తగ్గుతాయని అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కూడా వేరువేరు కమ్యూనిటీ కేంద్రాల ద్వారా సమస్యలను పరిష్కరిస్తూ విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనీ నిజామాబాద్, కామారెడ్డి లలో ఈ సెంటర్లను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. 10వ మధ్యవర్తిత్వ కేంద్రం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. 2023లో కమ్యూనిటీ మీడియేషన్ చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని, ప్రస్తుత కాలంలో వివాహ బంధాల మధ్య మనస్పర్థలు ఏర్పడి విచ్ఛిన్నం అవుతున్నాయని, ఈ సమస్యలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. చిన్న చిన్న వివాదాలతో నెలకొన్న సమస్యలను మీడియేషన్ సెంటర్ ద్వారా పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మీడియేషన్ సెంటర్ ద్వారా సమస్యల పరిష్కారానికి పలు కమ్యూనిటీల సభ్యులు ముందుకు రావాలని, వారికి 3 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి మాట్లాడుతూ రాజీ చేసుకుని తగాదాలను పరిష్కరించుకోవడం వలన పెద్ద గొడవల నుండి బయటపడవచ్చు అని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో కొనసాగుతున్న కేంద్రాల ద్వారా అనేక సమస్యలు పరిష్కరించబడుతున్నాయని తెలిపారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎమ్.వి.రమేష్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వ కేంద్రం కొరకు జిల్లాలోని 17 మండలాలలో 180 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. కోర్టు ఖర్చుల గురించి కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటివి లేకుండా ఉచిత న్యాయం అందే విధంగా 2023లో తీసుకువచ్చిన మీడియేషన్ చట్టం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గిరిజనుల కోసం జల్ జంగల్ జమీన్ లక్ష్యంగా కొమురం భీం నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశాడని, భీమ్ స్ఫూర్తిగా జిల్లాలో మీడియేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో మధ్యవర్తిత్వ కేంద్రం ప్రజా ప్రయోజనకరంగా ఉంటుందని, ఇప్పటికే గిరిజనులలో రాయి సెంటర్లు అందుబాటులో ఉన్నాయని, వాటికి కొనసాగింపుగా మధ్యవర్తిత్వ కేంద్రాలు పని చేయడం మరింత ఉపయోగకరమని తెలిపారు. స్వయం సహాయక సంఘాలలో ఇప్పటికే మధ్యవర్తిత్వం కొనసాగుతుందని, జిల్లాలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులలో అనేక మంది వయోవృద్ధులు తమను పిల్లలు చూడడం లేదని దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి వారి కోసం మధ్యవర్తిత్వ కేంద్రాలు ఎంతగానో పని చేస్తాయని తెలిపారు.

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ-ఉట్నూరు ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా మాట్లాడుతూ గిరిజన సంస్కృతిలో ఎన్నో సంవత్సరాలనుండి సర్ మేడిలు, మేడిలు, రాయి సెంటర్లు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పెరుగుతున్న అవసరాల దృష్ట్యా మధ్యవర్తిత్వ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు.

ఎస్. పి. డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వ కేంద్రాలకు సహాయ సహకారాల కోసం తమ వంతు కృషి చేస్తామని అన్నారు. మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా ఉచిత సేవలు అందించడం జరుగుతుందని, సమస్య పరిష్కారానికి తక్కువ సమయం పడుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అంతకుముందు జిల్లాకు చేరుకున్న తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జడ్జ్ కు జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికి వందేమాతర గీతాలాపన అనంతరం పహల్గాం బాధితులకు నివాళిగా 2 నిమిషాలు మౌనం పాటించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ యువ రాజా, జూనియర్ సివిల్ జడ్జిలు అనంతలక్ష్మి, అజయ్, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, ఆసిఫాబాద్ ఆర్డిఓ లోకేశ్వర్ రావు, ఏఎస్పి చిత్తరంజన్, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

## - మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం
## - కార్మిక హక్కులను కాపాడుకుందాం

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, మే 10 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వక హాల్ నందు మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలనీ శనివారం రోజున ప్రజా సంఘాల సమావేశం కామ్రేడ్ దుంపల రంజిత్ కుమార్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చేతి వృత్తి దారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య హాజరయ్యారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు ప్రజలు రైతులు ఆదివాసి గిరిజనులపై పెద్ద ఎత్తున దాడి చేస్తుంది. బ్రిటిష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి, ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుంది. ఉపాధి కూలీలకు రేట్లుపెంచడం లేదు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. ఆదివాసి గిరిజన పేదలు సాగలోన భూములకు హక్కు పత్రాలు లేవు. ఆయా వృత్తులు చేసుకునేటువంటి ప్రజలందరికీ సామాజిక భద్రత,హా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరట్లు, పెట్టబడుదారులకు అనుకూలంగా ఈ లేబర్ కోడ్ లు తెచ్చింది. కార్మికుల హక్కుల రక్షణకై జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ లో ప్రజాసంఘాలన్నీ మద్దతూ తెలియజేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సంకె రవి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కనికారపు అశోక్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, రజక సంఘం జిల్లా కార్యదర్శి పైరాల రాములు, ఆదివాసీ గిరిజన సంఘం ఎర్మ పున్నం, వృత్తిదాల సంఘం జిల్లా కార్యదర్శిహా బోడంకి చందు, ఆదివాసీ సంఘం నాయకులు మల్లీశ్వరి, ఎస్కే అబ్దుల్లా సమ్మక్క, రమేష్, గోమాస ప్రకాష్ జిల్లాహా సీఐటీయు ఉపాధ్యక్షులు, దూలం శ్రీనివాస్హా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, అంబటి లక్ష్మను సిఐటియు జన్నారం మండల కన్వీనర్, కొమ్ముల రజిత, రాజమణి, లలిత పాల్గొన్నారు.

# ప్రజల రక్షణకు జిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుంది

## - బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు
## - జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మే10: దేశ వ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణ నేపథ్యంలో జిల్లాలో నిఘా పెంచడం జరిగిందని, ప్రజల రక్షణకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలోని ప్రధాన బస్టాండ్ లు, రైల్వే స్టేషన్, ప్రధాన రహదారులలో, రద్దీ గల ప్రాంతాలలో, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ టీమ్ తో, ప్రత్యేక బలగాలతో ముమ్మర తనిఖీలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని బస్టాండ్లు, ప్రజలు ఎక్కువగా గుమికూడే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఉదయం, సాయంత్రం వాహనాల తనిఖీ, అనుమానస్పద వ్యక్తులను గుర్తించి, విచారించటం జరుగుతుందని అన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి అని, అనుమానాస్పద వ్యక్తులు కనపడిన వెంటనే 100 నెంబర్కి లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలన్నారు. ప్రజల సహకారం వల్లే సమాజాన్ని మరింత భద్రమైనదిగా తీర్చిదిద్దగలమన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లను నమ్మవద్దని, దేశ భద్రత, సున్నితమైన అంశాలపై పోస్ట్ చేసే ముందు జాగ్రత వహించాలని, అనాధారిత సమాచారాన్ని సోషల్ మీడియా గ్రూప్ లలో ఫర్వార్డ్ చేయవద్దని, పోలీస్ శాఖ, ప్రభుత్వం ఇచ్చే అధికారిక సమాచారాన్నే నమ్మాలని ఎస్పీ తెలిపారు.

# అమయాకులను ఊచకోత కోయమని ఇస్లాం చెప్పిందా?

## - ఇస్లాం పేరుతో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్ - భారత్‌లో మత విద్వేషాలకు పాక్ కుట్ర
## - పహల్గామ్ దాడికి భారత్ ధీటైన జవాబిస్తోంది - ఉర్దూ జర్నలిస్టుల కార్యక్రమంలో ఓవైసీ హెచ్చరిక



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 10 : పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారతదేశ వ్యాప్తంగా పాకిస్థాన్‌పై ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే భారత్.. ఆపరేషన్ సింధూర్‌ని చేపట్టి పాక్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇస్లాం పేరుతో పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని ఆయన మండిపడ్డారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్ట్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఓవైసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ భారత్‌ను మతప్రాతిపదికన విభజించాలని పాక్ ప్రయత్నిస్తోందని అన్నారు. భారత్‌లో 23 కోట్ల మందికిపైగా ముస్లింలు ఉం టున్నారని.. హిందూ, ముస్లింల మధ్య ఘర్షణను పాక్ కోరుకుంటుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్విజాతి సిద్ధాంతాన్ని మా పూర్వీకులు తిరస్కరించారని ఓవైసీ అన్నారు. ద్విజాతి సిద్ధాంతంపై ఏర్పడిన పాకిస్థాన్.. ఆఫ్ఘానిస్థాన్‌పై ఎందుకు దాడి చేస్తోందని, ఇరాన్ సరిహద్దుల్లో ఎందుకు బాంబులు వేస్తోందని, ఆఫ్ఘన్లు, ఇరానియన్లు ముస్లింలు కాదా? ఆయన ప్రశ్నించారు. పాకిస్తాన్ మాటిమాటికి మజాక్ చేస్తోందని, పాకిస్తాన్ దాడి చేస్తే భారత్ వెనక్కి తగ్గదని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. అమాయకులను, చిన్న పిల్లలను చంపమని ఇస్లాం చెప్పలేదన్నారు. భారత్‌లోని హిందువులు, ముస్లింల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోందని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగాఉన్నారని అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తోందని, పహాల్గామ్‌లో అతికిరాతకంగా అమాయక ప్రజలను హతమార్చిందని విమర్శించారు. అందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనికులు సరైన సమాధానం ఇస్తున్నారని, పాక్ భారీ మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. దేవుడి దయ వల్లే మనమందరం భారత్‌లో జన్మించామని, పవిత్ర మాసంలో చిన్నపిల్లలు, అమాయకులను చంపే పాక్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదని అన్నారు. మాయకులను, చిన్నపిల్లలను చంపాలని ఇస్లాం చెప్పలేదని, ఇస్లాం పేరుతో పాక్ అసత్య ప్రచారం చేస్తోందని మండి పడ్డారు. పాక్ దాడులపై భారత్ వెనక్కి తగ్గేది లేదని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు అర్పిస్తారని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ మనదేశంలోని సామాన్యులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతోందని, దానికి తగిన మూల్యం చెల్లిచుకుంటుందని ఓవైసీ అన్నారు. భారత జవానులకు మద్దతుగా మనమందరం ఉండాలని అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. చచ్చే వరకు భారత భూమి కోసమే బ్రతకాలని ఎమోషనల్ అయ్యారు. ఈభూమ్మీద పుట్టడం మన అదృష్టమని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ జనాలను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతుందని, దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుందని ఎంపీ అన్నారు. పాకిస్తాన్ దాడి చేస్తే భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గదు. ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తుంది. అమాయకులను, చిన్న పిల్లలను చంపే పాకిస్తాన్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదు. అమ్మ కడుపులో నుండి ఈ భూమిపై పడినప్పుడు.. చచ్చే వరకు ఈ భూమి కోసమే బ్రతకాలి' అని ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ అన్నారు.

# ఖనిలో రద్దీ ప్రదేశాలలో బాంబు స్క్వాడ్ తనిఖీలు

## - ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
## - గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరి ఖని) , మే 10 : భారత సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపెల్లి డీసీపీ కర్ణాకర్ ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ ఏం.రమేష్ పర్యవేక్షణలో గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని వన్ టౌన్ పరిధిలో గల గోదావరిఖని బస్టాండ్ , మెడికల్ కళాశాల, హాస్పిటల్, సింగరేణి ఏరియా హాస్పిటల్, జిఎం ఆఫీస్, కోర్ట్ పరిసరాలు, ముఖ్యగా ఎక్కువ జన సంచారం తో రద్దీగా ఉండే ప్రాంతాలలో బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్స్ స్క్వాడ్ బృందాలతో లగేజ్ పార్సిల్ లను, బ్యాగ్ లను శనివారం తనిఖీలు జరిపారు. ఈ తనిఖీలలో గోదావరిఖని ఏసిపి సీఐ లు స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత చర్యలలో భాగంగా డాగ్, బాంబు స్క్వాడ్ లతో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే, వస్తువులు కనిపిస్తే, సందేహాస్పదంగా ఉన్న వాహనాల సమాచారాన్ని పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవ డానికి సిద్ధంగా ఉన్నామని ఏసిపి తెలిపారు. ఈ తనిఖీ లలో గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు భూమేష్ రమేష్ శ్రీనివాసులు, కోటేశ్వర్, బాంబు స్వాడ్, డాగ్ స్వాడ్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలి

## - సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి - మే 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను విజవంతం చేయాలి - సమ్మె వాల్ పోస్టర్స్ ను విడుదల ఏఐటియుసి నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 10 : కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను అమలు కోసం ప్రవేశ పెట్టిందని, దీని వల్ల దేశంలో ఉన్న కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసి, గతంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మే 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను సింగరేణి లో కూడా కాంట్రాక్టు కార్మికులు జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ కోరారు. శనివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటియుసి రాష్ట్ర కమిటీ పంపిన సమ్మె



వాల్ పోస్టర్స్ ను ఆయన పలువురు నాయకుల తో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మిక వర్గాన్ని బానిసత్వ పరిస్థితులను పెంపొందించే విధంగా ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు.

# ప్రైవేటు ప్రసూతి ఆసుపత్రిలో కడుపు కోతలే





ఇటీవల జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో శస్త్రచికిత్సల అంశంపై ప్రసూతి వైద్యులతో చర్చిస్తున్న వైద్యాధికారి హరీష్ రాజ్ తదితరులు

**మామూలుగా తీసుకుంటున్న ఆరోగ్యశాఖ**
**ప్రైవేటు ప్రసూతి ఆసుపత్రిపై ఆరోగ్యశాఖ**
**ఏర్పాటు చేస్తున్న సమావేశాలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు**

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, మే 10 : మంచిర్యాల జిల్లాలోని ప్రైవేటు ప్రసూతి ఆసుపత్రి నిర్వాహకులతో ఆరోగ్యశాఖ ఏర్పాటు చేస్తున్న సమావేశాలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. కోతలు తగ్గించాలంటూ ఆదేశాలివ్వడం అధికారులకు అలవాటైతే.. పెడచెవిన పెట్టడం ఆ వైద్యులకు పరిపాటిగా మారింది. ప్రైవేటులో జరుగుతున్న కోతల్లో ఏ మాత్రం మార్పు రాకపోగా మరింత పెరుగుతున్నాయి. ఈ శస్త్రచికిత్సలన్నీ జిల్లాలోని ఆరు ఎదు ఆసుపత్రుల్లోనే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అయినా వైద్యశాఖ చాలా 'మామూలు'గా తీసుకుంటోంది. భారీగా శస్త్రచికిత్సలు జరుగుతున్నా కనీసం ఆరా కూడా తీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రైవేటు కేంద్రాల్లో కోతల తీరుకు ఈ లెక్కలే నిదర్శనం. 90శాతానికి పైగా శస్త్రచికిత్సలతోనే ప్రసవాలు చేస్తున్నట్లు వీటితో తెలుస్తోంది. ప్రతినెల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఈ ప్రసవాల్లో అధికంగా మంచిర్యాలలోని 4-5 ఆసుపత్రుల్లోనే జరుగుతుండగా చెన్నూరులోని ఒక చోట ఎక్కువగా ఉంటున్నట్లు తేలింది. అయినా ఆరోగ్యశాఖ అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు లేవు. శస్త్రచికిత్సలు చేయాల్సిన అవసరంపై ఆరా తీసే ప్రయత్నమూ చేయడం లేదు.

### ఫీజుల్లో ఏమాత్రం తగ్గేదేలే

ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవమైనా.. శస్త్రచికిత్స ద్వారా చేసినా ఫీజుల్లో ఏ మాత్రం తగ్గడం లేదు. కానీ వైద్యులు సమయం ఆదా చేసుకునేందుకు, పని సులువుగా పూర్తి చేసేందుకు కోతలకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. గంటల తరబడి ఎదురుచూడలేక.. ఓపిక పట్టడం చేతకాక అయిదు నిమిషాల్లో పూర్తయ్యే శస్త్రచికిత్సలకు అలవాటుపడిపోతున్నారు. ఫీజులు ఎలాగూ తగ్గించడం లేదు. బాధితులకు సాధారణ ప్రసవాలతో కలిగే లాభాలను వివరించి వీటికే మొగ్గుచూపేలా చొరవచూపాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శస్త్రచికిత్సలు బాలింతల భవిష్యత్తు ఆరోగ్యంపై ఏ స్థాయిలో ప్రభావితం చేస్తాయో తెలిపేలా ఆరోగ్యశాఖ అవగాహన పెంచడంతోపాటు ప్రైవేటులో కోతలను తగ్గించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు.

# కాల్పుల విరమణ ఉల్లంఘనలో పాక్ రికార్డు

## - ఏనాడూ ఒప్పందాలను పట్టించుకోని దాయాది
## - ఉగ్రమూకలను ఉసిగొల్పుతూ...దాడులకు పాల్పడే నైజం
## - తాజా కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటుందా అన్నదీ అనుమానమే

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : పాక్ ఎప్పుడూ నమ్మదగిన శత్రువు కాదు. నిరంతరంగా పక్కలో బల్లెంలానే వ్యవహరించింది. అనేక యుద్ధాల్లో ఓడినా దానికి బుద్ధి రాలేదు. ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వడం అలవాటు చేసుకుంది. ఉగ్రవాదులను పెంచి పోషించి, భారత్‌లో మారణహోమం సృష్టించడం ఆనవాయితీగా పెట్టుకుంది. అయితే పహల్గామ్ ఊచకోత తరవాత భారత్ గట్టిగా సమాధానం ఇవ్వడంతో దెబ్బకు దయ్యం వదిలింది. అయితే ఉగ్రమూకలను పోషించకుండా పాక్ ఉంటుందా..అక్కడి సైన్యం ఉండనిస్తుందా అన్నదే సమస్య. అయితే ఏ మాత్రం ఉగ్రచర్యలకు దిగినా భారత్ మరోమారు సైనిక చర్యకు దిగడం ఖాయం. ఇదిపాక్‌కు కూడా తెలుసు. కాల్పుల విరమణలో ఇది ప్రధాన అంశం కానుంది. నిజానికి దీనిని పూర్తిస్థాయి యుద్ధానికి తీసుకుని వెళ్లి పాక్ భరతం పట్టాలని ప్రధాని మోడీ గట్టి పట్టుదలతో ఉన్నా అంతర్జాతీయంగా వచ్చి ఒత్తిళ్లకు తలొగ్గక తప్పలేదు. ఇకముందు కాశ్మీర్ లేదా భారత్‌లో ఎలాంటి ఉగ్ర చర్యలు జరిగినా అందుకు పాక్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇకపోతే కాల్పుల విరమణ జరిగినా భారత్ తీసుకున్న అష్టదిగ్బంధన చర్యలు మాత్రం యధావిధిగా కొనసాగే అవకాశం ఉంది. అందులో సింధూజలాల ఒప్పందం రద్దు, సిమ్లా ఒప్పందం రద్దు వంటివి ఉన్నాయి. భారత్, పాక్‌ల మధ్య1980 నుంచి ఉద్రిక్తతలు మొదలయ్యాయి. కాగా.. 2010 నుంచి 2020 సెప్టెంబర్ వరకు దాదాపు 11,572 సార్లు పాకిస్థాన్ సరిహద్దుల్లో శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ ఘటనల్లో దాదాపు 240 మంది భారతీయలు చనిపోయారు. 673 మంది పౌరులు, 594 మంది సైనికులు గాయపడ్డారు. 1972లో నియంత్రణ రేఖను నిర్ధరించిన అనంతరం సరిహద్దుల్లో దాదాపు 10ఏళ్ల పాటు ఎటువంటి ఉద్రిక్తతలు జరగలేదు. 1980 నుంచి యుద్ధ ట్యాంకులతో గస్తీ జోరందుకోగా.. 1990లో కశ్మీర్ లో తిరుగుబాటు తారాస్థాయికి చేరుకునే నాటికి ఇరుదేశాలు పూర్తి బలగాలను మోహరించాయి. 2001లో భారత్ తన సరిహద్దు ప్రాంతంలో కంచె నిర్మించడం ప్రారంభించిన తర్వాత నియంత్రణ రేఖ వద్ద కాల్పులు తీవ్రతరం అయ్యాయి. 2003 తర్వాత ఇరుదేశాలు యుద్ధ ట్యాంకులను దాదాపు 5 ఏళ్లపాటు నిషేధించాయి. ఈ దేశాల మధ్య ఆ సమయంలో జరిగిన చర్చలు మంచి ఫలితాలను ఇచ్చాయి. అయితే ముంబయిలో 2008 ఉగ్రదాడుల తర్వాత శాంతి చర్చలకు తావు లేకుండా పోయాయి. క్రమంగా సరిహద్దుల్లో యుద్ధట్యాంకుల అలజడి పెరిగింది. 2013లో అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వద్ద ఉల్లంఘనలు ఎక్కువయ్యాయి. ప్రతి ఏడాది అవి గణనీయంగా పెరుగుతున్నాయి. 2017లో భారత్ 1,970 సార్లు ఉల్లంఘనలకు పాల్పడిందని పాకిస్థాన్ ఆరోపించింది. 2018లో పాకిస్థాన్ 936 సార్లు కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచిందని భారత్ ఆరోపించింది. ఆనాటికి 15 ఏళ్లలోనే ఆల్ టైమ్ రికార్డది. 2018 మే నెలలో జమ్ముకశ్మీర్ లో.. భారత్ నాన్ ఇనీషియేషన్ ఆఫ్ కాంబాట్ ఆపరేషన్లను ప్రకటించింది. దీన్నే రంజాన్ కాల్పుల విరమణ అంటారు. ఇది 2003లో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి కొనసాగింపు. అయితే కాలక్రమేణ ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతిని.. 2019, 2020లో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అఇప్పటి నుంచి కూడా 2025 వరకు పాకిస్థాన్ వరుసగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ వస్తోంది. తాజాగా సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పౌరులపై కాల్పులకు తెగించింది. దీంతో ఇద్దరు జవాన్లు, 22మంది సామన్య పౌరులు మృతి చెందారు. అమెరికా మధ్యవర్తిత్వంలో ఈ ఒప్పందం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.





# కాశ్మీర్ ప్రజలకు అండగాఉంటాం

## - మృతుల కుటుంబాలకు పదిలక్షల పరిహారం
## - కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడి

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

శ్రీనగర్, మే 10 : గత రెండు రోజుల నుంచి జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలపై పాక్ జరుపుతున్న దాడుల్లో దాదాపు 20మంది పౌరులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో.. పాక్ కూడా సరిహద్దు ప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడుతోంది. కశ్మీర్‌లోని శ్రీనగర్, రాజౌరి, పూంఛ్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో పాక్ డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో జమ్మూకశ్మీర్ ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థప్పా సహా దాదాపు 20మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా..పదుల సంఖ్యలో గాయపడ్డారు. పౌరులు, ప్రభుత్వ ఉన్నతాధికారి మృతి పట్ల జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరోజు ముందే తాను అధ్యక్షత వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని.. ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. శనివారం వేకువజామున కూడా భారత్‌పై పాకిస్థాన్ సైన్యం దాడులకు పాల్పడింది. రాత్రి నుంచే సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబుపేలుళ్లు వినిపించడంతో అధికారులు అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి 'బ్లాకౌట్' పాటించారు. శ్రీనగర్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో ఉదయం కూడా పేలుళ్ల శబ్దాలు వచ్చినట్లు- స్థానికులు పేర్కొన్నారు. కాగా పాక్ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు.మధ్యాహ్నం11గంటల ప్రాంతంలో మరోసారి శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భారీగా పేలుళ్లు సంభవించినట్లు- శబ్దాలు వచ్చినట్లు- అధికారులు పేర్కొన్నారు.

# కాల్పుల విరమణకు అంగీకారం

## - శాంతికి ఎప్పుడూ పాక్ కట్టుబడి ఉంటుంది
## - అమెరికాను కాళ్లావేళ్లా పడ్డ పాక్ ప్రభుత్వం
## - చివరకు శాంతి వచనాలు ప్రకటించిన పాక్ మంత్రి దార్

ఇస్లామాబాద్, మే 10 : కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించినట్టు పాక్ ప్రకటించింది. తక్షణం కాల్పులను విరమించేందుకు భారత్ కూడా అంగీకరించిందని పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ పేర్కొన్నారు. పాక్, భారత్ తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన, భద్రతకు పాక్ ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంది. తన సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీ పడకుండా శాంతిస్థాపనకు ప్రయత్నిస్తుందని ఎక్స్ వేదికగా విదేశాంగ మంత్రి ఓ పోస్టు పెట్టారు.శనివారం వరకూ భారత్, పాక్ మధ్య తీవ్రస్థాయి ఉద్రికత్తలు నెలకొన్న విషయం తెలిసిందే. మూడు రోజుల నుంచీ పాక్ మిసైళ్లను ధ్వంసం చేస్తున్న భారత్ తాజాగా కీలక ప్రకటన చేసింది. ఇకపై జరిగే ప్రతి ఉగ్రవాద చర్యను యుద్ధ చర్యగా భావిస్తామని భారత వర్గాలు పేర్కొనడం ఒక్కసారిగా పరిస్థితిని మార్చేసింది. భారత్ భారీ ఆపరేషన్‌కు సిద్ధమవుతోందన్న సంకేతాలు వెలువడ్డాయి. అయితే, యుద్ధం తప్పదని అనుకుంటున్న తరుణంలో భారత్, పాక్ యుద్ధ ప్రకటనకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు పేర్కొనడం ఆ వెంటనే పాక్ స్పందించడం ఆసక్తికరంగా మారింది. భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య సంబంధాలు క్రమంగా యుద్ధం దిశగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరు ప్రాంతాల్లో దాడులు కొనసాగుతుండగా, సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో యుద్ధ వాతావరణం పెరుగుతోంది. ఇదే సయమంలో పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో మాట్లాడుతూ, భారతదేశం తన దాడుల చర్యను ఆపితే, పాకిస్తాన్ కూడా అదే చేస్తుందన్నారు. ఈ ప్రకటన, పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చకుండా సంయమనం పాటించాలనే సంకేతాన్ని ఇస్తుందని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం భారత్ పాకిస్తాన్‌లోని మూడు కీలక వైమానిక స్థావరాలపై దాడులు చేసింది. ఈ స్థావరాలు షోర్కోట్‌లోని రఫీకీ ఎయిర్‌బేస్, చక్వాల్‌లోని మురిద్ ఎయిర్‌బేస్, రావల్పిండిలోని నూర్ ఖాన్ (చక్లాలా) ఎయిర్‌బేస్‌లు ఉన్నాయి. భారత్ గగనతల-ఉపరితల క్షిపణులతో ఈ దాడులు చేసింది. దీంతో పెద్ద ఎత్తున నష్టం ఏర్పడింది. అయినప్పటికీ పాకిస్తాన్ మాత్రం తమ వైమానిక దళ ఆస్తులు సురక్షితంగా ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తోంది. ఎంత నష్టం జరిగినా కూడా పాకిస్తాన్ మాత్రం అదే పాట పాడుతోంది. మరోవైపు పాకిస్తాన్ తీరును చూసి టర్కీ సహా ఏ దేశాలు కూడా సపోర్ట్ చేయడం లేదు. చైనా పరోక్షంగా సపోర్ట్ చేస్తున్నా కూడా ప్రస్తుతం మాత్రం పాకిస్తాన్ ఏకాకిగా మారిపోయింది. ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో తమ దేశాన్ని కాపాడాలని పాకిస్తాన్.. అగ్రరాజ్యమైన అమెరికాను వేడుకుంది. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ ఫోన్ ద్వారా మాట్లాడారు. ఇండియాతో శాంతి ఒప్పందం కుదుర్చాలని వేడుకున్నారు. ట్రంప్ కూడా జోక్యం చేసుకోవాలని కోరారు. కానీ బేరసారాల కోసం వెళ్లిన పాకిస్తాన్‌కు ఇక్కడ కూడా ఎదురుదెబ్బ తగిలింది. ఈ విషయంలో మాత్రం పాకిస్తాన్ వెనక్కి తగ్గాలని మార్కో రూబియో సూచించారు.





# బెంగుళూరు చేరుకున్న వీరజవాన్ భౌతికకాయం

## - నివాళి అర్పించిన మంత్రి సవిత - ఊరేగింపేగా స్వగ్రామానికి చేరిక
## - నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
## - హాజరవుతున్న మంత్రులు పవన్, అనిత, లోకేశ్
## - ఒక నెల జీతం సాయంగా ప్రకటించిన బాలయ్య

బెంగుళూరు, మే 10 : ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్ భౌతిక కాయం బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. సాయంత్రం జవాన్ స్వస్థలం గోరంట్ల మండలం కల్లితండాకు పార్థీవదేహం చేరుకోనుంది. బెంగళూరు ఎయిర్ పోర్ట్‌లో మురళీ నాయక్ భౌతికకాయానికి మంత్రి సవిత నివాళులర్పించారు. విమానాశ్రయం నుంచి జవాన్ భౌతికకాయాన్ని స్వయంగా మంత్రి సవితతో పాటు, సత్యసాయి జిల్లా అధికారులు స్వగ్రామానికి తీసుకువస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు కొడికొండ చెక్‌పోస్టు నుంచి జవాన్ భౌతికకాయాన్ని భారీ ర్యాలీతో స్వగ్రామం వరకు తీసుకెళ్లేందుకు పెద్ద ఎత్తున స్థానికులు తరలివస్తున్నారు. జవాన్ మురళీ నాయక్ అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం కల్లితండాలో జరుగ నున్నాయి. జవాన్ అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు. గుమ్మయ్యగారిపల్లి నుంచి భారీ ర్యాలీని నిర్వహించిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పాక్ జరిపిన కాల్పుల్లో మరణించిన నేపథ్యంలో అధికారిక, సైనిక లాంఛనాలతో జరిగే అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం, మంత్రులు లోకేష్, అనిత హాజరుకానున్నారు. ముందుగా మురళీ నాయక్ భౌతికకాయానికి నివాళి అర్పించి, కుటు-ంబసభ్యులను పరామర్శించిన అనంతరం అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. డిప్యూటీ సీఎం, మంత్రుల రాక నేపథ్యంలో కల్లితండాలో యుద్ధ ప్రాతిపదికన అంత్యక్రియలకు అధికారులు ఏర్పాట్లు- చేస్తున్నారు. అలాగే అంత్యక్రియల్లో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, వీఐపీలు పాల్గొననున్నారు. వీఐపీల రాకతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు- చేస్తున్నారు. వీర జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రులను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మేనల్లుడు దేవినేని ధర్మతేజ పరామర్శించారు. ఈ సందర్భంగా జవాన్ తల్లిదండ్రులకు ఒక నెల వేతనం ఆర్థిక సాయం చెక్‌ను ధర్మతేజ అందజేశారు. మురళీ నాయక్ కుటు-ంబానికి అన్ని విధాలా అండగా ఉంటామంటూ కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. అలాగే మురళీనాయక్ కుటుంబాన్ని మహారాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సమంత్ పరామర్శించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ షిండే వీడియో కాల్ ద్వారా మురళీ నాయక్ తల్లిదండ్రులను పరామర్శించారు. వీర జవాన్ విగ్రహాన్ని మురళి నాయక్ జన్మస్థలమైన ముంబైలో ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. మరోవైపు ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్ యుద్ధ భూమిలో పోరాడుతూ అసువులు బాసిన తెలుగు జవాన్ మురళీ నాయక్‌కు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అండగా నిలిచారు. జవాన్ కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఒక నెల జీతాన్ని మురళీనాయక్ కుటుంబానికి ఇస్తున్నట్లు- ప్రకటించారు. ఈనెల 12న మురళీ నాయక్ స్వగ్రామానికి ఎమ్మెల్యే బాలయ్య వ్యక్తిగత కార్యదర్శులు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి.. ఆపై బాలయ్య ప్రకటించిన నగదును వారికి అందిజేయనున్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# గోబెల్స్ ప్రచారాన్ని నమ్ముకున్న పాక్ !

భాత్‌తో పోరాడే శక్తి లేకపోవడంతో ఇప్పుడు పాకిస్థాన్ అబద్ధాల ప్రచారంలో దూసుకుపోతోంది. యుద్ధంలో తామేదో విజయం సాధించి, భారత్‌పై పైచేయి సాధించామని ప్రపంచానికి తెలియచేసి మార్కులు కొట్టేయాలన్న తపనలో అబద్ధాలను నమ్ముకుంది. అయితే పాక్ కుయుక్తులు తెలిసిన ప్రపంచదేశాలు వీటిని నమ్మకున్నా... ఫేక్ వార్తలను ప్రచారం చేస్తోంది. జర్మనీ నియంత వెంట ఉన్న గోబెల్స్‌ను మించి ప్రచారం చేస్తోంది. గోబెల్స్ ఉంటే ఆయన ఆశ్చర్య పోయేలా ప్రచారాలను పేలుస్తోంది. జన్మన్ నియంత హిట్లర్‌ను ముంచినట్లే ఇప్పుడు పాక్‌ను కూడా ఈ ప్రచారాలు ముంచడం ఖాయం. ఇకపోతే పాక్‌కు మద్దతుగా ఏ ఒక్కదేశం ముందుకు రావడం లేదు. అలాగే టర్కీ వచ్చినా దాని పాత్ర నామమాత్రమే. రెండురోజుల యుద్ధానికే పాక్‌కు చుక్కలు కనిపిస్తున్నాయి. అనవసరంగా తోక కాల్చుకున్నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి ఏర్పడింది. భారత్ ప్రతిదాడులతో పాక్ కకావికలం అవుతోంది. అసలు యుద్ధం ముందున్నది. దీంతో పాక్ దిమ్మతిరిగేలా భారత్ సమాధానం ఇవ్వనుంది. ఇవన్నీ పాక్ పాలకులకు, అక్కడి సైన్యానికి తెలుసు. అయితే ప్రజలను నమ్మించాలి. నమ్మించలేక పోతే ప్రజలు తిరుగుబాటు చేస్తారు. క్రికెట్ ఓడిపోతేనే అక్కడి ప్రజలు రాళ్లతో కొడతారు. అలాంటి యుద్ధమంటే ఆషామాషీ కాదు. అందుకే భారత్ బలగాలను దెబ్బ తీసామని, విమానాశ్రయాలు కూల్చామని, భారత్ యుద్ధవిమానాలను కూల్చేశామని అబద్ధాలు ప్రచారం చేస్తోంది. దీనిని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తోంది. అసలు వాస్వాలను ప్రపంచానికి తెలియచేస్తోంది. భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తున్న నేపథ్యంలో పాకిస్థాన్ తప్పుడు ప్రచారంతో సోషల్‌మీడియాలో ఇలా వక్రబుద్ధిని చాటుకుంటున్నది. దాయాది చేస్తున్న అసత్య ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తిప్పికొడు తున్నది. సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతున్న వార్తల్లో నిజానిజాలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ ద్వారా తేటతెల్లం చేస్తున్నది. శుక్రవారం మీడియాలో పలు అంశాలు ప్రచారం కాగా, వాటిపై పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ చేసి, దేశప్రజలకు వాస్తవాలకు నివేదించింది. పాకిస్థాన్‌తోపాటు పలు మీడియా సంస్థలు కూడా పాత ఫొటోలు, వీడియోలను ప్రస్తుత యుద్ధానికి సంబంధించినవిగా చిత్రీకరిస్తూ అసత్య ప్రచారానికి పూనుకుంటున్నది. దీనిపై భారత్ ముందస్తుగా స్పందిస్తూ వాస్తవాలు, పారదర్శకతతో తప్పుడు సమాచారానికి చెక్ పెడుతూనే ఉన్నది. నిజానికి భారత్ ప్రతిదాడితో పాక్‌లో అనేక స్థావరాలు దెబ్బ తిన్నాయి. నాలుగు ఫైట్ జెట్లను భారత దళాలు కూల్చేశాయి. లాహోర్ విమాన వ్యవస్థను కుప్పకూల్చింది. ఇవన్నీ బయటకు రాకుండా పాక్ నానా తంటాలు పడుతోంది. ఇందుకోసం అబద్ధాలను, అర్థసత్యాలను ప్రచారం చేస్తోంది. వీటిని భారత రక్షణ శాఖ ఫొటోలతో సహా ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ప్రపంచాన్ని అప్రమత్తం చేస్తోంది. అలాగే భారతదేశ ప్రజలు ఆందోళనకు, భావోద్వేగాలకు గురికాకుండా చూస్తున్నది. సందేహాలకు తావులేకుండా చేస్తున్నది. అంతేకాదు ప్రజలకు సైతం నకిలీ వార్తలను ఎలా గుర్తించాలో అవగాహన కల్పించే ప్రచారాలకు శ్రీకారం చుట్టింది. పాకిస్థాన్ వైమానికదళం శ్రీనగర్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుందని, పలు జెట్ విమానాలను కూల్చడంతోపాటు–, భారత సైనికులను పట్టుకుందని, ఈ దాడిలో భారత్ తీవ్రంగా నష్టపోయిందని పాకిస్థాన్ మీడియా చానళ్లు ప్రచారం చేశాయి. పాక్ మంత్రులు సహా ఉన్నతాధికారులు ఆ కంటెం ట్‌ను ప్రచారం చేశారు. భారత్ దీనిపై వెంటనే స్పందించింది. రియల్ టైమ్ ఫ్యాక్ట్‌చెకింగ్ ద్వారా ఆ వీడియో మూలాలను గుర్తించింది. పాక్ అసత్య ప్రచా రానికి చెక్ పెట్టింది. వాస్తవానికి ఆ దృశ్యాలు 2024 ప్రారంభంలో పాకిస్థాన్‌లోని ఖైబర్‌లో జరిగిన మత ఘర్షణలకు సంబంధించినవిగా తేటతెల్లం చేసింది. తమదేశంలోనే జరిగిన దాడిని భారత్‌లో జరిగిన దాడిగా నమ్మించే ప్రయత్నం పాక్ చేసింది. భారత బ్రిగేడ్ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్టు పాకిస్థాన్ మరో పుకారును సృష్టించింది. దానిని కూడా భారత్ తేటతెల్లం చేసింది. సెప్టెంబర్ 2024లో రాజస్థాన్‌లోని బార్మర్‌లో ఎంఐజీ 29 జెట్ క్రాష్ అయింది. ఆ పాత చిత్రాన్నే వక్రీకరించి పాకిస్థాన్ అనుకూల సోషల్ మీడియా అసత్య ప్రచారానికి తెరతీసింది. దానిని కూడా భారత్ ఆధారాలతో బయటపెట్టింది. కశ్మీర్‌లో కనీసం 3 భారతీయ జెట్‌లు కూలిపోయాయని చైనా డైలీ ప్రచారానికి పూనుకుంది. అయితే భారత్ దానిలో నిజానిజాలను బయట పెట్టింది. చైనా డైలీ ప్రచారం చేసిన చిత్రం 2019 నాటి ఒక సంఘటనకు సంబంధించిందని ఆధారాలతో బయటపెట్టింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పేరిట ఫేస్‌బుక్‌లో దుండగులు ఒక ఫేక్ అకౌంట్‌ను సైతం సృష్టించారు. పాకిస్థాన్ రహస్యంగా సైబర్ అటాక్స్ చేస్తున్నదని, పౌరులు మెసేజ్‌లను క్లిక్ చేయవద్దని తెలుపుతూ ఆ అకౌంట్‌లో ఒక పోస్టును పెట్టారు. భారత్ వెంటనే దీనిపై స్పందించింది. అజిత్ దోవల్‌కు ఫేస్‌బుక్ అకౌంటే లేదని తేల్చిచెప్పింది. నకిలీ ప్రొఫైల్ అని వెల్లడించింది. ముజఫరాబాద్‌లో సుఖోయ్ 30ఎంకేఐ విమానం కూలిపోయిందని, అందులో ఒక భారతీయ పైలట్ సజీవంగా ఉన్నా డని పాకిస్థాన్ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారానికి పూనుకున్నాయి. అయితే అది అవాస్తమని భారత్ తేల్చింది. భారత వైమానిక దళానికి చెందిన ఈ సుఖోయ్ 2014 అక్టోబర్14 మహారాష్ట్రలోని పూణే–అహ్మద్‌నగర్ హైవే సమీపంలోని కుల్వాడి గ్రామంలోని ఉంద్రేవస్తి వద్ద కూలిపోయింది. దానిని తాజా యుద్ధానికి సంబంధించిందంటూ పాక్ వక్రీకరించింది. దానిని పాక్ ఆర్మీ కూల్చినట్లుగా ప్రాచారం చేసుకుంది. ఆ పోస్టును షేర్ చేయవద్దని భారత్ స్పష్టంచేసింది. జమ్ము వైమానికదళ స్థావరంలో భారీగా వరుస పేలుళు జరిగాయని కూడా పాక్ ప్రచారానికి తెరతీసింది. దాన్ని కూడా భారత్ తిప్పి కొట్టింది. పాక్ ప్రచారం చేస్తున్న ఫొటో ఆగస్టు 2021లో కాబూల్ విమానాశ్ర యంలో జరిగిన పేలుడుకు సంబంధించినదని బహిర్గతం చేసింది. తప్పుడు సమాచారంతో మోసపోవద్దని, కంటెంట్‌ను షేర్ చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని పౌరులకు సూచించింది. జలంధర్‌లో జరిగిన డ్రోన్ దాడికి సంబంధించిన వీడియోను ప్రజల్లో భయాందోళనలను సృష్టించడానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే అది ఎప్పుడో పొలాల్లో జరిగిన అగ్నిప్రమాదానికి సంబంధించిన వీడియో అని తేల్చింది. అదేవిధంగా పాకిస్థాన్ సైన్యం ఒక భారతీయ సైనికపోస్టును నాశనం చేసిందని, అందుకు సంబంధించి నదిగా చెప్తూ ఓ వీడియో వైరల్ చేసింది. అది అసత్యమని పీఐబీ గుర్తించింది. భారత సైన్యంలో 20 రాజ్ బెటాలియన్ అనే యూనిట్ లేదని, ఆ వీడియో ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రచారం చేస్తున్నారని తెలిపింది. భారతదే శంపై పాకిస్థాన్ ప్రతీకారంగా క్షిపణి దాడి చేసిందనే సోషల్ మీడియాలో ఓ వీడియో చక్కర్లు కొడుతున్నది. అయితే అది కూడా అసత్యమని పీఐబీ నిర్ధారించింది. షేర్ చేసిన వీడియో 2020 సంవత్సరంలో లెబనాన్‌లోని బీరుట్‌లో జరిగిన పేలుడుకు సంబంధించినదని తేల్చిచెప్పింది. జమ్ముకశ్మీర్‌లోని రాజౌరిలో ఆర్మీ బ్రిగేడ్‌పై ఫిదాయీన్ దాడి జరిగిందనేది కూడా అసత్యమని పీఐబీ నిర్ధారించింది. సైనిక సిబ్బంది (సీవోఏఎస్) చీఫ్ జనరల్ వీకే నారాయణ్, నార్తర్న్ కమాండ్ ఆర్మీ అధికారికి సైనిక సంసిద్ధతకు సంబంధించి ఒక రహస్య లేఖను పంపార నేదని అబద్ధమని, జనరల్ వీకే నారాయణ్ సీవోఏఎస్ కాదని, ఆ లేఖ పూర్తిగా నకిలీదని పీఐబీ స్పష్టంచేసింది. భారత సైన్యం అమృత్‌సర్‌లోని సొంత పౌరులపై దాడి చేయడానికి అంబాలా ఎయిర్‌బేస్‌ను ఉపయోగించు కుందని కూడా పాకిస్థాన్ సోషల్‌మీడియాలో అసత్యప్రచారం చేసింది. ఇది పూర్తిగా అవాస్తవ మంటూ పీఐబీ తెలిపింది. భారతదేశంలోని విమానాశ్రయాల్లోకి ప్రయాణికులను నిషేధించారని కూడా ఒక పోస్ట్ వైరల్‌గా మారింది. ఆ నకిలీ కథనాన్ని పీఐబీ ఖండించింది. అసత్య ప్రచారాలు, వైరల్ అవుతున్న చిత్రాలు, వీడియోలకు సంబంధించిన వాస్తవాలను ఎప్పకప్పుడు రట్టు చేస్తూ పాక్, దాని అనుకూల శక్తుల ప్రచారానికి అడ్డుకట్ట వేస్తున్నది. ఇలాటి ప్రచారాలతో సొంత ప్రజలను ఎంతకాలం నమ్మిస్తారన్నది చూడాలి. యుద్ధంలో తెగువ చూపే ధైర్యం లేక జనావాసాల్లో దాడులకు తెగబడుతున్న పాక్‌ను భారత సైన్యం తిప్పికొడుతోంది.

# తప్పుడు వార్తలతో పాక్ హల్‌చల్

## – ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్న భారత్ – తప్పుడు ప్రచారాలకు చైనా సైదోడు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్‌తో పాకిస్తాన్ విలవిలలాడిపోతోంది. ఏం చేయాలో, ఎలా దెబ్బకొట్టాలో తెలీక.. చివరకు తప్పుడు ప్రచారానికి తెర తీస్తోంది. దీనికి తన మిత్ర దేశమైన చైనా సపోర్టు కూడా తీసుకుంది. సాధారణ ప్రజలపై తాము దాడులు చేయడం లేదని పాకిస్థాన్ బుకాయింపులను భారత ఆర్మీ తిప్పికొట్టింది. జమ్ములోని నివాస ప్రాంతాలు, ఆలయాలపై పాక్ నిరంతరం దాడులకు తెగబడుతోందని కేంద్రం పేర్కొంది. అందుకు సాక్ష్యంగా వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. జమ్మూకశ్మీర్‌లోని శంభూ దేవాలయం ధ్వంసమైనట్లు రక్షణ శాఖ ఫొటోలు, వీడియోను విడుదల చేసింది. రాత్రంతా డ్రోన్లతో దాడులు చేస్తూనే ఉందని.. భారత ఆర్మీ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు– పేర్కొంది. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు సాయుధ బలగాలు కృతనిశ్చయంతో సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. పశ్చిమ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం కొనసాగుతున్నది. దాయాది పాకిస్థాన్ డ్రోన్ దాడులకు పాల్పడుతున్నది. సరిహద్దు వెంట కవ్వింపు చర్యలకు దిగుతూ.. దాడులు చేస్తున్నది. శనివారం ఉదయం కూడా డ్రోన్ అటాక్ జరిగింది. తెల్లవారుజామున 5 గంటలకు.. పాక్‌కు చెందిన డ్రోన్లు భారీ సంఖ్యలో అమృత్‌సర్‌లోని ఖాసా కంటోన్మెంట్‌లో కనిపించాయి. తక్షణమే భారతీయ సైన్యం స్పందించింది. ఎయిర్ డిఫెన్స్ యూనిట్లు ఆ డ్రోన్లను కూల్చివేసినట్లు ఇండియన్ ఆర్మీ ప్రకటించింది. దానికి సంబంధించిన వీడియోను ఆర్మీ విడుదల చేసింది. ఇకపోతే పాక్ తప్పుడు ప్రచారాలకు చైనా దోహదపడుతోంది. పాక్, చైనా రెండూ కలిసి భారత గగనతల రక్షణ వ్యవస్థ ఎస్–400 పై తప్పుడు ప్రచారానికి తెగబడ్డాయి.. సోషల్ మీడియా వేదికగా పాకిస్తాన్ పోస్టు చేస్తున్న తప్పుడు ప్రచారాలను చైనా ప్రచారంలోకి తెస్తోంది..భారత్ దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్తాన్ ఎలాగైనా కసి తీర్చుకోవాలనే అక్కసుతో ఏవేవో కుటిల ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడడం, డ్రోన్‌లో దాడులు చేయడం వంటి ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇండియన్ ఆర్మీ వాటిని దీటుగా ఎదుర్కొంటోంది. అయితే ఈ క్రమంలో పాకిస్తాన్ విష ప్రచారానికి సిద్ధమైంది. భారత్ మిలిటరీ స్థావరాలపై దాడి చేశామంటూ ఒకసారి, పాక్ సైబర్ సైన్యం దాడిలో భారత్ పవర్‌గ్రిడ్ 70శాతం నిర్వీర్యమైపోయిందని మరోసారి.. ఇలా తప్పుడు వార్తలు పోస్టు చేస్తోంది. అయితే అ వార్తలన్నీ ఫేక్ న్యూస్ అంటూ భారత వార్తాసంస్థ స్పష్టం చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో తాజాగా, భారత గగనతల రక్షణ వ్యవస్థ ఎస్–400పై దాడి చేశామంటూ మరో వార్తను ప్రచారం చేసింది. భారత శక్తిమంతమైన క్షిపణి రక్షణ వ్యవస్థను పాక్‌కు చెందిన జేఎఫ్–17 యుద్ధ విమానంతో కూల్చేశామంటూ పాక్ ప్రభుత్వ రంగ మీడియా సంస్థ పేర్కొంది. అయితే ఈ వార్తలను చైనా ప్రభుత్వ రంగానికి చెందిన మీడియా ప్రచారంలోకి తెచ్చింది. అలాగే అజర్ బైజన్‌కు చెందిన మరో సంస్థ కూడా ఈ వార్తను వైరల్ చేసింది. ఈ వార్తలపై భారత ఆర్మీ అధికారులు స్పందించారు. పాక్ చేస్తున్న ప్రచారం తప్పు అని భారత సైనికాధికారులు తెలియజేశారు. ఎస్–400.. అనేది అత్యాధునిక రక్షణ వ్యవస్థ అని చెప్పొచ్చు. దీని రాడార్ రేంజి సుమారు 600 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇందులో మొత్తం మూడు భాగాలు ఉంటాయి. క్షిపణి లాంచర్లు, శక్తివంతమైన రాడార్, కమాండ్ సెంటర్. ఇది విమానాలు, క్రూయిజ్ క్షిపణులతో పాటూ వేగంగా కదిలే ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణులను కూడా ఢీకొట్టగలదు. ఈ రక్షణ వ్యవస్థను ప్రపంచంలో ఇప్పటివరకు రష్యా, చైనా, టర్కీలు వినియోగిస్తున్నాయి.

# జనావాసాలపై దాడులతో రెచ్చగొడుతున్న పాక్

## – ఢిల్లీ లక్ష్యంగా పాక్ క్షిపణి ప్రయోగం – హతాఫ్–2 మిస్సైల్‌ను అడ్డుకున్న భారత్
## – హర్యానాలోని సిర్సా వద్ద కూల్చివేత – శ్రీనగర్ ఎయిర్‌పోర్టుపైనా దాడికి యత్నం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : ఒక పక్క భారత దళాల ధాటికి విలవిలలాడుతున్నప్పటికీ.. పాకిస్థాన్ తన వక్ర బుద్ధి చూపిస్తూనే ఉంది. భారత్ పై మిస్సైళ్లతో దాడికి పాల్పడుతూ రెచ్చగొడుతోంది. జనావాసాలు లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ రెచ్చొట్టే చర్యలకు దిగుతోంది. ఢిల్లీ, శ్రీనగర్‌తో పాటు, సరిహద్దు వెంబగి గ్రామాలపై దాడులకు తెగబడుతోంది. ఢిల్లీపై దాడి చేయడమే లక్ష్యంగా చేసిన దాడిని భారత్ సైన్యం ధీటుగా తిప్పికొట్టింది. పాకిస్థాన్ డ్రోన్లను మన సైన్యం ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నా.. మళ్ళీ క్షిపణులు ప్రయోగిస్తోంది. తాజాగా ఢిల్లీని టార్గెట్ చేసుకున్న పాక్.. శనివారం ఫతా 2 క్షిపణి ప్రయోగించింది. అయితే.. ఫతా 2 క్షిపణిని భారతదళాలు కూల్చేసాయి. హర్యానాలోని సిర్సా సమీపంలో భారత వైమానిక రక్షణ దళాలు ఆ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సమాచారం. ఫతా 2 క్షిపణి ఉపరితలం నుండి ఉపరితలానికి 400 కిలోమీటర్ల రేంజ్ తో ఉంటుందని తెలుస్తుంది. శనివారం తెల్లవారుజామున, రావల్పిండిలోని నూర్ ఖాన్, పంజాబ్‌లోని చక్వాల్‌లోని మురిద్, షోర్కోట్‌లోని రఫీకితో సహా నాలుగు పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై భారత దళాలు దాడి చేసినట్లు సమాచారం. పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై దాడి జరిగినట్లు ఆ దేశ డైరెక్టర్ జనరల్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి వెల్లడించారు. ఎల్ఓసీ వెంబడి 26 డ్రోన్లు కనిపించాయని.. వీటిలో అనుమానిత సాయుధ డ్రోన్లు ఉన్నాయి. బారాముల్లా, శ్రీనగర్, అవంతిపోరా, నగ్రోటా, జమ్మూ, ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫాజిల్కా, లాల్‌గఢ్ జట్టా, జైసల్మేర్, బార్మర్, భుజ్, కుర్బెట్ మరియు లఖీ నాలా ఉన్నాయి. విచారకరంగా, ఫిరోజ్‌పూర్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడికి పాల్పడ్డట్టు ప్రభుత్వం తెలిపింది. భారత్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడుతున్న పాకిస్థాన్ తాజాగా శ్రీనగర్‌లో మరోసారి భారీ పేలుళ్లు సంభవించినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో ఉదయం 11.45 గంటల ప్రాంతంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని తెలిపారు. ఈ పేలుళ్ల కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారని.. విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అన్నారు. పేలుళ్ల శబ్దం వినిపించిన వెంటనే పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించి.. ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. అవంతిపురం సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో క్షిపణి లాంటి వస్తువు పడినట్లు– గుర్తించామన్నారు. శనివారం తెల్లవారు జామున శ్రీనగర్ విమానాశ్రయంపై.. ఎయిర్ బేస్‌పై డ్రోన్లతో దాడి చేయగా.. సైన్యం వాటిని తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో పాక్ వరుస దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో, బాల్కనీల్లో ఉండకుండా ఇళ్లల్లోనే ఉండాలని హెచ్చరించారు. పంజాబ్‌లోని బఠిండాలో అధికారులు రెడ్ అలర్ట్ విధించారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో పేలుళు సంభవిస్తుండడంతో దానితో సహా ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను ఈనెల 15 వరకు మూసివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. భారత్ సరిహద్దుల్లో పాక్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయని భారత సైన్యం వెల్లడించింది. అమృత్ సర్ ఖాసా కంటోన్మెంట్‌పైకి పాక్ డ్రోన్‌లు ప్రయోగించిందని, పాక్ డ్రోన్లను వచ్చినవి వచ్చినట్లు సమర్థంగా కూల్చివేశామని స్పష్టం చేసింది. సాధారణ పౌరులపై దాడులు ఆమోదనీయం కాదని పేర్కొంది. ఎలాంటి దాడులనైనా భారత సైన్యం దీటుగా ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉందని బదులిచ్చింది.



# భారత్ దాడితో పాక్‌లో వణుకు

## – సైనికదాడి ఆపితే మేమూ దిగివస్తాం – పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వెల్లడి

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

ఇస్లామాబాద్, మే 10 : భారత్ తమపై దాడి చేస్తే ఎదురుదాడికి దిగుతామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన పాక్ ఇప్పుడు మాట మార్చేసింది. పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాకిస్తాన్ విదేశాంగమంత్రి ఇషాక్ దర్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ దాడులు ఆపితే తాము ఆపుతామని ఇషాక్ దర్ స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య ఉద్రక్తతల నేపథ్యంలో తాము తగ్గింపునకు సిద్ధంగా ఉన్నామని,అయిత భారత్ దాడులుఆపితే తాము తగ్గుతామని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని అమెరికాకు స్పష్టం చేశామని వివరించారు. ఇరుదేశాల మధ్య దాడుల వల్ల పాక్ ఆర్థిక పరిస్థితి కుదేలవ్వడం, ప్రజల పరిస్థితులు అధ్వానంగా మారేప్రమాదం ఉండడంతో ఈయుద్ధ వాతావరణాన్ని రూపుమాపడం కోసం న్యూదిల్లీతోచర్చలు జరపడానికి ఇస్లామాబాద్ సిద్ధంగా ఉందని పాక్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. భారత్–పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులు చేయి దాటకముందే దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇరుదేశాలకు సూచించారు. ఈ నేపథ్యంలో పాక్ విదేశాంగశాఖ మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.గురువారం రాత్రినుంచి పాక్ భారత సరిహద్దు ప్రాంతాల్లో దుస్సాహసానికి ఒడిగడుతూనే ఉంది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాల పైకి వరసగా డ్రోన్లు ప్రయోగించింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపొరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని డ్రోన్లను ప్రయోగిస్తూ.. విఫలయత్నిం చేస్తుండగా, దాయాది చర్యలను భారత సైన్యం తిప్పి కొడుతోంది.శనివారంమరోసారి జమ్మూ, ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, బాడ్‌మేడ్, భుజ్ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించగా భారత సైనికులు వాటిని కూల్చివేశారు.

# మేమెవరి జోలికి వెళ్లం

## – మా జోలికి వస్తే మాత్రం వదిలి పెట్టం
## – బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ పోస్ట్

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)



ముంబై, మే10 : పహల్గాం ఘటనకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ పెట్టిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సైనికులకు సెల్యూట్ చేస్తూ దీనిపై స్పందించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ఇమేజ్‌ను పంచుకున్న రణ్‌వీర్.. ఎవరి పనులు వాళ్లు చేసుకునే వారిని మేం ఇబ్బందిపెట్టం. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇబ్బందిపెట్టాలని మా జోలికి వస్తే మాత్రం వదిలిపెట్టం. మన సాయుధ దళాల ధైర్యానికి సెల్యూట్ అని రాసుకొచ్చారు. ఈ ఆపరేషన్‌లో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోన్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఆపరేషన్ సిందూర్‌పై టాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. చిరంజీవి, అల్లు అర్జున్, ఎన్టీఆర్, అక్షయ్ కుమార్, రితీశ్ దేశ్‌ముఖ్, నిమ్రత్ కౌర్‌లు సైనికుల సేవలను కొనియాడారు. మీ వెంటే మేమున్నామని సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేశారు. ఇక మరోవైపు రెండు రోజులుగా జమ్మూకశ్మీర్, పంజాబ్‌లోని ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లతో దాడులు చేస్తోంది. భారత ఆర్మీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో భారత్ – పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# సరిహద్దు ఉద్రిక్తతలతో విద్యార్థుల ఆందోళన

## కేంద్రమంత్రి బండి చొరవతో స్వస్థలాలకు పయనం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

శ్రీనగర్, మే 10 : భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లోని షేర్–ఇ–కశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందులో 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. వీరిలో పలువురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్, వర్శిటీ డీన్‌తో మాట్లాడారు. సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. దీంతో ఏపీ, తెలంగాణ, తమిళనాడుకు చెందిన మొత్తం 23 మంది విద్యార్థులను బస్సుల్లో శ్రీనగర్ నుంచి దిల్లీకి పంపించారు. అక్కడి నుంచి స్వస్థలాలకు చేరుకోనున్నారు.



# సజావుగా కొనుగోలు ప్రక్రియ

## - అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, మే 10 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. శుక్రవారం రఘునాథ్ పల్లి మండలం కిలా షాపూర్, జాఫర్ గూడెం, అశ్వరావు పల్లి, వెల్ది, గోవర్ధనగిరి లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి కొనుగోలు కి సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంకు తేమశాతం రాగానే కొనుగోలు ప్రక్రియ మొదలవ్వాలని... ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని సరిపడా టార్ఫాలిన్ లను,గన్ని సంచులను అందుబాటులో ఉంచుకోవాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి అనుగుణంగా..లారీలను ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్,సివిల్ సప్లై అధికారులు, మండల తహసీల్దార్ పాల్గొన్నారు.



# సర్వేయర్ల కు శిక్షణ ఇచ్చేందుకుగాను దరఖాస్తుల ఆహ్వానం

## - జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, మే 10 : భూ భారతి చట్టం-2025 అమలులో భాగంగా అర్హులైన సర్వేయర్ల కు శిక్షణ ఇచ్చేందుకుగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సర్వేయర్ల శిక్షణ కోసం ఈ నెల 17 లోగా సమీపంలోని మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. ఎంపికైన సర్వేయర్లకు ఈ నెల 26 నుండి జూలై 26 వరకు (50 పని దినాలు) శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. రెవెన్యూ పరిపాలనకు తోడుగా, సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ శాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5,000 మంది సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చి సర్వేయర్లను నియమించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి (భూమి హక్కుల రికార్డు చట్టం-2025) ద్వారా భూమి సంబంధిత సేవలను ప్రజలకు కల్పించి వారి భూ సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో లైసెన్సుడ్ సర్వేయర్లను నియమించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని సర్వేయర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.




# నిర్మల్ జిల్లా మైనారిటీ పాఠశాలల్లో ముస్లిమేతర విద్యార్థుల 5వ తరగతి ప్రవేశానికి లాటరీ నిర్వహణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే10 : నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల (టిఎమ్ఆర్ఐఇఎస్) 5వ తరగతి ప్రవేశాల కోసం ముస్లిమేతర (ఎస్సీ, ఎస్టీ అండ్ బీసీ) వర్గాల విద్యార్థులకి లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమం జిల్లా స్థాయిలో నిర్వహించబడింది. బాలుర పాఠశాలలకే కాకుండా, జిల్లా అంతటా ఉన్న అన్ని మైనారిటీ పాఠశాలల కోసం ఈ లాటరీని నిర్వహించారు. లాటరీ కార్యక్రమంలో టిఎమ్ఆర్ ఐఇఎస్ బాయ్ ప్రిన్సిపల్ ఫిరోజ్, రీజినల్ కోఆర్డినేటర్ హమీద్, జిల్లా మైనారిటీస్ వెల్ఫేర్ అధికారి మోహన్ సింగ్ ముఖ్య పాత్ర పోషించారు. తల్లిదండ్రులు, విద్యార్థుల సమక్షంలో పారదర్శకంగా ఈ లాటరీ జరిపారు. పౌరసత్వ ప్రమాణాలు మరియు కుల ధ్రువీకరణ పత్రాల ఆధారంగా లాటరీకి అర్హత కలిగిన విద్యార్థుల్ని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు మైనారిటీ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం నుండి 5వ తరగతిలో చేరేందుకు అవకాశం కలుగనుంది. లాటరీ ప్రక్రియ న్యాయంగా, సమానతతో జరిగిందని అధికారులు స్పష్టం చేశారు.



# భక్తాంజనేయ ఆలయంలో మాలాధారణ స్వాములు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 10 : రామగుండం భక్తాంజనేయ ఆలయంలో శనివారం భారీగా హనుమాన్ మాలాధారణ ప్రక్రియను ఆలయ పూజారి చందుస్వామి నిర్వహించారు. అనంతరం మాలధారన స్వాములకు హనుమాన్ మాల ధారణ దీక్ష స్వాములు పాటించాల్సిన నియమాలను చందు స్వామి వివరించారు.





# అప్ గ్రేడులతోనే సరి పెడితే ఎలా..?

## - ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వేధిస్తున్న వైద్యుల కొరత - మెరుగైన వైద్య సేవలు అందుతున్నా... - వసతుల లేమితో ఎదురవుతున్న ఇబ్బందులు - ప్రసవాలలో రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలవడం హర్షనీయం - బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి టౌన్, మే 10 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని అప్ గ్రేడులతోనే సరి పెడితే ఎలా? అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, వైద్యుల కొరత, వైద్య సిబ్బంది కొరతను ఆర్ఎంవో డాక్టర్ జావేద్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మొదటగా ఏరియా ఆసుపత్రిగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని కాలక్రమేనా అప్ గ్రేడ్ చేస్తూ నేడు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మార్చడం, అందులోనూ మెడికల్ కళాశాల మంజూరై టీచింగ్ ఆసుపత్రిగా కూడా కొనసాగుతుందని అన్నారు. కేవలం అప్ గ్రేడ్ తోనే సరిపెడుతున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించకపోవడం వల్ల రోగులకు, రోగుల సహాయకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఉన్న కొద్దిమంది వైద్యులే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ పని ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ప్రసవాలలో రాష్ట్రంలోనే సంగారెడ్డి, మహబూబ్ నగర్ తర్వాత వనపర్తి మాతా శిశు సంరక్షణ కేంద్రం ఉందని, నెలలో దాదాపు 500 ప్రసవాలు చేస్తూ రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. పారిశుద్ధ్య విషయంలో సంతృప్తి ఉన్నప్పటికీ ఇంకాస్త మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా జనరల్ ఆసుపత్రికి అనుగుణంగా వైద్య పోస్టులు లేకపోవడం ఇక్కడి ప్రజలకు ఒక శాపంలా మారిందని, 39 ప్రొఫెసర్ పోస్టులకు గాను 14 మంది మాత్రమే ఉన్నారని, అసోసియేట్ పోస్టులు 26 ఖాళీగా ఉన్నాయని, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా దాదాపు 65, ట్యూటర్ పోస్టులు 8, ఎస్ ఆర్ పోస్టులు కూడా చాలావరకు ఖాళీగా ఉన్నాయని అన్నారు. స్వయాన ముఖ్యమంత్రి చదువుకున్న జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉండడం సరికాదని, వెంటనే అన్ని రకాల వైద్య పోస్టులను నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను జిల్లా ఇన్చార్జి మంత్రికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆసుపత్రి నిర్మాణ పనులు వీలైనంత త్వరగా మొదలు పెట్టాలన్నారు. పేదలకు మెరుగైన ఉచిత వైద్యం అందాలన్నదే తమ లక్ష్యమని, బీసీ పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో గతంలో కూడా ఉచిత విద్యా, వైద్యం కోసం పాదయాత్ర చేశామని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్, రామన్ గౌడ్, గిరిధర్ గౌడ్, చందు తదితరులు పాల్గొన్నారు.






# మాలల హక్కుల కోసం ఉద్యమిద్దాం

## - మాల సంఘం నేతలు సుదర్శన్, లక్ష్మణ్ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 10 : పీవీ రావు ఆశయాలను ముందుకు తీసుకుపోతూ మాల కుల బాంధవులను ఏకతాటి పైకి తీసుకువచ్చి మాల ల హక్కుల కోసం ఉద్యమిద్దామని మాల సంఘం నాయకులు ముక్క సుదర్శన్, ఎరుకల లక్ష్మణరావు లు పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మాల సంఘం కార్యాలయంలో శనివారం పీవీ రావు 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాల సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేసి,చిత్రపటం ముందు పుష్పాలను ఉంచుతూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీవీ రావు మాల సంఘం ఏర్పాటు, మాలల హక్కుల కోసం అప్పటి ప్రభుత్వాలను ఎదిరించి పోరాడిన తీరును సంఘం నాయకులు నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా మాల సంఘం నాయకులు మాట్లాడుతూ పీవీ రావు తన జీవితాన్ని మాలల హక్కుల కోసం, మాల సంఘా న్ని ముందుకు తీసుకువెళ్లడం కోసం త్యాగం చేశారని తెలిపారు. పాలకుల చేతుల్లో ఎన్నో ఎదురుదెబ్బలు తిని మాల సంఘం ప్రతిష్ఠతను కాపాడిన వ్యక్తి పీవీ రావు అని, మాల సంఘం నాయకులంతా ఐక్యతగా ఉండి మన హక్కుల సాధన కోసం పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం అధ్యక్షులు సోగాల వెంకటి,వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ కుమార్, ప్రధానకార్యదర్శి మత్రి ఐలయ్య, కోశాధికారి ఎరుకల లింగమూర్తి, నాయకులు ఈద రాంచందర్,పులి మోహన్, మదాసు రామ్మూర్తి,గడ్డం నారాయణ, కడమండ శ్రీహరి,మాలెం మధు,పిట్టల వెంకటి,బొమ్మక రాయలింగు, ఆరె దేవకరున, నంది నాగేశ్వర రావు,నూకల మొండి, దాసరి కిష్టయ్య,నంది నరేష్,దాసరి రమేష్, రామస్వామి,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


అలాగే మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పివి రావు 73వ జయంతి సందర్భంగా ఎండిహెచ్‌డబ్ల్యు స్ గాంధీ నగర్ ఆశ్రమంలోని విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్ తినిపించి ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మాల మహానాడు ఆఫ్ ఇండియా విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బైరిమల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు డాక్టర్ దేవి లక్ష్మీనరసయ్య, తెలంగాణ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గంట బబిత.. జాతీయ ఉపాధ్యక్షురాలు ఆరే దేవకరుణ భీమవరపు కోటేశ్వరరావు రాష్ట్ర నాయకులు... ఆశ్రమ నిర్వాహకులు పోచంపల్లి రాజన్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

అలాగే మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పివి రావు 73వ జయంతి సందర్భంగా ఎండిహెచ్‌డబ్ల్యుఎస్ గాంధీ నగర్ ఆశ్రమంలోని విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్ తినిపించి ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మాల మహానాడు ఆఫ్ ఇండియా విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బైరిమల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు డాక్టర్ దేవి లక్ష్మీనరసయ్య, తెలంగాణ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గంట బబిత.. జాతీయ ఉపాధ్యక్షురాలు ఆరే దేవకరుణ భీమవరపు కోటేశ్వరరావు రాష్ట్ర నాయకులు... ఆశ్రమ నిర్వాహకులు పోచంపల్లి రాజన్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు శిక్షార్హులు

## - మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసులను నమోదు చేస్తాం : డిఎస్పీ జీవన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆదిలాబాద్, మే 10 : జిల్లా వ్యాప్తంగా 295 మైనర్‌లు నడిపిన వాహనాలను వారం రోజులపాటు తాత్కాలికంగా జప్తు చేసి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ అందజేసిన తర్వాత నిన్న రాత్రి ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు, ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఇద్దరు మైనర్లకు వాహనాలు ఇచ్చిన తండ్రులపై వేరువేరుగా రెండు కేసులు నమోదు చేయబడ్డాయని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ టూ టౌన్ పట్టణ పోలీస్ స్టేషన్ నందు 17 సంవత్సరాల మైనర్ యువకునికి తండ్రి వేణుగోపాల్ పై ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్లో 125 బిఎన్ఎస్ సెక్షన్ ప్రకారం క్రైమ్ నెంబర్ 224/25 తో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు నర్సయ్య, తన కొడుకు 12 సంవత్సరాల వ్యక్తికి వాహనాన్ని ఇచ్చి నందున పొచ్చర గ్రామం వద్ద వాహనాన్ని సీజ్ చేసి ఇచ్చిన తండ్రి నరసయ్య పై 125 బి ఎన్ ఎస్ సెక్షన్ ప్రకారం క్రైమ్ నెంబర్ 138/25తో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన, నిబంధన అతిక్రమించి మైనర్లకు వాహనాలను ఇచ్చి న తల్లిదండ్రుల పై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి అవుతున్నారని అదేవిధంగా ప్రమాదాలకు గురి చేస్తున్నారని విషయాన్ని గమనించి తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా ఉండాలని సూచించారు. మైనర్లు అర్హత వచ్చేంతవరకు ఆగి వాహన లైసెన్స్ ను పొందిన తర్వాత వాహనాలు నడపాలని లేనియెడల తల్లిదండ్రులపై అనవసరంగా కేసులు నమోదు అవుతున్నాయి అనే విషయాన్ని గ్రహించాలని సూచించారు.



# నూతన ఉద్యోగులు సీనియర్ ఉద్యోగులతో కలిసిమెలిసి పని నేర్చుకోవాలి

## - భూపాలపల్లి ఏరియా జి.ఎం. ఏనుగు రాజేశ్వర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భూపాలపల్లి, మే 10: సింగరేణి సంస్థలో నూతనంగా చేరే ఉద్యోగులు క్రమశిక్షణతో, "ఒకే ఒకే కుటుంబం-ఒకే లక్ష్యం-ఒకే గమ్యం" అనే నినాదంతో సీనియర్ ఉద్యోగులతో కలిసిమెలిసి పని నేర్చుకోవాలని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. శనివారం స్థానిక జి.యం. కార్యాలయంలో జరిగిన కార్యక్రమములో సింగరేణి సంస్థలో నూతనముగా చేరిన 21మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులను రాజేశ్వర్ రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన నూతనంగా చేరుతున్న ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ సంస్థలో చేరుతున్ననూతనంగా చేరుతున్న వారందరూ క్రమశిక్షణతో, అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. మహిళా కార్మికులు భూగర్భ గనులలో విధులు నిర్వహించడానికి సంసిద్ధంగా ఉండాలని, సంస్థలో యువ శక్తి పెరుగుతున్నదని రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఆయన కోరారు. విధ్యావంతులైన నూతన ఉద్యోగులు తమ పనితనాన్ని కనబరుచుతూ, "నాగాలు వద్దు డ్యూటీయే" ముద్దు అనే నినాదాన్ని మదిలో పెట్టుకొని గైర్హాజర్లకు దూరంగా ఉంటూ ఎన్నో ఉన్నత పదవులకోసం శ్రమించాలని జి.యం. చెప్పారు.



# దేశ రక్షణ కోసం ఒక నెల జీతం విరాళం

## - శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 10 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు భారత రక్షణ నిధికి తాను ఒక నెల జీతం ఇస్తున్నట్లు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. తనతోపాటు శాసనమండలి వైస్ చైర్మన్, శాసనమండలి సభ్యులను కూడా భారత రక్షణ అనేది ఒక నెల వేతనాన్ని ఇవ్వాలని ఆయన కోరారు. పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల నరమేధం తర్వాత భారత రక్షణ దళాలు చేపట్టిన అన్ని చర్యలను తమ సమర్థిస్తూ ఏకీభవిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే పూర్తిస్థాయి యుద్ధం జరిగేటట్లుగా కనబడుతుందని ఆయన చెప్పారు భారత్ పాకిస్తాన్‌పై ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తుంటే పాకిస్తాన్ మాత్రం భారత పౌరులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం విశారకరమన్నారు. ఇది యుద్ధ నీతి కూడా కాదని ఆయన పాకిస్తాన్ చర్యలను తీవ్రంగా ఖండించారు. పాక్ ఆక్రమించే కాశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకుని భవిష్యత్తులో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడం లక్ష్యంగా తీసుకుంటున్న భారతీయులను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దేశానికి అండగా నిలవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. పాకిస్తాన్ తీవ్రవాదానికివ్యతిరేకంగాభారత్‌తీసుకుంటున్న ప్రతి చర్యలనుతాముపూర్తిగా సమర్థించడం తోపాటు దేశానికి రక్షణ వ్యవస్థకు అండగా నిలబడతామని ఆయన స్పష్టం చేశారు



# అధునాతన వైద్య పరికరాలతో మెరుగైన వైద్యం

## - టచ్ ఆసుపత్రి కార్డియోలాజిస్ట్ డాక్టర్ బి రాజేష్

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, మే 10 : గుండె నొప్పితో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు అధునాతన వైద్య పరికరాలతో మెరుగైన వైద్యం అందించి, కాపాడటం జరిగిందని టచ్ ఆసుపత్రి కార్డియోలాజిస్ట్ డాక్టర్ బి రాజేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టచ్ ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి యాజమాన్యం, కార్డియోలాజిస్ట్ డాక్టర్ బి రాజేష్ మాట్లాడుతూ, సరోజ అనే మహిళా తీవ్రమైన ఛాతి నొప్పితో ఆసుపత్రికి రాగా, ఆమెను ఆసుపత్రి కార్డియోలాజిస్ట్ డాక్టర్ రాజేష్, వైద్య బృందం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి, హార్ట్ ఎటాక్ వచ్చిందని నిర్ధారించారు. వెంటనే బంధువుల అంగీకారంతో ఆంజియోగ్రాం పరీక్ష నిర్వహించగా, అందులో గుండెలోని మెయిన్ రక్తనాళం లో మొదటి భాగంలో 95 శాతం బ్లాకేజ్ ఉండటం జరిగిందని గుర్తించారని, దీనిలో స్టంట్ వేయడం చాలా కష్టమని, మామూలుగా ఓపెన్ హార్ట్ సర్జరీకి పంపిస్తారని, కానీ టచ్ ఆసుపత్రిలో ఐవియూఎస్ కెమెరా గైడింగ్ అనే ఆధునాతనమైన చికిత్సతో, ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా స్టంట్ వేయడం జరిగిందని వివరించారు. దీంతో రోగి, బంధువులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. హార్ట్ ఎటాక్ అనేది అత్యవసర వైద్య పరిస్థితి అని, ఇది సమయానికి సరైన చికిత్స అందించకపోతే ప్రాణాంతకం కావచ్చునన్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే ఆసుపత్రికి చేరుకోవడం ఎంత ముఖ్యమని వివరించారు. హార్ట్ ఎటాక్ పేషంట్లకి సమయం ఎంత విలువైనదని, దానిని వృధా చేయకుండా ఇలాంటి అధునాతమైన వైద్య సేవలు కోసం దూర ప్రాంతాలు వెళ్లాల్సిన అవసరం లేదని, మంచిర్యాల లోని టచ్ ఆసుపత్రిలో అన్ని రకాల అధునాతమైన వైద్య సేవలు ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





# దళితులపై దాడి చేసిన నిందితునికి ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి

## - తుడుం దెబ్బ నాయకులు డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి, మే 10 : మహాముత్తారం మండలం బోర్లగూడెం గ్రామం దళిత కుటుంబానికి చెందిన గుండం సాగర్‌పై ఆదిపత్య కులం చేసిన దాడిని తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు రామినేని సురేందర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా రామినేని సురేందర్ దాడికి సంబంధించిన వివరాలు తెలుపుతూ గత వారం రోజుల క్రితం మహాముత్తారం మండలం బోర్ల గూడెం గ్రామం ఎస్టీ నాయక పోడు తెగకు చెందిన గుండం సాగర్‌పై అదే గ్రామానికి చెందిన బీసీ గౌడ కులానికి చెందిన మోడెం నరసయ్య, మోడెం గణేష్, మోడెం మహేష్ మొడెం వసంతలు పథకం ప్రకారం పబ్లిక్ మధ్యలో విపరీతంగా కొట్టి అవమాన పరచడం జరిగిందన్నారు. తీవ్రమైన గాయాలతో రక్తంతో తడిసిన సాగర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కోసమని వెళ్ళగా కనీసం మానవత్వం చూపకుండా వ్యవహరించడం జరిగిందన్నారు. జరిగిన దాడి నిజమేనని, సాగర్‌ను అవమాన పరుస్తూ కుల ఆధారంగా జరిగిందని విచారణలో నిర్ధారణ అయినప్పటికీ ఆధిపత్య కులం ఉద్దేశపూర్వకంగా జరిపిన దాడిగా పరిగణించకుండా సాధారణ కేసుగా రిజిస్టర్ చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో తీసుకున్న ఫిర్యాదులో కానీ, వారు రిజిస్టర్ చేసిన ఎఫ్ఐఆర్‌లో గాని పరిశీలిస్తే ఎక్కడ కూడా దాడి చేసిన వారి కులాన్ని నమోదు చేయలేదని తెలిపారు. దీనిని బట్టే రాజకీయ నాయకుల ఒత్తిళ్ల వల్ల ఈ కేసుని నీరు గార్చారని విధిత మవుతుందని పేర్కొన్నారు. ఈ విషయంపై కాటారం డిఎస్పీకి కలిసి బాధితునికి జరిగిన అన్యాయాన్ని వివరించి, దాడి చేసిన నిందితులను కచ్చితంగా శిక్షించాలని బాధితుని పక్షాన కోరడం జరిగిందన్నారు. దీనిపై డీఎస్పీ దాడికి సంబంధించిన పూర్వ పరాలు తెలుసుకొని సానుకూలంగా స్పందిస్తూ జరిగిన దాడికి అట్రాసిటీ నమోదు చేసే అర్హత ఉంది అంటూ కచ్చితంగా బాధితునికి న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు.





# సహనానికి, ఓపికకు హద్దు ఉంటుంది

## - చాలా సంవత్సరాలు ఓపికగా చూసాం
## - ఇప్పుడు భరించేది లేదు... దేశ ప్రజల భద్రతే ముఖ్యం
## - దేశంలోని ప్రతీ యువతీ యువకుడు త్యాగానికి సిద్ధంగా ఉండాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్, మే 10 : సహనానికి, ఓపికకు హద్దు ఉంటుందని, చాలా సంవత్సరాలు ఓపికగా చూసామని, ఇప్పుడు భరించేది లేదు... దేశ ప్రజల భద్రతే మాకు ముఖ్యం... అంటూ దేశంలోని ప్రతీ యువతీ యువకుడు త్యాగానికి సిద్ధంగా ఉండాలని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు పిలుపు నిచ్చారు. సూరారంలోని మల్లారెడ్డి హెల్త్ సిటీలో దేశ సైనికులకు సంఘీభావంగా నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ఇంత చక్కటి కార్యక్రమం ఏర్పాటుచేసిన మల్లారెడ్డి. ఇక్కడి ఎమ్మెల్యే వివేక్ గౌడ్‌ని నేను అభినందిస్తున్నాను. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు సంఘీభావంగా ఈ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమన్నారు. భారత దేశ సైనికులను చూసి గర్వపడుతున్నాం. సరిహద్దులు అంటే భౌగోళికంగానే కాదు, ఈ దేశ ప్రజల భద్రత, దేశ భవిష్యత్తు కూడా. దానిని నిలబెట్టడానికి సైనికులు పోరాడుతున్నారు. పాకిస్తాన్ మన దేశం నుండి విడిపోయినప్పటికీ మన దేశాన్ని ఇబ్బంది పెట్టాలని ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నది. ముంబైలో తాజ్ హోటల్ పై పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేశారు. వారు పాకిస్తాన్ పంపిన ఉగ్రవాదులు అని ప్రపంచం ముందు ఆ దేశాన్ని దోషిగా నిలబెట్టింది భారతదేశం. అమెరికా లాంటి దేశాలపై కూడా బిన్ లాడెన్ లాంటి ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి దాడులకు తెగబడ్డారని పేర్కొన్నారు. సహనానికి, ఓపికకు హద్దు ఉంటుంది. చాలా సంవత్సరాలు ఓపికగా చూసాం. ఇప్పుడు భరించేది లేదు దేశ ప్రజల భద్రతే ముఖ్యం. మతం పేరు అడిగి టూరిస్టులను చంపడం దేశ ప్రజల మనసులను కలచి వేసింది. భారతదేశ మీద జరుగుతున్న దాడికి పరిష్కారం చూపిస్తూ ఉగ్రవాదులపై దాడి చేయడం సరైన చర్య. ఇలాంటి సమయంలో దేశంలోని ప్రతీ యువతీ యువకుడు త్యాగానికి సిద్ధంగా ఉండాలి. యుద్ధానికి అవసరం పడితే అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు మల్లారెడ్డి హెల్త్ యూనివర్సిటీ కూడా ముందుకు రావాలి. సైనికుల కోసం రక్తదానానికి మేము సిద్ధంగా ఉన్నాం. బార్డర్లో మనం పోరాటం చేయకపోవచ్చు కానీ సైనికులకు అవసరమైనటువంటి రక్తాన్ని, వైద్యాన్ని అందించే బాధ్యత దేశ ప్రజలపై ఉంది. సైనికుల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత ఈ దేశ ప్రజలపై ఉంది. భారత సైనికుల్లారా మీరు బార్డర్లో మా కోసం పోరాటం చేస్తున్నారు మీ వెనుక 140 కోట్ల మంది భారతీయులు ఉన్నారు. మీ ధైర్యమే మాకు శక్తి, మీ నిబద్ధత మాకు గర్వకారణం, మీ పోరాటం మాకు స్ఫూర్తని అన్నారు.

# రైస్ మిల్లర్లు ఎలాంటి కోతలు విధించవద్దు

## - లారీల సరఫరా ఆలస్యం వలన ధాన్యం తడిస్తే లారీల కాంట్రాక్టర్‌దే బాధ్యత
## - ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలి - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
## - చందుర్తి, కోనరావుపేట మండలాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల (చందుర్తి/కోనరావుపేట), మే 10 : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే రైతుల ధాన్యంలో ఎలాంటి కోతలు విధించవద్దని రైస్ మిల్లర్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. చందుర్తి మండల కేంద్రం, మూడపల్లి, మర్రిగడ్డ, మల్యాల, కోనరావుపేట మండలం బావుసాయిపేట, గోవిందరావుపేట తండా, వట్టిమల్ల, గొల్లపల్లి, నిమ్మపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి. ధాన్యం కొనుగోళ్ళ తీరును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారు? ఇంకా ఎంత ధాన్యం వచ్చే అవకాశం ఉంది అని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. లారీ కాంట్రాక్టర్ లు ప్రతి సెంటర్ కు లారీలను సకాలంలో ఏర్పాటు చేయాలని, కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు అకాల వర్షాలకు తడవకుండా రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. సకాలంలో లారీల సరఫరా సకాలంలో చేయకుండా జాప్యం వలన అకాల వర్షాలకు ధాన్యం తడిస్తే వారికి సంబంధిత లారీల కాంట్రాక్టర్ కు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యంలో రైస్ మిల్లర్లుఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం అన్లోడ్ చేసుకోవాలని లేనియెడల వారిపై ఎస్మ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకొనబడునని మిల్లర్లను, లారీ కాంట్రాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు.

### రైతులు ఆందోళన చెందవద్దు

కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ



పూర్తి చేయాలని, రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరత లేదని స్పష్టం చేశారు. వాహనాల గురించి రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఏపీఎం లు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

కలెక్టర్ వెంట డీఆర్డీఓ శేషాద్రి, ఐకేపీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# ఆపరేషన్ సింధూర్ సంఘీభావ ర్యాలీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రంగారెడ్డి, మే 10 : అమరుడా నీకు వందనం భారత్-పాక్ యుద్ధంలో జవాన్ మురళి నాయక్ వీరమరణం అంటూ ఆపరేషన్ సిందూర్ సంఘీభావ ర్యాలీ నిర్వహించి అమర వీర జనాన్ మరళినాయక్‌కు నివాళులర్పించారు. జమ్మూ కాశ్మీర్లో విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన యువతేజం మురళి నాయక్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ శనివారం మియాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్ లో 9 ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని ప్రశంసించారు. పాకిస్తాన్ మన దేశంలోని ఎయిర్ పోర్టులను టార్గెట్ చేసుకొని చేసిన దాడులను భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టిందని తెలుపుతూ, ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా మియాపూర్ బొల్లారం చౌరస్తా నుండి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా భారత ఆర్మీకి బలం చేకూర్చే విధంగా కులాలకు, మతాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ఏకమై తమ మద్దతు తెలపాలని కోరారు. అంతేకాకుండా పోరాటంలో భారత ఆర్మీ గెలవాలని అన్ని డివిజన్లో పూజలు, అర్చనలు, ప్రార్థనలు చేసి భారత ఆర్మీకి ఆ భగవంతుని అండదండలు పుష్కలంగా ఉండే విధంగా మనమంతా మద్దతు ప్రకటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిరామ్, ప్రభాకర్, లక్ష్మణ్, గణేష్ సురేష్, శ్రీనివాస్, రాము, విజయేందర్, భాష, నాగులు మొదలగు వారు పాల్గొన్నారు

## అవేసవిలో దొంగతనాలు జరగకుండా

# అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

## - జిల్లా ఎస్పీ రావుల గిరిధర్
## - పెబ్బేరు పోలీస్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ
## - పోలీస్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేయాలని ఆదేశం
## - రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే 10 : వేసవిలో పిల్లలకు సెలవులు ఉండటంతో చాలామంది ప్రయాణాలు చేస్తారు ఇదే అదునుగా దొంగలు చేతివాటం చూపిస్తారు ఊళ్ళకు వెళ్లేవారు ఇంటి బయట నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్టేషన్‌ను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ పోలీస్టేషన్ పరిసరాలను తనిఖీ చేసి పోలీస్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై వాటి ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా గట్టిగా గస్తీ నిర్వహిస్తూ ఆరికట్టాలను సూచించారు. పోలీస్టేషన్లో నమోదైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణ తప్పకుండా నవీకరిస్తూ ఉండాలని, ఎటువంటి పెండెన్సీ లేకుండా రికార్డుల నిర్వహణ చేయాలనే సూచించారు. పోలీస్టేషన్లో రిసెప్షన్ సెంటర్ ను పరిశీలించి బాధితుల పట్ల వ్యవహరించే తీరును, ఫిర్యాదులను పరిష్కరించే తీరును పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మమేకమై సత్సంబంధాలను మెరుగుపరుచుకుంటూ, ఎలాంటి రిమార్కులు లేకుండా, ప్రజలలో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే విధంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బంది గ్రామ గ్రామాన సందర్శిస్తూ సమాచార సేకరణలో ముందుండాలని సూచించారు. పెబ్బేరు ఎస్సై, యుగంధర్ రెడ్డి, పోలీసుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# 'ఖని'లో మే 17న 'గోదావరి కళోత్సవాల' 27వ వార్షికోత్సవ వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 10 : గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని స్ఫూర్తి భవన్ లో శనివారం గోదావరి కళాసంఘాల సమాఖ్య సమావేశం నిర్వహించారు. మే 17న గోదావరిఖనిలో నిర్వహించనున్న గోదావరి కళోత్సవాలను విజయవంతం చేయడానికి సమాఖ్య అధ్యక్షులు కనకం రమణయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు సంస్థ వ్యవస్థాపక సభ్యులు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చర్ అకాడమీ అధ్యక్షులు బొంకూరి మధు, వ్యవస్థాపక సభ్యులు, అభినయ కల్చరల్,ఆర్ట్స్ అధ్యక్షులు, రేణిగుంట్ల రాజమౌళి, సలహాదారులు కాశి పాక రాజమౌళి, మాట్లాడారు. అనంతరం గోదావరి కలోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు, ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు కళా సంస్థల,అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్ కళాకారులు తదితరులు పాల్గొన్నారు



# భూ నిర్వాసితులకు అర్హతల ఆధారంగా సరైన పరిహారం అందించాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష. - మంథని మండలంలో పుట్టపాక గ్రామంలో భూనిర్వాసితుల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంథని, మే 10 : జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు అర్హతల ఆధారంగా సరైన పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం మంథని మండలంలో పుట్టపాక గ్రామంలో భూ నిర్వాసితుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వరంగల్ మంచిర్యాల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు సరైన పరిహారం అర్హతల ఆధారంగా అందాలని అన్నారు. రైతులు అందించిన భూములలో ఉన్న బావులు, మోటార్, పైప్ లైన్, పండ్ల , అటవీ చెట్లు మొదలగు నిర్మాణాలకు పరిహారం సరిగ్గా అందలేదని నిర్వాసితులు దరఖాస్తులు అందించారని కలెక్టర్ తెలిపారు. నిర్వాసితులు అందించిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హతల ఆధారంగా భూ సేకరణ జరిగే భూములలో ఉన్న నిర్మాణాలకు సరైన విలువ చూపిస్తూ ప్రతిపాదనలు తయారు చేసి అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు భూమిలో ఉన్న ప్రతి నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందజేసేలా చర్యలు తీసుకుంటామని, అధికారులు అందించే నివేదిక ప్రకారం జాతీయ రహదారుల సంస్థకు ప్రతిపాదనలు పంపి నిర్వాసితులకు పరిహారం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీవో సురేష్ , జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య, ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, హార్టికల్చర్ జిల్లా అధికారి జగన్మోహన్ రెడ్డి, తహ సిల్దార్ కుమారస్వామి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# గెలుపు ఓటములను సమానంగా చూడాలి

## - జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ - అంతర్జాతీయ స్థాయిలో రాణించి - జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి - ఉత్సవాలను ప్రశాంతంగా భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలి - ఉమ్మడి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను, - ఉత్సవాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 10 : ఆటలోని గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించి క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనపర్చాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్‌లి అన్నారు. శనివారం రోజు పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న శ్రీ భూ సమేత శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమం, ఉమ్మడి తెలుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు హాజరైన జిల్లా ఎస్పీని దేవాలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా పూర్ణ కుంభంతో స్వాగతం పలికి స్వామివారికీ పూజా కార్యక్రమం నిర్వహించి ఎస్పీని సన్మానించారు. ఉత్సవాలను ప్రశాంతంగా భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని ఆయన ప్రజలను కోరారు. సాంప్రదాయ నృత్యాలతో భక్తులను అలరించిన మహిళలను అభినందించి 2వేల నగదు బహుమానం అందజేశారు అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి ఇరుజట్ల క్రీడాకారులను కరచాలనం చేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఏ ఆటలోనైనా గెలుపు ఓటములు సహజమని వాటిని సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక వికాసం, మనోధైర్యం, దేహదారుఢ్యం పెంచుకోవచ్చని అయితే ఆటల్లో ప్రతి ఆటగాడు తన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కబడ్డీ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణ రాష్ట్రానికి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, వెంకటేశ్వర రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్, తేజ వర్ధన్,గ్రామస్తులు, గోపాల్, నీలవరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కృష్ణయ్య, భాస్కర్, శ్యాంసుందర్, రాము, బాలగౌడ్, సోమగౌడ్, రవీందర్, గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ శక్తి తో... మహిళల సాధికారికత, బాలికల భద్రత.. భరోసా

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, మే 10 : మిషన్ శక్తి ద్వారా జిల్లాలోని బాల,బాలికలకు భద్రత, భరోసా కల్పించడంతోపాటు మహిళల సాధికారత కోసం వివిధ అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ శాఖ ద్వారా మహిళలు సామాజిక,ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడం కోసం...క్షేత్రస్థాయిలో మహిళా చైతన్యానికి..జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు (395) అవగాహన కార్యక్రమాలను చేపట్టి.. తద్వారా జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య సభ్యులకు గాను మొత్తం (31,247) మందికి మహిళా సాధికారతకు కావల్సిన అన్ని ప్రభుత్వ పథకాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించామన్నారు. అలాగే బాల బాలికల సంరక్షణ, అభివృద్ధి, రక్షణ కోసం వివిధ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాలికలు ఉపయోగించిన శానిటరీ నాప్కిన్స్‌ని చెత్త డబ్బాల్లో వేయటం వల్ల నాప్కిన్లోని ప్రమాదకరమైన రసాయనాల కారణంగా ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తకుండ... ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలికల కోసం ఇన్సినరేటర్లను జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలల్లో ఏర్పాటు చేశామన్నారు. జిల్లా సంక్షేమ అధికారిణి, జిల్లా హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ నిర్వహించిన బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం కింద జిల్లాలోని (12) కేజీబీవీలు, మోడల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, సాంఘీక సంక్షేమ కళాశాలలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, ఎస్టీ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల కోసం రుతుక్రమ సంరక్షణకు శానిటరీ నాప్కిన్ లను దహనం చేసే ఇన్సినరేటర్ (దహన యంత్రం)లను ఏర్పాటు చేసామన్నారు అంతే కాకుండా..బాలికల భద్రత, రక్షణ, రుతుచక్ర పరిశుభ్రత, పౌష్టికాహారం తీసుకోవడం, తదితర అంశాల పైన అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అత్యంత జాగ్రత్తగా వీటిని ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది విద్యార్థినులకు ప్రయోజనం చేకూరిందని



జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు

**ఇన్సినరేటర్ మాకు చాలా ఉపయోగకరం**

ఈ శానిటరీ నాప్కిన్స్ దహన యంత్రాన్ని మేము బాగా ఉపయోగించుకుంటున్నాం. ఒకప్పుడు వాడిన నాప్కిన్ లను చెత్త డబ్బాల్లో వేసేవాళ్ళం. దాంతో దుర్వాసన వచ్చేది. కానీ ఇప్పుడు ఈ యంత్రాన్ని వినియోగించుకుంటూ ఆరోగ్యవంతంగా ఉన్నాం.సీహెచ్. వినిత, 9వ తరగతి విద్యార్థిని, కేజీబీవీ, లింగాల ఘనపురం

**సురక్షితంగా ఉంటున్నాం**

ఈ ఇన్సినేరేటర్ వాడకంతో మాకు ఎలాంటి ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తకుండా సురక్షితంగా ఉంటున్నాం. ఏ. తేజ శ్రీ, 9వ తరగతి విద్యార్థిని, కేజీబీవీ, పాలకుర్తి

**జిల్లా కలెక్టర్‌కి ధన్యవాదాలు**

విద్యార్థినులు ఉపయోగించే శానిటరీ నాప్కిన్స్ అందులో వేసి కాల్చడం జరుగుతుందని... దీంతో పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని, వీటిని ఏర్పాటు చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన కలెక్టర్ కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



# మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

## - జిల్లాలో మొత్తం 107 మైనర్లు - వారి తల్లిదండ్రులు మందికి కౌన్సిలింగ్ - జిల్లా ఎస్పి డా.జి.జానకి షర్మిల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 10 : రోడ్డు ప్రమాదాల నియంత్రణలో బాగంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరుగులో మైనర్ డ్రైవింగ్‌లపై శనివారం తనిఖీలు నిర్వహించటం జరిగింది. అన్ని పోలీస్ స్టేషన్ల పరిదిలో 70 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు, 70 వాహనాలు, మైనర్లు వారి తల్లిదండ్రులు కలుపుకొని 107 మందికి అవినాష్ కుమార్, ఏ.ఎస్పీ భైంసా రాజేష్ మీన, ఏ.ఎస్పీ నిర్మల్ స్వయంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. మోటార్ వాహన చట్ట ప్రకారం వాహన యజమాని బాధ్యత వహించాలని, తల్లి దండ్రులు ఇట్టి విషయం గ్రహించాలని కోరారు.

# క్రమశిక్షణ, నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించాలి

## - జిల్లా పోలీస్ సిబ్బందితో ఆన్లైన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఎస్పి డా.జి.జానకి షర్మిల




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 10 : సమయపాలనా పాటిస్తూ క్రమశిక్షణ, నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పి డా.జి.జానకి షర్మిల. అన్నారు శనివారం జిల్లా పోలీస్ సిబ్బంది తో ఆన్లైన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ప్రత్యేకంగా బ్లూ కోల్ట్,పెట్రోల్ కార్ వారి డ్యూటి ల గురించి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్లూ కోల్ట్ పెట్రోల్ కార్‌లో విధులు గర్వంగా నిర్వర్తించండి. ఈ ఉద్యోగాల్లో ఉన్నంత సమయం క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ, మంచి టర్న్ అవుట్ తో అప్పగించిన విధులు గర్వంగా నిబద్దతతో నిర్వహించమన్నారు. క్రమశిక్షణ తో సమయపాలన పాటిస్తూ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని వివరించారు. విధులు పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నీతి,నిజాయితీతో పనిచేసే వారికి పోలీస్ శాఖలో ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. ఏదైనా పిటిషన్ వస్తే వారిని ఎక్కువసేపు వెయిట్ చేయించకుండా వారి బాధలను తెలుసుకొని వారి దగ్గర నుండి సమాచారం తీసుకుని వారి ఫోన్ నెంబర్ ని కూడా తీసుకొని ఎస్ హెచ్ ఓ లేనియెడల వారిని తక్షణమే పంపాలని తెలీజేసారు. వచ్చిన ప్రతి పిర్యాడుదారులతో మర్యాదగా మాట్లాడటం ద్వారా చిన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. పోలీస్ స్టేషన్కు వచ్చే పిటిషన్ల ద్వారా ఇన్ఫర్మేషన్ సిస్టం ను డెవలప్ చేసుకోవాలని తెలియజేసారు. డ్యూటీ లో ప్రతిభ కనపర్చిన వారికి రివార్డులు కొరకు అప్లికేషన్ పంపమని చెప్పారు. నిర్మల్ పోలీస్ మీ పోలీస్ అనే నినాదంతో ప్రతి మాటలోనూ ప్రతి పనిలోనూ ప్రతి అడుగులోను మన పోలీస్ సిబ్బంది చూపించాలి అని అన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక పనులు చేసే వారిపైన చట్ట పరమైన మరియు శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. ప్రజలతో మరియు గ్రామ పెద్దమనుసులతో దగ్గరయ్యి గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించాలని సూచించారు. పెట్రోలింగ్ రాత్రిపూట ఎక్కువగా చేస్తూ దొంగతనాలు జరుగకుండా చూడాలన్నారు. పాత నేరస్తులను యొక్క పనులపై ఒక కంట కనిపెడుతూ ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. మైనర్ డ్రైవింగ్ మీద స్పెషల్ చేపట్టి సోమవారం వారి తల్లిదండ్రులకు, వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఏఎస్పి అవినాష్ కుమార్, ఏఎస్పి రాజేష్ మీన , జిల్లాలోని ఇన్స్పెక్టర్లు అందరూ ఇన్స్పెక్టర్లు , ఆర్ఐ లు, ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు, ఐటీ, డి.సీ.ఆర్.బీ, జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# సింగరేణి సంస్థ క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంది


## - భూపాలపల్లి ఏరియా జి.ఎం. ఏనుగు రాజేశ్వర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

భూపాలపల్లి, మే 10: సింగరేణి సంస్థ క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి చెప్పారు. శనివారం స్థానిక కృష్ణ కాలనీ, అంబేద్కర్ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్.సి.ఏ.) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్రికెట్ శిక్షణ శిభిరానికి జనరల్ మేనేజర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు కావలసిన వసతి సౌకర్యాలు కల్పించడంలో సింగరేణి ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన భూపాలపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.నరేష్ మాట్లాడుతూ క్రీడలు యువకులకు మానసిక ఉల్లాసం కల్పించడమే కాకుండా శారీరక దృఢత్వాన్ని కలిగిస్తుందని, క్రమశిక్షణ నేర్పిస్తుందని అన్నారు. అంతేకాకుండా యువత మత్తు పానీయాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

# జాతీయరక్షణ నిధికి ఒక నెల జీతం విరాళం

## స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

అమరావతి, మే 10 : దేశ రక్షణ కోసం పోరాడుతున్న వీరజవాన్లకు సంఘీంభావంగా తన ఒక నెల వేతనం (రూ.2,17,000) జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇస్తున్నట్లు ఎపి అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉగ్రవాద నిర్మూలనలో భారత సాయుధ దళాలు ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలు దేశ ప్రజలందరికీ గర్వకారణంగా నిలుస్తున్నాయని అన్నారు. భారతదేశం సాయుధ దళాలు చేస్తున్న ధైర్యసాహసాలు ప్రతి భారతీయునిలో గర్వాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న వీర జవాన్లకు సంఘీభావం తెలిపారు. తన నెల జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. ఈ మేరకు తన నెల జీతం రూ.2,17,000లను ఆన్ లైన్ ద్వారా జాతీయ రక్షణ నిధికి ట్రాన్స్‌ఫర్ చేసినట్లు.. రిసిప్ట్‌ను కూడా ఆయన విడుదల చేశారు.

# పాక్ అరాచకాలకు గట్టిగా సమాధానం చెబుతున్న మోడీ






మొదటిపేజీ తరువాయి

ఉగ్రవాదుల దాడికి గానూ పాకిస్తాన్ క్షమాపణ చెప్పాల్సింది పోయి.. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో, పౌర నివాసాలపై, సైనికులకు సంబంధించిన కేంద్రాలపై దాడులు చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల నిర్మూలన లక్ష్యంగా పోరాటం చేస్తున్న భారత సైనికులకు ఆత్మస్థైర్యం, శక్తి, విజయం కలగాలని శనివారం బషీర్‌బాగ్ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భారతదేశానికి మద్దతుగా భక్తులు నినాదలు చేశారు. జై శ్రీ రామ్.. జై రామ్ లక్ష్మణ్ జానకి.. జై బోలో హనుమాన్‌కి.. జై భవానీ.. జై శివాజీ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. దేశ భద్రత కోసం పోరాడుతున్న యోధుల రక్షణకు అమ్మవారి ఆశీర్వాదం కలగాలని కిషన్‌రెడ్డి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పహల్గామ్‌లో అమాయకులైన 26 మంది భారత పౌరులను పాకిస్తాన్ ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా కాల్చిచంపారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చాలా సంవత్సరాలుగా భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయాలని పాకిస్తాన్ కుయుక్తులు పన్నుతోందని ధ్వజమెత్తారు. మన దేశ సమగ్రత, సమైక్యతను దెబ్బతీయాలని, దేశ అభివృద్ధిని అడ్డుకోవాలని పాకిస్తాన్ చాలా ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. గతంలో భారత సైనికులు, పౌరులను కిరాతకంగా పాకిస్తాన్ ఉగ్రవాదులు హత్యచేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో కూడా లుంబినీ పార్కు, కోఠిలోని గోకుల్ చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయ పరిసరాల్లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడులు జరిపి చాలామందిని పొట్టనబెట్టు-కున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశ అమాయకులైన ప్రజలపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులు జరుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మన దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా అందరూ ఏకమై ముక్తకంఠంతో పాకిస్తాన్ దుశ్చర్యలను ఖండిస్తున్నారని చెప్పారు. భారత సైనికులకు అండగా నిలబడ్డారని తెలిపారు. దేశ భద్రత కోసం పోరాటం చేస్తున్న భారత సైనికులకు మద్దతుగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి గ్రామం, మండలం, జిల్లాలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక ర్యాలీలు నిర్వహించాలని తెలుగు రాష్ట్రాల ప్రజలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత సైనికులకు మరింత ఆత్మస్థైర్యం కల్పించేలా ప్రజలు సంఘీభావాన్ని తెలియజేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## భారత్-పాకిస్థాన్ మధ్య తక్షణ కాల్పుల విరమణ

మొదటిపేజీ తరువాయి

మార్గాల్లో అన్ని రకాల కాల్పులు, సైనిక కార్యకలాపాలను నిలిపివేయాలని ఇరు దేశాలు అంగీకరించినట్లు విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఈ మేరకు పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) ఈ మధ్యాహ్నం భారత డీజీఎంఓతో ఫోన్‌లో సంభాషించారని, ఈ సంభాషణలోనే ఇరుపక్షాలు ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. అంతకుముందు, అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన బృందం సుదీర్ఘ చర్చల అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య 'సంపూర్ణ మరియు తక్షణ కాల్పుల విరమణ'కు మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే న్యూఢిల్లీ నుంచి అధికారిక ప్రకటన వెలువడటం గమనార్హం. అటు, పాక్ నుంచి అందించిన సమాచారం ప్రకారం, ఈ కాల్పుల విరమణ ఒప్పందం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు తెలుస్తోంది.ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారులు మే 12వ తేదీన మరోసారి చర్చలు జరపనున్నారని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. ఈ చర్చల్లో సరిహద్దుల్లో శాంతిభద్రతల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఉగ్రదాడి ఇక యుద్ధ చర్యే... అందుకు దీటుగా బదులిచ్చేందుకు సిద్ధం

మొదటిపేజీ తరువాయి

సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇకపై ఉగ్రవాద చర్యలను కేవలం అంతర్గతా భద్రతా చర్యలుగానే పరిగణించలేమని, ప్రతిస్పందన అత్యంత భీకరంగా ఉంటుందనే ప్రత్యక్ష హెచ్చరిక సందేశాన్ని భారత్ ఇచ్చినట్లయింది. భారత్-పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ కీలక పరిణామం చోటు-చేసుకుంది. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో వరుసగా దాడులకు పాల్పడుతోంది. విమానాశ్రయాలు, సామాన్య పౌరులే లక్ష్యంగా దాయాది ఈ చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులపై ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే గత రెండు రోజులుగా జమ్మూకశ్మీర్, పంజాబ్‌లోని ప్రాంతాల్లో పాకిస్థాన్ చేసిన డ్రోన్ల దాడులను భారత ఆర్మీ సమర్థంగా ఎదుర్కొంది. ఆ దాడులకు ప్రతిస్పందనగా భారత ఆర్మీ ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లపై ఎటాక్ చేసి ధ్వంసం చేసింది. దానికి సంబంధించిన వీడియోను ఇండియన్ ఆర్మీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. భారత సరిహద్దుకు దగ్గరగా ఉన్న ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల నుంచి గతంలో భారత పౌరులు, భద్రతా దళాలపై దాడులకు ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడి నుంచి దాడులు కూడా చేశారు. భారత సైన్యం సత్వరమే స్పందించి ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. ఇప్పుడు లాంచ్‌ప్యాడ్‌ను ధ్వంసం చేయడంతో వారి మౌలిక సదుపాయాలు, సామర్థ్యాలకు భారీ దెబ్బ తగిలిందని పోస్టులో భారత ఆర్మీ తెలిపింది. ఇకపోతే పాకిస్థాన్ కావాలనే భారత్‌ను రెచ్చగొడుతోందని, యుద్ధానికి పురిగొల్పుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ద్వైపాక్షిక చర్చలు, వెనక్కి తగ్గుతామని ప్రకటించినా ఆ దేశాన్ని అంత సులువుగా నమ్మకూడదని అంటున్నారు. గతానుభవాలే ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. భారత్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి కాలు దువ్వితే పాక్ ఆక్రమిత కశ్మీర్, బలోచిస్థాన్ వంటివి కోల్పోవాల్సి వస్తుందని బయం కూడా పాక్‌లో ఉందంటున్నారు. పహల్గాంలో పర్యాటకానికి వచ్చిన వారిని మతం అడిగి మరీ పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డాక దానికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. భారత్ కేవలం పాక్ ఉగ్రస్థావరాల మీదే దాడికి పాల్పడింది. మిలటరీ, పౌరుల జోలికి పోలేదు. భారత్ తనంతట తానుగా యుద్ధాన్ని కోరుకోవడం లేదనడానికి ఇదే నిదర్శనం. పాక్ పరిస్థితి వేరు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్నా.. భారత్‌ను చూసి ఓర్వలేక కావాలనే కయ్యానికి కాలు దువ్వుతోంది. అక్కడి ప్రజలను, దేశ ఆర్థిక పరిస్థితి గురించి పట్టించుకునే పరిస్థితిలో ఆ దేశం లేదు. అక్కడి మిలటరీదే పైచేయి. ఉగ్రవాదుల్ని ముందు పెట్టి మిలటరీ వెనుకుండి నడిపిస్తోందని వీరు అభిప్రాయపడ్డారు. భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని పాక్ విదేశాంగ శాఖ మంత్రి చేస్తున్న వ్యాఖ్యలను నమ్మరాదనికూడా వీరు హెచ్చరిస్తున్నారు. ఇలా చెబుతూనే మరోవైపు తమ సైన్యాన్ని సరిహద్దులవైపు నడిపిస్తోంది. మన దృష్టి మరల్చేందుకు పాక్ ఇలాంటి కుయుక్తులను పన్నుతుందని, పాక్ ఎప్పుడు ఏ మూల నుంచైనా దాడి చేసే అవకాశం ఉందని గుర్తుంచాలని అన్నారు. పాక్ ఓ వైపు డ్రోన్లను ప్రయోగిస్తోంది. స్కూళ్లు, ప్రార్థనా మందిరాలు, ఆస్పత్రుల మీద దాడులు చేస్తోంది. మనం పాక్ పౌరుల జోలికి పోకపోయినా.. దాయాది దేశం మాత్రం ఉన్మాదంతో ఈ తరహా దాడులకు పాల్పడుతోంది. తమ ఆర్మీ బలమైనదని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఒకవేళ ప్రస్తుత ఉద్రిక్తత పరిస్థితులను నిజంగా తగ్గించుకోవాలని ఆ దేశం అనుకుంటే పాకిస్థానే వెనక్కి తగ్గాలి కదా అని అన్నారు. ఉగ్రవాదులను రెచ్చగొట్టి భారత్‌పై ఉసిగొల్పుతున్న పాకిస్థానే ఈ విషయంలో వెనక్కి తగ్గక పోవడం వెనక ఆర్మీ ప్రోద్భలం ఉందన్నారు. గతంలో భారత్‌తో పెట్టుకుని తూర్పు పాకిస్థాన్ గా ఉన్న బంగ్లాదేశ్ను కోల్పోయింది. కార్గిల్ విషయంలో ఎదురుదెబ్బ చూసింది. ఆర్థికంగానూ నష్టపోయింది. ఇప్పుడూ అదే ధోరణిని కనబరిస్తే పీఓకేను స్వాధీనం చేసుకోవడానికి భారత్ ఏమాత్రం వెనుకాడరాదని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు పాక్ బలోచిస్థాన్ రూపంలో తిరుగుబాటు- ఎదుర్కొంటోంది. ఏ క్షణంలోనైనా బలోచిస్థాన్ విముక్తి జరగొచ్చు. పాకిస్థాన్‌కు అఫ్గానిస్థాన్‌తోనూ గొడవలు ఉన్నాయని అంటున్నారు. భారత్‌తో నేరుగా తలపడలేని పాకిస్థాన్ ఓ వైపు ఫేక్‌న్యూస్‌ను ప్రచారం చేస్తోందని హెచ్చరించారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని పాక్‌ను దనుమాడాలని కూడా సూచిస్తున్నారు.

## కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి

మొదటిపేజీ తరువాయి

ఈ విషయాన్ని భారత్, పాక్ వేర్వేరు ప్రకటనల్లో ధ్రువీకరించాయి. ట్రంప్ పోస్ట్ చేసిన కాసేపటికే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సైతం ఇదే తరహా ప్రకటన చేశారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. భారత్, పాక్ ప్రధానులు నరేంద్రమోదీ, షెహబాజ్ షరీఫ్, భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసిమ్ మునీర్, ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ డోభాల్, అసిమ్ మాలిక్‌లతో మాట్లాడినట్లు- చెప్పారు. తాను, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇందుకు సంబంధించిన చర్చల్లో పాల్గొన్నామని పేర్కొన్నారు.

## అబద్ధాల ప్రచారంలో ఆరితేరిన పాక్

మొదటిపేజీ తరువాయి

పశ్చిమ సరిహద్దుల్లో పాక్ నిరంతరం దాడులు చేస్తోంది. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, లాయిటరింగ్ మ్యూనిషన్, ఫైటర్ జెట్లను వాటి.. భారత మిలిటరీ స్థావరాలపై దాడులు చేస్తోంది. చాలా ముప్పులను భారత్ తిప్పికొట్టింది. కానీ, 26 చోట్ల పాక్ ఆయుధాలు గగనతలంలోకి చొచ్చుకొచ్చాయి. అవి ఉధంపుర్, భుజ్, పఠాన్‌కోట్, భటిండా వాయుసేన స్థావరాల్లోని పరికరాలను దెబ్బతీసి, సిబ్బందిని గాయపర్చాయి. తెల్లవారుజామున 1.40 సమయంలో పాక్ హైస్పీడ్ మిసైల్స్‌తో పంజాబ్‌లోని వాయుసేన స్థావరాలపై దాడులు చేసింది. శ్రీనగర్, అవంతిపుర, ఉధంపుర్‌లో వైద్య కేంద్రాలపై దాడి చేసింది. ఇది రెచ్చగొట్టే చర్య అని కచ్చితంగా తెలుస్తోంది. దీనికి తగినట్లు ప్రతిస్పందిస్తూ.. భారత దళాలు పాక్‌లోని మిలిటరీ స్థావరాలు, రాడార్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, రాడార్లపై దాడులు చేసింది. వీటిల్లో రఫీకీ, మురిద్, చక్లాల, రహిమ్ యార్ ఖాన్, సుక్కుర్, చునియాన్ స్థావరాలు ఉన్నాయి. ఫైటర్ జెట్లతో అత్యంత కచ్చితంగా లక్ష్యాలు ఛేదించే ఆయుధాలు వాడి ఈ దాడులు నిర్వహించాము. పస్రూర్‌లో రాడార్ కేంద్రం, సియాల్ కోట్‌లోని ఏవియేషన్ బేస్‌ను ధ్వంసం చేశాము. ఈ దాడుల సందర్భంగా పౌరులు ప్రాణాలు పోకుండా చాలా జాగ్రత్తలు తీసుకొన్నాం.పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది. ఇది పరిస్థితిని మరింత దిగజార్చే ప్రమాదకర చర్యని పేర్కొన్నారు. ఇదే అంశాన్ని వ్యోమికా సింగ్ అంతర్జాతీయ మీడియా కోసం ఆంగ్లభాషలో వెల్లడించారు. భారత స్థావరాలు సురక్షితంగా ఉన్నాయని టైమ్ స్టాంప్‌లు ఉన్న వీడియోలు, ఫొటోలను ప్రదర్శించారు. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ శిర్సా, సూరత్‌ఘర్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశామని పాక్ చెప్పడం పూర్తిగా తప్పు. దీంతోపాటు ఆదంపుర్‌లోని ఎస్-400, బ్రహ్మోస్ మిసైల్ డిపో, పలుచోట్ల ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేసినట్లు- తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు. ప్రజలు ఇలాంటి వాటిని నమ్మొద్దని చెప్పారు.

## కాల్పుల విరమణపై అఖిలపక్షం

మొదటిపేజీ తరువాయి

నిర్వహించి రాజకీయ పార్టీలన్నింటికి జరిగిన పరిణామాలను వివరించాలని కోరింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం గడిచిన 18 రోజులుగా జరిగిన పరిణామాలు, కలికట్టుగా తీసుకున్న నిర్ణయాలను చర్చించేందుకు సమావేశం నిర్వహించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.ఇకపోతే భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణను స్వాగతిస్తున్నట్లు- జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఇదే ఒప్పందం రెండ్రోజుల ముందు జరిగి ఉంటే కొంత రక్తపాతాన్ని, కొన్ని జీవితాలను కాపాడిటనట్లయ్యేదని పేర్కొన్నారు. ఎట్టకేలకు ఇరు దేశాల మిలటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరల్స్ సరిహద్దుల్లో కాల్పుల విరమణకు అంగీకరించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. దాడుల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉపశమనం చర్యలు చేపట్టాల్సిన బాధ్యత జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం ఉందని ఒమర్ అబ్దుల్లా అన్నారు. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూ యుద్ధం దిశగా అడుగులు పడుతుండటంపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉపఖండంలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు భారత్ మొదట చొరవ చూపించాలని, నాయకత్వ పాత్రను పోషించాలని అన్నారు. సాఫ్ట్ పవర్, శాంతికి కట్టుబడి ఉండటమే భారత్ నిజమైన శక్తి అని చాటిచెప్పేందుకు ఇదే తగిన తరుణమని పేర్కొన్నారు. భారత్, పాక్ మధ్య పరస్పర దాడులపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌కు ఫోన్ చేసి భారత్‌తో పెరిగిన ఉద్రికత్తలను తగ్గించుకోవాలని కోరిన నేపథ్యంలో మెహబూబా ముఫ్తీ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య ఉగ్రిత్తల విషయంలో ఒక దశదాటి జోక్యం చేసుకోలేమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యానించారని, ఇప్పుడు మార్కో రూబియో సైతం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌ను ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని కోరారని ముఫ్తీ తెలిపారు. నిలకడలేని అంతర్జాతీయ మద్దతు వైపు మొగ్గడానికి బదులు, ఉద్రిక్తతలు తొలగేందుకు భారత్ మొదటి అడుగు వేయాలని ఆమె సూచించారు.

## కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి

మొదటిపేజీ తరువాయి

అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టేందుకు భారత్, పాక్ అంగీరిం చాయి. సరైన సమయంలో ఇరు దేశాలు విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించాయి... అందుకు ధన్యవాదాలని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## పాక్‌కు దెబ్బమీద దెబ్బ...!

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే పలువురు ఎంపిలు ప్రధాని షెహబాజ్‌ను తిట్టి పోస్తున్నారు. మరోవైపు బలూచీ ఆందోళనలు, దాడులు పాక్‌ను ఊపిరిపీల్చుకోకుండా చేస్తున్నాకు. భారత్‌తో యుద్ధానికి దిగిన పాకిస్థాన్‌కు బలూచిస్థాన్ పక్కలో బల్లెంలా మారింది. బలూచిస్థాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించుకునే దిశగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ' (బీఎల్ఏ), ఇతర వేర్పాటువాద గ్రూప్‌లు అడుగులు వేస్తున్నాయి. తాము స్వాతంత్ర్యం పొందామని బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశాయి. బలూచిస్థాన్‌లో వరుస దాడులతో పాక్ సైన్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భారత్‌పై మిస్సైళ్లు, డ్రోన్లతో దాడి చేసేందుకు పాక్ సైన్యం ప్రణాళికలు రచిస్తుంటే.. బలూచిస్థాన్‌లో కీలక ప్రాంతాలపై బీఎల్ఏ పట్టు-సాధిస్తున్నది. బాంబుదాడులు, బుల్లెట్లతో విరుచుకుపడుతూ అక్కడ గస్తీ కాస్తున్న పాక్ సైన్యానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. మొత్తంగా ఇటు- తూర్పు ప్రాంతమైన భారత్ నుంచి, అటు- పశ్చిమ ప్రాంతమైన బలూచిస్థాన్ నుంచి జరుగుతున్న దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ప్రస్తుతం పాకిస్థాన్ సైనిక సంపత్తి, ఆర్థిక పరిస్థితి, అంతర్జాతీయ సంబంధాలు వంటి అంశాలను బేరీజు వేస్తే.. అతి త్వరలో పాకిస్థాన్ రెండు ముక్కలు కావొచ్చని, బలూచిస్థాన్ ప్రత్యేక దేశంగా అవతరించే అవకాశం ఉన్నదని అంతర్జాతీయ నిపుణులు పేర్కొంటున్నారు. బలూచిస్థాన్‌లో బీఎల్ఏ, రెబల్స్ గ్రూప్స్ కలిసి కొంత కాలంగా పాక్ సైన్యంపై, ప్రభుత్వ ఆస్తులపై వరుసగా దాడులు చేస్తూ ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం బలూచిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో బీఎల్ఏ, రెబల్స్ దాడులు చేసినట్టు- అక్కడి మీడియా సంస్థలు తెలిపాయి. బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో గురువారం నాలుగు చోట్ల దాడులు జరిగినట్టు- స్థానిక రేడియో జుంబేష్ ఇంగ్లిష్ తెలిపింది. క్వెట్టా వ్యాప్తంగా పేలుళ్లు, తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించినట్టు- వెల్లడించింది. మేం క్వెట్టాతోపాటు- బలూచిస్థాన్ వ్యాప్తంగా అనేక సైనిక పోస్టులపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్నాం అని బీఎల్ఏ తెలిపింది. కెచ్, మస్టంగ్, కచి ప్రాంతాల్లో పాక్ సైన్యంపై ఆరు దాడులు చేసినట్టు- వెల్లడించింది. దాడులకు సంబంధించిన వీడియోలను వేర్పాటు-వాదులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బీఎల్ఏ అధికార ప్రతినిధి జియాంద్ బలూచ్ తెలిపిన వివరాల మేరకు బలూచిస్థాన్‌కు చెందిన ఓ జర్నలిస్ట్ ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. దీని ప్రకారం.. బలూచిస్థాన్‌కు కెచ్ జిల్లాలోని దస్తక్ ప్రాంతంలో బీఎల్ఏ రిమోట్ కంట్రోల్ ఐఈడీని పేల్చడంతో బాంబు డిస్పోజబుల్ స్కాడ్‌కు చెందిన ఒక సైనికుడు అక్కడికక్కడే మరణించాడు. అదే జిల్లాలోని కెట్గాన్ ప్రాంతంలో పాకిస్థాన్ ఔట్‌పోస్ట్‌పై దాడిచేసి పలువురు సైనికులను హతమార్చారు. జమురాన్ షా డ్యామ్ ప్రాంతంలో ఐఈడీతో పాక్ ఆర్మీ వాహనాలను ధ్వంసం చేశారు. 'బలూచ్ వీరులు ఇప్పుడు నేరుగా పాక్ సైన్యంతో వీధుల్లో పోరాడుతున్నారు. ప్రజలు మాకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారు. మాకు వైమానిక దళ మద్ధతు అవసరం' అని వేర్పాటు-వాదులు ఒక ప్రకటనలో వెల్లడించారు. బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానికులు, వేర్పాటు- వా దులు పాకిస్థాన్ జెండాలను తొలగించి బలూచిస్థాన్ జెండాలను ఎగురవేశారు. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని వేర్పాటు-వాదులు విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత ఏర్పాట్లకు, అధికారిక పత్రాల తయారీ, పౌరులకు గుర్తింపు కార్డుల జారీకి ఆర్థిక సాయం చేయాలని విన్నవించారు. ఐక్యరాజ్యసమితి శాంతి దళాన్ని తమ ప్రాంతానికి పంపాలని, పాకిస్థాన్ సైన్యం ఆయుధాలను ఇక్కడే వదిలేసి వైదొలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. బలూచిస్థాన్‌లో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు- చేసి, క్యాబినెట్‌ను ప్రకటిస్తామని తెలిపారు. త్వరలోనే దేశ అవతరణ వేడుకలు నిర్వహిస్తామని, దీనికి మిత్ర దేశాలను ఆహ్వానిస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వంలో మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బలూచిస్థాన్ ప్రజలు పాక్ జెండాలను తొలగించి, సొంత జెండాలను ఎగురవేయడం మొదలు పెట్టారు. ప్రపంచ దేశాలు పాకిస్థాన్‌లోని తమ దౌత్య కార్యాలయాలను బలూచిస్థాన్‌కు తరలించాల్సిన సమయం వచ్చింది. పాకిస్థాన్‌కు వీడ్కోలు.. బలూచిస్థాన్‌కు స్వాగతం' అని బలూచ్ రచయిత మిర్ యార్ బలూచ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## దెబ్బకు దిమ్మతిరిగిన పాక్ - నడ్డివిరిగి నిలబడలేని దుస్థితి

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే అక్కడి ఎంపిలు పాక్‌ను దమ్మెత్తి పోశారు. యుద్ధం చేయలేమని హెచ్చరించారు. వినకుండా ఆర్మీ చీఫ్ మునీర్ ఒత్తిడితో కాలుదువ్వి...కాళ్లు విరగొట్టుకుంది. మొత్తంగా గత కొన్ని రోజులుగా భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించినట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అంతకుముందు ఇదే అంశంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్- పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. శనివారం సాయంత్రం భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి.

## రహిమ్యార్ ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేసిన భారత్

మొదటిపేజీ తరువాయి

నష్టపోతుంది కూడా. భారత్ ఎంతో తెలివిగా పాకిస్తాన్ ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తోంది. ఏయిర్‌బేస్‌లను టార్గెట్ చేసి ధ్వంసం చేస్తోంది. తాజాగా, దాదాపు 60 ఏళ్ల చరిత్ర కలిగిన రహిమ్యార్ ఏయిర్‌బేస్‌ను భారత్ ధ్వంసం చేసింది. ఈ ఏయిర్‌బేస్ రాజస్తాన్ సరిహద్దు ప్రాంతానికి అతి దగ్గరలో ఉంది. మిలటరీ కార్యకలాపాలతో పాటు సివిల్ ఏవియేషన్‌కు కూడా పాక్ దీన్ని వాడుతోంది. చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ఏయిర్‌బేస్, ఇంటర్‌నేషనల్ ఏయిర్‌పోర్టును భారత్ ధ్వంసం చేసింది. భారత్‌పై దాడి చేసి నష్టాన్నికలిగించామని అబద్దాలు ప్రచారం చేసుకుంటున్న పాక్, తమ దేవంలో జరుగుతున్న నష్టాన్ని కప్పి పుచ్చుకుంటోంది. మరోవైపు స్థానిక ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది.

## అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు

మొదటిపేజీ తరువాయి

సాయంత్రం గచ్చిబౌలి స్టేడియం వేదికగా పోటీలను ప్రారంభించారు. 110కిపైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీపడుతున్నారు. భారత్ తరఫున మిస్ ఇండియా నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం ఆలాపనతో పోటీలు మొదలయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా పోటీదారులు విభిన్న వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, మిస్ వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. భారత్, పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ 2025 పోటీలపై పడిరది. ఈ క్రమంలో 72వ మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవానికి సిఎం రేవంత్ రెడ్డి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. యుద్ధం నేపథ్యంలోనే దూరంగా ఉంటున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు వెల్లడిరచాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇవ్వాల్సిన డిన్నర్‌ను కూడా రద్దు చేసినట్టుగా తెలిసింది. ఇండో, పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని, లేదా వాయిదా వేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈనెల 31వ తేదీ వరకు నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా ఈ పోటీలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు- చేస్తోంది. జూన్ 1వ తేదీన హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే జరుగనుండగా 120 దేశాలకు చెందిన సుందరీమణులు ఈ పోటీ-ల్లో పాల్గొంటున్నారు.





# గోదావరి జల సాధన కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం

**- సీతారామ ప్రాజెక్ట్ పై న్యాయ పోరాటం చేస్తాం**
**- గోదావరి జల సాధన సమితి చైర్మన్ విశ్వ జంపాల**
**- గోదావరి జల సాధన సమితి (సీతారామ ప్రాజెక్ట్ న్యాయ పోరాట కమిటీ) ఆవిర్భావ సభలో వెల్లడి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 10 : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఉమ్మడి సరిహద్దు ఏజెన్సీ గిరిజన ప్రాంతాల బీడు భూములకు గోదావరి జలాలు సాధించేందుకు ప్రాణ త్యాగానికైనా సిద్ధమని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గోదావరి జలసాధన సమితి చైర్మన్ విశ్వ జంపాల వెల్లడించారు. శనివారం గార్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల అధ్యక్షతన తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో గోదావరి జల సాధన సమితి (సీతారామ ప్రాజెక్ట్ న్యాయ పోరాట కమిటీ) ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ ఆవిర్భావ సదస్సులో విశ్వ మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు సాగు, త్రాగు నీరు అందించడంలో ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడితే ఏజెన్సీ ప్రజల సాగు త్రాగునీటి అవసరాలు తీరుతాయని ఏజెన్సీ ఆదివాసి గిరిజన ప్రజలు ఎంతో విశ్వాసంతో తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారని గుర్తు చేశారు.

తెలంగాణ వచ్చిన తర్వాత 2016లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రోళ్ళపాడు వద్ద సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ఈ ప్రాంత ప్రజలకు సాగు త్రాగు నీరు అందిస్తామని వాగ్దానం చేశారన్నారు. ఆ తర్వాత కొందరి రాజకీయ అవసరాల కోసం సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ బలి పశువుగా మారిందని విశ్వ ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రీడిజైన్, రీఇంజనీరింగ్, రీఎస్టిమేషన్ అంతా ఒక కుట్రపూరిత చర్యని, ఈ ప్రాజెక్టు అవినీతి అక్రమాలకు నెలవుగా మారిందని ఆరోపించారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం సరైనది కాదని ఆయన పేర్కొంటూ ఆ తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సరిచేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు గోదావరి జల సాధన కోసమే గోదావరి జలసాధన సమితి ఏర్పాటు చేసిన్నట్లు ఆయన వెల్లడించారు. సీతారామ ప్రాజెక్ట్ బాధిత ప్రాంతాలలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి ప్రజా ఉద్యమం తో పాటు న్యాయపోరాటం చేస్తామని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ వ్యక్తిగత స్వార్ధ ప్రయోజనాల కోసమే సీతారామ ప్రాజెక్టు ను దారి మళ్ళించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుండా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన ప్రాంతాలు సాగు తాగునీరు లేక తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటుంటే రెండు పంటలు పండుతున్న నాగార్జునసాగర్ ఆయకట్టుకు సీతారామ ప్రాజెక్టు నీళ్లను మళ్ళించడం దుర్మార్గమైన చర్యని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు గోదావరి జలాలు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గుగులోత్ సక్రు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ మొదటి డిపిఆర్ అమలు చేస్తూ ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు త్రాగు సాగు నీళ్లు ఇవ్వాలని అన్నారు. టిఆర్ఎస్ మండల కార్యదర్శి పానుగంటి రాధాకృష్ణ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ లో జరుగుతున్న అక్రమ నీళ్ల తరలింపు పై, అవినీతి అక్రమాలపై ప్రభుత్వం న్యాయ విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మాజీ సర్పంచ్ గంగావతి లక్ష్మణ్ నాయక్, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు వజ్రం నాగేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు కందునూరి ఈశ్వర్ లింగం, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకులు హరినాయక్ వివిధ పార్టీల ప్రజాసంఘాల నాయకులు మాలోత్ మాన్య నాయక్, కత్తి బాలరాజు, వల్లపుదాసు వెంకటేశ్వర్లు, ఎస్.కె యాకుబ్ పాషా, మాగం లోకేష్, అంకెపాక కిరణ్, కే.రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి జల సాధన సమితి చైర్మన్‌గా విశ్వ జంపాల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 10 : గోదావరి జలాలను ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు అందించాలనే డిమాండ్‌తో ఆవిర్భవించిన గోదావరి జల సాధన సమితి చైర్మన్‌గా తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల, కన్వీనర్‌గా బిఆర్ఎస్ నాయకులు పానుగంటి రాధాకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నాడు తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో జరిగిన గోదావరి జలసాధన సమితి (సీతారామ ప్రాజెక్టు న్యాయ పోరాట కమిటీ) ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ సదస్సులో గోదావరి జల సాధన సమితి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్ లుగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కందునూరి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండా వెంకట రెడ్డి, టిఆర్ఎస్ జిల్లా నాయకులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జడ సత్యనారాయణ, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు గిన్నారపు మురళి తారక రామారావు, టిడిపి రైతు నాయకులు కత్తి సత్యం, బిజెపి రాష్ట్ర నాయకులు రాహుక విమల్ కుమార్ జైన్ కో- కన్వీనర్లుగా సిపిఎం నాయకురాలు అలువాల సత్యవతి, సిపిఐ నాయకులు జంపాల వెంకన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గూగులోత్ సక్రు, టిడిపి నాయకులు రంగరాజు శివాజీ, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు భూక్య హరి నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ కే యాకూబ్ పాషా, తెలంగాణ జన సమితి నాయకులు ఎడ్ల రాజేందర్, డివిఎస్ఎఫ్ఐ నాయకులు శాంతి కుమార్, నక్క శివకృష్ణ కార్యవర్గ సభ్యులుగా గడిపాటి రాజారావు, మాలోత్ మాన్య నాయక్, చిలక నరసయ్య, మట్లపల్లి వీరభద్రం, కత్తి బాలరాజు, సిరపంగి నాగేశ్వరరావు, సంగిశెట్టి ప్రభాకర్ రాగం రమేష్, సిహెచ్ గణేష్, మాగం లోకేష్, అంకె పాక కిరణ్ కుమార్, గుగులోత్ దేవా మీడియా కన్వీనర్ లుగా కందునూరి ఈశ్వర్ లింగం, వజ్రం నాగేశ్వరరావు, వల్లపుదాసు వెంకటేశ్వర్లను ఈ సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలో ఈ కమిటీని విస్తృత పరుస్తూ మరి కొంతమందిని వైస్ చైర్మన్ లుగా, కో కన్వీనర్ లుగా, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోనున్నట్లు చైర్మన్ విశ్వ తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం మానుకోట జిల్లాల ఉమ్మడి సరిహద్దుగా ఉన్న ఏజెన్సీగిరిజన ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లను అందించాలి. సీతారామ ప్రాజెక్ట్ మొదటి డిపిఆర్‌ను అమలు చేయాలి. సీతారామ ప్రాజెక్ట్ లో జరిగిన అవినీతి అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలి. ఇటీవల గార్ల డోర్నకల్ మధ్యలో సీతారామ ప్రాజెక్ట్ కాలువలో పడి చనిపోయిన భార్య సభావత్ విజయ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న భర్త సభావాత్ బౌసింగ్ లకు 50 లక్షలు రూపాయలు నష్టపరిహారం చెల్లించాలనే పలు తీర్మాలను కమిటి ఆమోదించింది.

### భూపాలపల్లిలో సింగరేణి ఆద్వర్యంలో

## "నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రం"

**- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

భూపాలపల్లి, మే 10:రీజనల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ కోర్సెస్ (ఆర్.డి.ఎస్.డి.ఇ), హైదరాబాద్ వారి సహకారంతో సింగరేణి సంస్థ ఆద్వర్యంలో భూపాలపల్లిలో ఏర్పాటు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని (ఎస్.డి.టి.సి.) మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించనున్నారు. సింగరేణి సి.ఎస్.ఆర్. నిధులతో ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కేంద్రంలో సింగరేణి ప్రస్తుత, రిటైర్ ఉద్యోగుల నిరుద్యోగ పిల్లలతో పాటు, భూపాలపల్లి చుట్టు ప్రక్కల గ్రామాలలో నివసిస్తున్న నిరుద్యోగులకు దాదాపు 38 విభాగాలలో ఈ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ లో వృత్తిలో నైపుణ్యాన్ని అభివృద్ధి పరిచేందుకు తగిన శిక్షణను అందిస్తారు. స్థానిక ఏరియా వర్క్ షాప్ దగ్గరలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలోని మూడు క్లాస్ రూమ్ లను, ఆర్క్, గ్యాస్ వెల్డింగ్ షెడ్, డెమో రూమ్, రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్, స్ట్రీట్ లైట్ సోలార్ సిస్టమ్ తదితర వాటిని ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధులుగా వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డా. కడియం కావ్య, సింగరేణి సి.ఎం.డి. ఎన్. బలరాం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మలతో పాటు అతిదిలుగా సింగరేణి డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, సింగరేణి గుర్తింపు సంఘం నాయకులు కె.రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘం నాయకులు బి.జనక్ ప్రసాద్, సింగరేణి అధికారులు సంఘం ప్రసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మి పతి గౌడ్ రానున్నారు. అలాగే సింగరేణి హెచ్.ఆర్.డి.జనరల్ మేనేజర్ జి.రఘుపతి, భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏ. రాజేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమ నిర్వహణ భాద్యతలు చూస్తారు.

## శంషాబాద్ పరిధిలో డ్రోన్ల నిషేధం

**- సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 10 : నగరంలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో డ్రోన్ల వినియోగంపై నిషేధం విధించారు. విమానాశ్రయానికి 10 కి.మీ. పరిధిలో డ్రోన్లపై నిషేధం విధించినట్లు సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ తెలిపారు. డ్రోన్లపై నిషేధం జూన్ 9 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగ ప్రదేశాలు, కంటోన్మెంట్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు చెప్పారు. ఆకస్మిక శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని విజ్ఞప్తి చేశారు. బాణసంచా పేలుళ్లను ఉగ్ర కార్యకలాపాలుగా తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందన్నారు. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో పౌరులు సహకరించాలని, పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు రష్యా అండ

**- రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ వెల్లడి**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

మాస్కో, మే 10 : ఉగ్రవాదంపై పోరాడుతున్న భారత్‌కు తమ మద్దతు ఉంటుందని రష్యా మరోసారి స్పష్టం చేసింది. మునుపటి ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని తెలిపింది. ఈ క్రమంలో సంప్రదింపుల పక్రియలో ఉన్న మిలిటరీ ఆర్డర్లను వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొంది. భిన్న రూపాల్లో ఉన్న ఉగ్రవాదంపై పోరాడుతున్న మనకు పూర్తి మద్దతు ఇస్తామని రష్యా హామీ ఇచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్న ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ పేర్కొన్నారు. రష్యా విజయోత్సవాల్లో ఆయన భారత్ పరతినిధిగా పాల్గొన్నారు. పుతిన్‌నుకలిసి అభినందనలుతెలిపారు.



## మ్యాంగో మార్కెట్లో శ్రమ దోపిడీ

**- కార్మికులకు డబ్బులు ఇవ్వాలని ఏఐటీయూసీ నేత వెన్న మహేష్ డిమాండ్...**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 10 : జగిత్యాల మామిడి మార్కెట్ జాతీయ స్థాయిలో పేరుంది.ప్రతి ఏటా కోట్లలో మామిడి వ్యాపారం జరుగుతోంది.జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కామారెడ్డి, వరంగల్ తదితర జిల్లాలతో పాటు తెలుగురాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల్లో పండించిన మామిడి పంట జగిత్యాల మార్కెట్లోకి తీసుకువచ్చి రైతులు విక్రయిస్తారు.అయితే ఈ మార్కెట్లో సిండికెట్ మూలంగా ధర అనుకున్న స్థాయిలో రావడం లేదని మామిడి రైతులు వాపోతున్నారు.ఇక్కడి మామిడి తోటలను గుత్తకు తీసుకున్న గుత్తేద్దారులు మామిడి కాయలను ఇతర రాష్ట్రల నుండి కార్మికులతో తెంపిస్తుంటారు.అలాగే మ్యాంగొ మార్కెట్లోకి వాహనాల్లో తీసుకువచ్చిన మామిడి కాయలను అన్ లోడ్ చేయడం, కాయలను వివిధ రకాలుగా వేరు చేయడం, తూకం వేయడం, పెట్టెల్లో భద్రపర్చడం, మళ్ళీ లారీల్లో లోడ్ చేయడం వంటి పనులను లోకల్ లేబర్స్ పాటు ఇతర ప్రాంతాల కార్మికులతో గుత్తే దారులు చేయిస్తుంటారు.ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, ఒడిస్సా, జార్ఖండ్, మహారాష్ట్ర ల నుండి వచ్చిన వలస కార్మికులను మామిడి గుత్త దారులు తమ తోటలో మామిడి కాయలు తెంపుకున్నాక డబ్బులు ఇవ్వట్లేదని ఏఐటీయూసీ నాయకులు వెన్న మహేష్ పేర్కొన్నారు. శనివారం వెన్న మహేష్‌ను వలస కార్మికులు కలిసి ఈ విషయం గూర్చి విన్నవించగా స్పందించిన ఆయన మ్యాంగో మార్కెటును సందర్శించి అక్కడి పరిస్థితులను గమనించారు. గుత్తే దారులతో మాట్లాడినట్లు తెలిపారు.వేసవి కాలంలో శ్రమకోర్చి కుటుంబాల పోషణ కోసం ఇతర రాష్ట్రాల నుండి వచ్చి తోటలోని మామిడి కాయలు తెంపి కష్టపడ్డప్పటికి మాకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని కూలీలు ఆవేదన పడుతున్నారని తన దృష్టికి తీసుకువచ్చారాని, అలాగే డబ్బులు ఇవ్వకుండా శ్రమదోపిడీకి గురిచేస్తున్నారని చాలా పిర్యాదులు వచ్చాయాని మహేష్ తెలిపారు.శ్రమ దోపిడీకి పాల్పడుతున్నా గుత్తేద్దారులు వెంటనే కూలీల డబ్బులు చెల్లించాలని మహేష్ డిమాండ్ చేశారు. కార్మిక శాఖ అధికారులు మార్కెట్ ను సందర్శించి కార్మికులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని, అలాగే పనులు చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న గుత్తే దారులు, మామిడి రైతులను చట్ట పరమైన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయనీ చేయాలనీ వెన్న మహేష్ డిమాండ్ చేశారు.

## భారత్-పాక్‌ల మధ్య సయోధ్య కుదురుస్తాం

**పెద్దన్న పాత్ర కోసం చైనా తహతహ**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : భారత్-పాకిస్థాన్ ల మధ్య సమస్యకు ముగింపు పలికేందుకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని చైనా పేర్కొంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో బీజింగ్ ఈమేరకు పేర్కొనడం గమనార్హం. ఇరుదేశాలు సంయ మనం పాటించాలని చైనా విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటన లో పేర్కొంది.భారత్-పాక్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత పరిస్థి తులను నిశితంగా గమనిస్తున్నాం. శాంతి, స్థిరత్వం కోసం ఇరుదే శాలు సమయమనం పాటించాలని కోరుతున్నాం. శాంతి యుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఉద్రిక్తతలను తీవ్రత రం చేసే చర్యలను తగ్గించుకోవాలని సూచిస్తున్నాం. ఈ ఉద్రిక్తత లను తగ్గించాలని అంతర్జాతీయ సమాజం కూడా ఆశిస్తోంది. ఈ సమస్య ముగింపునకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషించేం దుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని బీజింగ్ పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు.




## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

**- గార్ల మండల కేంద్రంలో రాజకీయ పార్టీల,ప్రజాసంఘాల శాంతి ర్యాలీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 10 : మధ్యభారతంలో ఆదివాసులపై కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన మారణకాండను ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వివిధ పార్టీల, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం గార్ల మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీ నెహ్రూ సెంటర్లో ప్రారంభించి డోర్నకల్ రోడ్డు మెయిన్ రోడ్ జై మందిర్ పోస్ట్ ఆఫీస్ రోడ్ ప్రధాన రహదారుల గుండా ఈ ర్యాలీని నిర్వహించడం జరిగింది. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఈ ర్యాలీని ఉద్దేశించి అఖిలపక్ష నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారును ఆపాలని, ఆదివాసులపై జరుగుతున్న హత్యాకాండను నిలిపివేయాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో నెలకొని ఉన్న సామాజిక ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని దండకారణ్యంలో అపారమైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికే ఆపరేషన్ కగార్ ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్రేగుట్టల నుండి సైనిక బలగాలను వెంటనే ఉపసంహరించాలని, మధ్య భారతంలో దండకారణ్యంలో శాంతిని నెలకొల్పాలని, ఆదివాసులను అడవులను కాపాడాలని ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుండా వెంకటరెడ్డి సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గుగులోత్ సక్రు బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు వజ్రం నాగేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి, బిఆర్ఎస్ మండల కార్యదర్శి పానుగంటి రాధాకృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు కందునూరి ఈశ్వర్ లింగం, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకులు హరినాయక్ వివిధ పార్టీల ప్రజాసంఘాల నాయకులు మాలోత్ మాన్య నాయక్, కత్తి బాలరాజు, వల్లపుదాసు వెంకటేశ్వర్లు, ఎస్.కె యాకుబ్ పాషా, మాగం లోకేష్, అంకెపాక కిరణ్, కే.రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## నా సిందూరాన్ని దేశ రక్షణకు పంపుతున్నా

**- జవాన్ భార్య ధీరత్వం**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

ముంబై, మే 10 : 'నా సిందూరాన్ని దేశ రక్షణ కోసం పంపుతున్నా' అంటూ నవ వధువు పెళ్లయిన మూడు రోజులకే భర్తను సరిహద్దుల్లోకి పంపి ఆదర్శంగా నిలుస్తోంది. ఇందుకు గర్విస్తున్నాని తెలిపింది. దేశం కన్నా తనకు మరేదీ ముఖ్యం కాదని తెలిపి ధీరత్వాన్ని చాటింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల దృష్ట్యా పారా మిలిటరీ బలగాలకు సెలవులు రద్దయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన జవాను మనోజ్ పాటిల్‌కు.. బోర్డర్‌కు తిరిగి రావాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. అయితే మనోజ్‌కి ఈనెల 5నే వివాహం జరిగింది. పెళ్లయి వారం రోజులు కూడా గడవకముందే విధుల్లో చేరాల్సి రావడంతో భార్య యామిని, కుటు-ంబ సభ్యులు బాధను దిగమింగుకొని మనోజ్‌ను దేశ రక్షణ కోసం పంపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.అలాగే ఆమెను అంతా అభినందించారు.

# ఆరోగ్యం

## ఓట్స్ అధికంగా తింటే అనర్ధాలు.. జాగ్రత్త!

ఓట్స్... చాలామంది ప్రతిరోజూ ఓట్స్ తింటూ ఉంటారు. ఓట్స్ తో మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని భావిస్తారు. ఓట్స్ లో విటమిన్ బి2, విటమిన్ సి, పీచు పదార్థం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఓట్స్ చాలా మంచి పౌష్టికాహారంగా చెప్పవచ్చు.

**అతిగా ఓట్స్ తింటే అనర్థాలు**

ఇక ఓట్స్ తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అన్నమాట ఎంత వాస్తవమో అతిగా తింటే అనారోగ్యం కూడా వస్తుంది అనే విషయం అంతే వాస్తవం. ఇక ఓట్స్ తినడం వల్ల కలిగే అనారోగ్యాలు, మన శరీరానికి కలిగే నష్టాలు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం.ఓట్స్ అతిగా తినడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తాయి. అధికంగా ఓట్స్ తిన్న వారిలో కొంతమందికి కడుపు ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి.

**అధికంగా ఓట్స్ తింటే ఆరోగ్య సమస్యలు**

ఓట్స్ జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అందుకే ఓట్స్ అధికంగా తినడం మంచిదికాదు. ఓట్స్ లోని ఫైటిక్ యాసిడ్ క్యాల్షియం ,ఇనుము మరియు జింక్ వంటి కొన్ని ఖనిజాల శోషణను నిరోధిస్తుంది. ఓట్స్ అధికంగా తిన్నవారు మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొంతమందికి ఓట్స్ లో ఉండే ప్రోటీన్ కారణంగా అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంది.



**ఓట్స్ పదేపదే తింటే ఇన్ఫెక్షన్స్**

ఓట్స్ ను సరిగ్గా శుభ్రం చేయకపోతే, అవి తిన్నవారికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. పోషకాలు బాగా ఉంటాయని అతిగా ఓట్స్ తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఓట్స్ ప్రతిరోజు తీసుకోవడం వల్ల చాలామందిలో కడుపుకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఓట్స్ ఎక్కువగా తినడం వల్ల వాటిలో క్యాలరీలు తక్కువగా ఉండటం కారణంగా మన శరీరంలో కూడా క్యాలరీల లోపం ఏర్పడే అవకాశం ఉంది.

మితంగా తింటే ఆరోగ్యం కాబట్టి ఓట్స్ ను తినాలి అని అనుకుంటే ఒక నియమిత పద్ధతిలో తినడం మంచిది. ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్ మాత్రమే తినడం మంచిది కాదు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఓట్స్ అధికంగా తింటే కొన్ని దుష్ప్రభావాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకొని తదనుగుణంగా మితంగా తింటే మంచిది.

## పాలక్ కోకోనట్ రైస్..తక్కువ టైంలో ఎక్కువ రుచి..ఎలా చేసుకోవాలంటే

### తెలుగు వంటలు

పాలక్ కోకోనట్ రైస్ రైస్ ఒక సుగంధభరితమైన, రుచికరమైన వంటకం. ఇది పాలకూర, కొబ్బరి పాల కలయికతో ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. ఇది లంచ్ బాక్స్ ల్లోకి, తేలికపాటి భోజనానికి లేదా ప్రత్యేక సందర్భాలలో వడ్డించడానికి కూడా చాలా బాగుంటుంది. దీనిని తయారు చేయడం చాలా సులభం, తక్కువ సమయంలోనే సిద్ధం చేసుకోవచ్చు. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు -బాస్మతి బియ్యం - 2 కప్పులు -పాలకూర - 2 కప్పులు -కొబ్బరి పాలు - 1.5 కప్పులు -ఉల్లిపాయ - 1 పెద్దది -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్ -ఆవాలు - 1 టీ స్పూన్ -జీలకర్ర - 1/2 టీ స్పూన్ -మినపప్పు - 1/2 టీ స్పూన్ -శనగపప్పు - 1/2 టీ స్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె లేదా నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు -పసుపు - 1/4 టీ స్పూన్ -ఉప్పు - రుచికి సరిపడా -కొత్తిమీర - గార్నిష్ కోసం -జీడిపప్పు - 1 టేబుల్ స్పూన్ -నిమ్మరసం - కొన్ని చుక్కలు.



తయారీ విధానం -ముందుగా బాస్మతి బియ్యాన్ని 2-3 సార్లు శుభ్రంగా కడిగి అరగంటసేపు నీటిలో నానబెట్టండి. -తర్వాత పాలకూరను శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పక్కన పెట్టుకోండి. మీరు కావాలనుకుంటే పాలకూరను కొద్దిగా ఉడికించి లేదా ఆవిరిలో మగ్గించి కూడా ఉపయోగించవచ్చు. -ఇప్పుడు ఉల్లిపాయను సన్నగా తరుగుకోండి. పచ్చిమిర్చిని మధ్యకు చీల్చండి. అల్లం,వెల్లుల్లిని మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఎండుమిర్చిని చిన్న ముక్కలుగా తుంచుకోండి. -స్టవ్ మీద ఒక మందపాటి అడుగు కలిగిన గిన్నె లేదా కుక్కర్ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేసి వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వండి. తర్వాత జీలకర్ర, మినపప్పు, శనగపప్పు వేసి అవి కొద్దిగా రంగు మారే వరకు వేయించండి. ఇప్పుడు ఎండుమిర్చి,కరివేపాకు వేసి వేయించండి. తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి అవి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు ఇందులో తరిగిన పాలకూర వేసి 2-3 నిమిషాలు లేదా అది మెత్తబడే వరకు ఉడికించాలి. -పాలకూర మగ్గిన తర్వాత కొబ్బరి పాలు పోయాలి. తర్వాత నానబెట్టిన బియ్యంలోని నీటిని వడగట్టి బియ్యం వేయాలి. పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపండి. -గిన్నెకు మూత పెట్టి లేదా కుక్కర్ మూత పెట్టి మీడియం మంట మీద ఉడికించాలి. మీరు గిన్నెలో ఉడికిస్తుంటే నీరు పూర్తిగా ఇంకిపోయి అన్నం మెత్తగా ఉడికే వరకు ఉడికించాలి. ఇది సుమారు 15-20 నిమిషాలు పట్టవచ్చు. మీరు కుక్కర్ లో ఉడికిస్తుంటే 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి. ప్రెజర్ పూర్తిగా తగ్గిన తర్వాత మూత తీయండి. -అన్నం ఉడికిన తర్వాత ఒకసారి మెల్లగా కలపండి. సన్నగా తరిగిన కొత్తిమీర, వేయించిన జీడిపప్పు పలుకులతో గార్నిష్ చేయండి. కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం పిండితే మరింత రుచిగా ఉంటుంది. -పాలక్ కొబ్బరి అన్నం వేడి వేడిగా రైతా, పెరుగు లేదా ఏదైనా కూరతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది.

## రాగి పిండితో హెల్దీ బన్ దోశలు..

### పీకలదాకా తిన్నా ఇంకోటి కావాలంటారు..ఎలా చేయాలంటే




మన ఆరోగ్యం మొత్తం దాదాపు మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. కరోనా తర్వాత నుంచి అధికశాతం మంది తమ ఆరోగ్యంపై ఎక్కువ ఫోకస్ పెడుతూ హెల్దీ ఫుడ్ తీసుకుంటున్నారు. హెల్దీ ఫుడ్స్ లో రాగి పిండితో చేసే బన్ దోశలు కూడా ఒకటి. సాధారణంగా పొద్దున్నే పూరీ,బోండా,ఇడ్లీ,బియ్యం పిండితో దోశ వంటివి మనం తింటుంటాం. అయితే ఇవి కాకుండా పొద్దున్నే రాగిపిండితో చేసే హెల్దీ బన్ దోశలు ఓ సారి టేస్ట్ చేసి చూడండి..అస్సలు వదలిపెట్టరు. అంత రుచిగా ఉంటాయి..అంతేకాకుండా ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. రాగి పిండిలో ఐరన్, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాంటి రాగి పిండితో హెల్దీ బన్ దోశలు ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి. రాగి పిండితో బన్ దోశలు తయారీకి కావాల్సిన పదార్థాలు -రాగి పిండి -బొంబాయి రవ్వ -పెరుగు -నీళ్లు -ఆవాలు -జీలకర్ర -కరివేపాకు -ఆయిల్ -ఇంగువ -పచ్చిమిర్చి. రాగి పిండితో బన్ దోశలు తయారీ విధానం -రాగి బన్ దోశలు తయారుచేయడం కోసం ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకొని అందులో అరకప్పు బొంబాయి రవ్వ, 1 కప్పు రాగి పిండి, 1 కప్పు పెరుగు వేసి మొత్తం కలిసేలా కలుపుకున్నాక ఇందులో అరకప్పు నీళ్లు పోసి బాగా కలిపి 10 నిమిషాలు పక్కనపెట్టేయాలి. -10 నిమిషాలు నానిన తర్వాత ఈ పిండిని మిక్సీ గిన్నెలో వేసి నీళ్లు ఏమీ వేయకుండానే దోశ పిండిలా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పిండిని గిన్నెలోకి తీసుకొని పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో ఒకటిన్నర స్పూన్ ఆయిల్ వేడి చేసి ఇందులో కొద్దిగా ఆవాలు,జీలకర్ర వేసి అవి చిటపటలాడిన తర్వాత కొద్దిగా ఇంగువ వేసి కలిపాక 2 పచ్చిమిర్చి తరుగు,కొద్దిగా కరివేపాకు వేసి ఫ్రై అయ్యాక ఇందులో చిన్నగా కట్ చేసిన 1 టమాటో ముక్కలు వేసి అవి కొంచెం మెత్తబడేదాకా ఫ్రై చేసి స్టవ్ ఆఫ్ చేసేయండి.ఈ తాళింపుని ముందుగా రెడీ చేసుకున్న పిండిలో వేసేయాలి. ఇందులోనే సన్నగా కట్ చేసిన 2 ఉల్లియాల ముక్కలు, కొత్తిమీర తరుగు,రుచికి తగినట్లుగా ఉప్పు, కొద్దిగా వంటసోడా వేసి పిండిలో అన్నీ బాగా కలిసేలా కలుపుకోవాలి. - ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాండీ పెట్టి అందులో కొంచెం ఆయిల్ వేసి దానిమీద పెద్ద గరిట పిండిని వేసుకొని ఒకవేపు కాలిన తర్వాత తిప్పుకొని దానిని రెండోవైపు కాల్చి దించేయాలి. అంతే రాగి బన్ దోశలు రెడీ. దీనిని మీకు నచ్చిన చట్నీతో కలిపి తింటే నోట్లో బ్లాస్టే.

## ఇది తినని మనిషి జన్మ ఎందుకు..

### మన పూర్వీకుల ఎనర్జీకి కారణం ఇదే..ఎలా చేసుకోవాలంటే

మీరెప్పుడైనా రాగిపిండి, సగ్గుబియ్యం కిచిడి తిన్నారా? సూపర్ టేస్ట్ ఉంటుంది. ఈ కిచిడి ఒక పోషకమైన,తేలికగా జీర్ణమయ్యే ఆహారం. రాగిలో ఐరన్, కాల్షియం,ఫైబర్ పుష్కలంగా ఉంటాయి..సగ్గ బియ్యం తక్షణ శక్తిని అందిస్తాయి. ఈ రెండింటి కలయికతో తయారైన కిచిడి రుచికరమైనది మాత్రమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. రాగిపిండి సగ్గుబియ్యం కిచిడిని మీ ఇంట్లోనే సింపుల్ గా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.



రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీకి కావలసిన పదార్థాలు -పెసరపప్పు -సగ్గుబియ్యం -రాగిపిండి -మిరియాలు -జీడిపప్పు -పచ్చిమిర్చి -నెయ్యి -అల్లం -పసుపు -క్యారెట్ -ఉల్లిపాయ -టమాటో -వెల్లుల్లి -జీలకర్ర -కరివేపాకు

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీ విధానం -ముందుగా ఓ ప్రెజర్ కుక్కర్ లో శుభ్రంగా కడిగిన అరకప్పు పెసరప్పు, అరకప్పు సగ్గ బియ్యం, 4 పచ్చిమిర్చి ముక్కలు, 1 టమాటో పెద్ద ముక్కలు, 1 ఉల్లిపాయ పెద్ద ముక్కలు, 1 క్యారెట్ ముక్కలు,కొన్ని అల్లం ముక్కలు, పొట్టు తీసిన 2 వెల్లుల్లి రెబ్బలు, 10-15 మిరియాలు, చిటికెడు పసుపు వేయాలి. ఇందులో ముక్కలు మునిగేదాకా నీళ్లు పోసి కలిపి మూతపెట్టి స్టవ్ మీద పెట్టాలి. -రెండు విజిల్స్ వచ్చాక స్టవ్ ఆఫ్ చేసేయండి. ప్రెజర్ అంతా పోయిన తర్వాత కుక్కర్ మూత తీసి ఉడికిన పప్పుని గుత్తితో మెత్తగా మాష్ చేసుకోవాలి. -తర్వాత మళ్లీ స్టవ్ ఆన్ చేసి అది ఉడకనివ్వాలి. ఉడికే సమయంలోనే అందులో అరకప్పు రాగిపిండి ఉండలేకుండా బాగా కలపుతూ మంటను సిమ్ లో పెట్టి ఉడికించుకోవాలి.

10 నిమిషాలు రాగిపిండిని అందులో బాగా ఉడికించుకున్నాక రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి దగ్గరపడేదాకా ఉడికించుకోవాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 2-3 స్పూన్ల నెయ్యి వేడి చేశాక జీడిపప్పు,మిరియాలు వేసి ఫ్రై చేసుకోవాలి. -జీడిపప్పు వేగిన తర్వాత కరివేపాకు,జీలకర్ర వేసి వేయించుకొని తర్వాత ఈ తాళింపు మొత్తాన్ని ముందుగా ఉడికించిన కిచిడిలో వేసి కలుపుకోవాలి. ఇందులో అరచెక్క నిమ్మరసం పిండి బాగా కలుపుకోవాలి. అంతే రాగి పిండి సగ్గుబియ్యం కిచిడి రెడీ.

# సినిమా న్యూస్

# కంగన కోసం గ్లోబల్ బ్యూటీ దిగొస్తుందా!

బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ హాలీవుడ్ ఎంట్రీ కి రెడీ అవుతోంది. కంగన ప్రధాన పాత్రలో బ్లెస్డ్ బి ది ఈవిల్ అనే ఇంగ్లీష్ చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కంనగ కోసం లయన్ మూవీస్ ప్రత్యేకంగా సిద్ధం చేసిన స్క్రిప్ట్ ఇది. గర్భస్రావం తర్వాత బిడ్డను కోల్పోయిన బాధలో ఓ జంట ఉంటుంది. మళ్లీ కొత్త జీవితం ప్రారంభించాలనుకుంటున్న వారిని ఓ దుష్ట శక్తి ఎలాంటి తిప్పలు పెడుతుంది అనే కథాంశం చుట్టూ తిరుగుతుంది. అతీంద్రీయ శక్తులు...జానపద కథల నేపథ్యంలో అనురాగ్ రుద్ర తెరెక్కిస్తున్నాడు . టైలర్ పోసీ, స్కార్లెట్ రోజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ వేసవిలోనే చిత్రాన్ని న్యూయార్క్ లో ప్రారంభించా లనుకుం టున్నారు. అమెరికాలోని చిత్ర నిర్మాణాలకు ట్రంప్ విధించిన టారిఫ కు సంబంధించిన పనులు పూర్తయిన వెంటనే లాంచింగ్ కార్యక్రమం ఉంటుంది. అయితే ఈ సినిమా లో గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా కూడా నటిస్తుందనే ప్రచారం బాలీవుడ్ లో మొదలైంది. ఇంగ్లీష్ లో చేస్తోన్న చిత్రం కావడం తో కంగన పీసీని ఓ గెస్ట్ రోల్ పోషించమని రిక్వెస్ట్ చేసిందట. పీసీ కూడా నో చెప్పలేదని సమాచారం. సమయం దొరికితే కచ్చితంగా చేస్తామని మాట ఇచ్చిందట. ఈ సినిమా షూటింగ్ అంతా కూడా న్యూయార్క్ లోనే ఉంటుంది. ప్రారంభోత్సవం కూడా అక్కడే జరుగుతుంది. కాబట్టి పీసీ కి పెద్దగా సమస్య ఉండదు.



ఎందుకంటే ప్రియాంక చోప్రా కాపురం కూడా న్యూయార్క్ లోనే ఉంటుంది. ఈ మధ్యనే ఎస్ ఎస్ ఎంబీ 29 సినిమాకు ఒకే చెప్పడంతో హైదరాబాద్ వచ్చి వెళ్తుంది. ప్రస్తుతం షూటింగ్ లేకపోవడంతో ప్రియాంక అమెరికాలోనే ఉంది. జూన్ నుంచి కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. మళ్లీ అప్పుడు ఇండియాకు వచ్చే అవకాశం ఉంది. ఈ లోగా కంగన సినిమా ప్రారంభోత్సవం జరగుతుందని తెలుస్తుంది.



# ఇదేం స్పీడ్ నాని?.. ఆ డైరెక్టర్ తోనే మళ్లీ..



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని స్పీడ్ ఇప్పుడు మామూలుగా లేదని చెప్పాలి. వరుస సినిమాలతో ఓ రేంజ్ లో దూసుకుపోతున్నారు. ఓ మూవీ సెట్స్ పై ఉండగానే.. మరొకటి లైనప్ లోకి యాడ్ చేస్తున్నారు. నాన్ స్టాప్ షూటింగ్స్ లో పాల్గొంటూ బిజీగా గడుపుతున్నారు. అదే సమయంలో వరుస హిట్స్ అందుకుంటున్నారు. దసరా, హాయ్ నాన్న, సరిపోదా శనివారం చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకున్న నాని.. రీసెంట్ గా హిట్ -3 మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. నెవ్వర్ బిఫోర్ అవతార్ లో కనిపించిన ఆయన.. తన యాక్టింగ్ తో అందరినీ మెప్పించారు. వరుసగా నాలుగో హిట్ ను తన ఖాతాలో వేసుకుని సత్తా చాటారు నేచురల్ స్టార్. కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ అందుకున్న నాని.. ఆ తర్వాత శ్రీకాంత్ తెరకెక్కించనున్న ప్యారడైజ్ మూవీని పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత సుజీత్ సినిమాను స్టార్ట్ చేయనున్నారు. అలా వరుసగా వివిధ సినిమాలను లైన్ లో పెట్టేశారు నాని. అయితే ఆయన.. హిట్-3 డైరెక్టర్ శైలేష్ కొలనుతో మరో మూవీ చేయనున్నారు. రీసెంట్ గా హిట్ 3 సక్సెస్ మీట్ జరగ్గా.. ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. కచ్చితంగా శైలేష్ తో మరో సినిమా ఉంటుందని తెలిపారు. కానీ ఈ సారి హిట్ 3 లాంటి మూవీ కాదని క్లారిటీ ఇచ్చారు. ఫుల్ కామెడీ ఎంటర్టైనర్ తో తామిద్దరం ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చెప్పారు. రీసెంట్ గా శైలేష్ స్టోరీ లైన్ చెప్పినట్లు వెల్లడించారు. అయితే ఆ సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుందో ఇంకా తెలియదని అన్నారు. కానీ సినిమా మాత్రం బాగుంటుందని అప్పుడే చెప్పేశారు. దీంతో నాని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీంతో హిట్ 3 కాంబినేషన్ లో నాన్ వైలెన్స్ మూవీ లోడింగ్ అంటూ అనేక మంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక దసరా సినిమాకు గాను తనలో మాస్ ను బయటపెట్టిన నాని.. ఇప్పుడు హిట్-3 సినిమాలో అటు మాస్.. ఇటు వైలెన్స్ రెండూ చూపించారు. అప్ కమింగ్ ప్యారడైజ్ లో అయితే నాని కొత్త అవతార్ లో కనిపించనున్నట్టు ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. అయితే తాను అన్ని జోనర్స్ సినిమాలు చేస్తానని కొద్ది రోజుల క్రితం చెప్పారు. అందుకు తగ్గట్లే ఇప్పుడు శైలేష్ కొలను కామెడీ ఎంటర్టైనర్ చేయనున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది.

# వార్‌పై వెంకీ హీరోయిన్ పోస్ట్..నెట్టింట ఏకేస్తున్నారుగా!



భారత్ – పాకిస్థాన్‌ల మధ్య రోజు రోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా పలువురు పెడుతున్న పోస్ట్‌లు వివాదానికి దారి తీస్తున్నాయి. దాయాది దేశం దుర్బుద్ధితో ఇండియాపై దాడి చేస్తున్నా ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా కొంత మంది యుద్ధం వద్దు. పాక్‌తో యుద్ధం అసలే వద్దు, ఉగ్రవాదాన్ని ఏరివేయడానికే సైన్యం శిక్షణ తీసుకుంది కానీ వారితో యుద్ధం చేయడానికి కాదు అంటూ పలువురు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెడుతూ అడ్డంగా బుక్కవుతున్నారు. తాజాగా విక్టరీ వెంకటేష్ తో 'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకున్న హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ ఇదే తరహాలో సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టి అడ్డంగా బుక్కయింది. పాకిస్థాన్ దొంగబుద్ధికి ధీటుగా భారత సైన్యం జవాబు చెబుతూ భీకరంగా పోరాటంచేస్తున్న వేళ యావత్ భారతం అంతా వారి వెంట నడుస్తుంటే హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించి పాక్‌తో యుద్ధం వద్దు అని పోస్ట్ చేసి నెటిజన్‌ల ఆగ్రహానికి గురవుతోంది. ఐశ్వర్యా రాజేష్ తన ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో 'యుద్ధానికి నో చెప్పండి. ప్రజాస్వామ్య దేశ సిటిజన్‌గా నేను భారత్, పాక్ దేశాలకు యుద్ధం బదులుగా శాంతిని ఎంచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. అర్థం చేసుకునే దిశగా చర్యలు తీసుకుందాం. అనవసరమైన ప్రాణనష్టాన్ని నివారించండి. సైనికులు, నైపుణ్యం కలిగిన వ్యక్తులు, అమాయక ప్రజలు ఈ యుద్ధంలో చనిపోకూడదు. ఈ సందేశం అందరికీ చేరనివ్వండి' అంటూ పోస్ట్ చేసింది. ఐశ్వర్యా రాజేష్ పోస్ట్ పెట్టిన ఉద్దేశ్యం శాంతిని కోరుకోవడమే అయినా తను స్పందించిన తీరు మాత్రం నెటిజన్‌లకు, సాటి భారతీయులకు నచ్చడం లేదు. దీంతో ఐశ్వర్యా రాజేష్‌పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ నెట్టింట ఆమెని ట్రోల్ చేస్తున్నారు. తాజాగా పాక్‌తో భారత్ యుద్ధం చేస్తుండటానికి ప్రధాన కారణం సీమాంతర ఉగ్రవాదం. దాన్ని పెంచి పోషిస్తూ ఇటీవల పెహల్గావ్‌లో భారతీయులను వారి భార్యల ముందే ఉగ్రమూకలు కాల్చి చంపడం వల్లే ఈ దుర్ఘటనకు ధీటుగా సమాధానం చెప్పాలనే భారత్ పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్ర లాంచ్ ప్యాడ్‌లపై దాడులకు దిగింది. ఈ సంఘటనని కనీసం కోట్ చేయని ఐశ్వర్యా రాజేష్ శాంతి అని, పాక్‌తో యుద్ధం వద్దు అంటూ పోస్ట్ పెట్టడం ఏంటని పలువురు మండిపడుతున్నారు. అంతే కాకుండా శాంతి ప్రవచనాలు వల్లించే ముందు పాక్ మన దేశాన్ని ఆక్రమించిన విషయాన్ని, మనపై ఉగ్రమూకలతో దాడులు చేయిస్తున్న క్రమాన్ని కూడా ఐశ్వర్య ఎండగడితే బాగుండేదని, అలాంటి విషయాల్ని పక్కన పెట్టి యుద్ధం వద్దు శాంతే ముద్దు అంటూ సూక్తులు చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అని ఆమె అభిమానులు కూడా ఫైర్ అవుతున్నారు. దేశం కోసం యావత్ ప్రజలంతా సపోర్ట్‌గా నిలబడిన వేళ సెలబ్రిటీలు ఇలాంటి పోస్ట్‌లు చేయడం విచారకరం. ఇప్పటికైనా భావోద్వేగాలు పతాక స్థాయికి చేరిన ఈ వేళ సెలబ్రిటీలు బాధ్యతగా వ్యవహరించడం మంచిది.

# మరోసారి హీటెక్కించే లుక్కుతో మంచు లక్ష్మి

లక్ష్మీ మంచు లేటెస్ట్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో మళ్ళీ వైరల్ అవుతోంది. బ్లాక్ స్కర్ట్, గ్లిట్టర్ బ్లౌజ్, ఫ్లోరల్ జాకెట్‌తో కూర్చుని ఇచ్చిన ఈ స్టయిల్ పిక్స్ చూసి అభిమానులు ఫిదా అయ్యారు. ఆమె లుక్‌లో కేవలం గ్లామర్ మాత్రమే కాదు, కాన్ఫిడెన్స్ కూడా కనిపిస్తోంది. ఈ లుక్‌ను ఆమె ఇలాంటి లుక్ లో ఉండడం నాకు చాలా ఇష్టం అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడం విశేషం. లక్ష్మీ మంచు టాలీవుడ్‌లో మాత్రమే కాకుండా హాలీవుడ్‌లో కూడా అడుగుపెట్టిన నటి. 'అనగనగా ఒక ధీరుడు', 'గుండెల్లో గోదారి' వంటి చిత్రాల్లో తన ప్రతిభను చూపించింది. వెబ్ సిరీస్‌లు, టెలివిజన్ షోల్లో కూడా ఆమె తన టాలెంట్‌తో గుర్తింపు తెచ్చుకుంది. నిర్మాతగానూ ఆమెకి ప్రత్యేక స్థానం ఉంది. ఈ ఫోటోల్లో ఆమె వేసిన ఫ్లోరల్ జాకెట్‌తో కూడిన అవుట్‌ఫిట్, ఘనత పొందిన డిజైనర్ గజల్ గుప్తా కౌచర్ నుంచి వచ్చినది. జ్యువెలరీ డీపా గూర్నాని డిజైన్ చేయగా, నిఖితా నిరంజన్ స్టైలింగ్ చేశారు. ఈ ఫోటోలు లక్ష్మీ గ్లామర్ పరిధిని, ఫ్యాషన్ ఎక్స్‌పెరిమెంట్స్‌పై ఉన్న ఆసక్తిని చూపిస్తున్నాయి. అందం అంటే కేవలం రూపం మాత్రమే కాదు, అటిట్యూడ్ కూడా అని లక్ష్మీ మరోసారి చూపించారు. తన అందం, గ్లామర్‌తో పాటు ఎదిగిన కేరియర్‌తో లక్ష్మీ టాలీవుడ్‌లో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఫ్యాషన్‌లో కొత్త ట్రెల్స్ చేయడంలో ఆమె ఎప్పుడూ ముందుండేలా ఉంటుంది. అభిమానులు ఈ లేటెస్ట్ ఫోటోలకు మంచి రెస్పాన్స్ ఇస్తున్నారు. లక్ష్మీ మంచు ఇలా కొత్త లుక్స్‌లో కనిపిస్తే మరోసారి ఫ్యాన్స్‌కి ఫ్యాషన్ ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుంది. ఈ ఫ్లోరల్ లుక్‌కి సోషల్ మీడియాలో ఇప్పటికే లక్షల లైకులు, కామెంట్స్ వస్తున్నాయి.



# దేశభద్రత కోసం తీసుకునే నిర్ణయానికి కట్టుబడిఉంటాం

## కాల్పుల విరమణను స్వాగతించిన సిఎం చంద్రబాబు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

అమరావతి, మే 10 : భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటన శుభపరిణామమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉద్రిక్తతల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి విషయంలో సంతాపం వ్యక్తం చేశారు. దేశ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా మద్దతు తెలపాలని.. దేశమే ముందు అనేది అందరి నినాదం కావాలని పిలుపునిచ్చారు. దేశానికి కష్టమొస్తే సంఘటితంగా ఉండాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సమస్య ఉగ్రవాదం. దేశ రక్షణ కోసం జరిగిన వీరోచిత పోరాటంలో అగ్నివీర్ మురళీనాయక్ వీరమరణం పొందటం బాధాకరం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ.. ఎవరు మనపైకి వచ్చినా ఉపేక్షించేది లేదు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయభేదాలు ఉన్నా.. దేశ సమగ్రత విషయంలో అందరం ఏకతాటిపైకి రావడం గొప్ప విశేషం. మత విద్వేషాలు లేని రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ అని చంద్రబాబు అన్నారు.

# అందాలోటీలపై అక్కసు ఎందుకో రాష్ట్రప్రతిష్టను దెబ్బతీస్తున్న కవిత

## - భువనగిరి ఎంపి చామల విమర్శలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 10 : రాష్ట్ర ప్రతిష్టను ఎమ్మెల్సీ కవిత దెబ్బ తీయాలని చూస్తున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం కేవలం ఒక ఫెలిసేటేటర్ మాత్రమేనని ఆయన అన్నారు. రాష్ట్రం చాలా సేఫెస్ట్ ప్లేస్ అని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టొచ్చని, తెలంగాణలో ఇంత పెద్ద ఈవెంట్ చేయాలన్న ఉద్దేశ్యంతోనే నాలుగు నెలల క్రితం తెలంగాణను ఈ ఈవెంట్ కోసం ఎంపిక చేశారని ఆయన తెలిపారు. తెలంగాణ మీద నమ్మకంతో ఇక్కడ ఈవెంట్ పెట్టు–కున్నారన్నారు. ఈ రోజు మిస్ వరల్డ్ లిమిటె–డ్ అనే కంపెనీ ఇక్కడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆ కంపెనీ ఏదైనా నిర్ణయం తీసుకొని ఈ ఈవెంట్‌ను పోస్ట్ ఫోన్ చేయాలనుకుంటే తెలంగాణ ప్రభుత్వం వారికి సహకరిస్తుందని, వాళ్లు పోటీ–లు నిర్వహించాలని అనుకున్నప్పుడు మనం వాటిని పోస్ట్ పోన్ చేయలేమని ఆయన స్పష్టం చేశారు. 105 దేశాల నుంచి మిస్ వరల్డ్, మిస్ కంట్రీ–స్ వచ్చి ఇక్కడ మిస్ వరల్డ్ పోటీ–ల్లో పాల్గొంటు–న్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే వాళ్లతో పాటు– వాళ్ల కుటు–ంబ సభ్యులు మొత్తం కలిపి ఒక మూడు నుంచి నాలుగు వందల మంది డెలిగేట్స్ తెలంగాణలో ఉన్నారని ఆయన చెప్పారు. వీళ్లతో పాటు– ఈవెంట్ నడిపించే స్పాన్సర్షిప్ చాలా మంది ఇక్కడే ఉన్నారని, వాళ్లు తీసుకోవాల్సిన నిర్ణయమని ఆయన చెప్పుకొచ్చారు. రాజకీయం చేయాలన్న దురుద్దేశం నుంచి దూరంగా ఉండి వాస్తవాలు మాట్లాడాలని ఎంపి చామల ఎమ్మెల్సీ కవితకు ఆయన సూచించారు.

# ఆపరేషన్ కగార్‌కు సిందూర్ ఎఫెక్ట్

## - తాత్కాలికంగా నిలిచిపోయిన మావోల ఏరివేత
## - కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి
## - సరిహద్దులో వెళ్లేందుకు ఆదేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 10 : ఆపరేషన్ కగార్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ పడింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌కు కేంద్రం తాత్కాలిక బ్రేక్ వేసింది. భారత్–పాకిస్థాన్ వార్ నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులను ఏరివేసేం దుకు కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కి రావా ల్సిందిగా కేంద్రం ఆదేశించింది. దీంతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల వేటకు విరామం పడింది. దాదాపు ఐదు వేల మందికి పైగా బల గాలను కేంద్రం వెనక్కి రిప్పిస్తోంది. కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి వెళ్తున్నాయి. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్పీఎఫ్ కోబ్రా జవాన్లను తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కేంద్ర బలగాలు హుటాహుటిన వెనుతి రుగుతున్నాయి. ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలూబాక, వీరభద్రవరం పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలకు రిలీవ్ ఇచ్చారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆదివారం ఉదయంలోగా భారత్–పాక్ బార్డర్‌కు బలగాలు వెళ్లనున్నాయి. ఆపరేషన్ కగార్‌కు సిందూర్ ఎఫెక్ట్ కాగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ దూకుడుగా సాగుతోంది. ఆపరేషన్ కగార్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో భారీగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు అగ్రనేతలు కూడా ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలపై సెర్చ్ కొనసాగిస్తు న్నాయి. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూబింగ్ కొనసాగిస్తున్నారు. 145 ఎకరాల విస్తీర్ణం ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నాయి. అలాగే కర్రెగుట్టల్లో బంకర్లను ఏర్పాటు చేసుకుని మావోయిస్టులు ఉన్నట్లు గుర్తించిన భద్రతా బలగాలు కర్రెగుట్టలను జల్లడపడుతున్నాయి. గత కొద్దిరోజులుగా జరుగుతున్న కూంబింగ్‌లో పలువురు మావోయిస్టులు తారసపడటంతో ఎన్‌కౌంటర్లు జరిగాయి. చాలా మంది మావోయిస్టులు మరణించారు కూడా. అలాగే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు గ్రౌహౌండ్స్ కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల కోసం మరింతగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో బలగాలను వెంటనే వెనక్కి రావాల్సిందిగా కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. భారత్–పాక్ యుద్ధం నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాను కేంద్రం వెనక్కి రప్పిస్తోంది. దీంతో బార్డర్‌కు వెళ్లేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలను వీడుతున్నారు.

# ఈ యేడాది ముందుగానే రుతు పవనాలు

## 27న కేరళను తాకనున్న నైరుతి: ఐఎండి

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : నైరుతి రుతుపవనాలు ఈసారి మే 27న కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఐఎండీ శనివారం తెలిపింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించాక జులై 8 నాటికి భారత్ వ్యాప్తంగా విస్తరిస్తాయి. సాధారణంగా ప్రతి ఏడాది జూన్ 1 లేదా ఆ తర్వాత రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. దీంతో వర్షాకాలం ప్రారంభమైందని భావిస్తాం. అయితే 2009లో నైరుతి రుతుపవనాలు మే 23నే ప్రవేశించాయి. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు అంచనాల కంటే చాలా ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయి. సెప్టెంబరు 17న రుతుపవనాల ఉపసంహరణ ప్రారంభమవుతుంది. ఆ తదుపరి నెల 15 నాటికి ఇది ముగుస్తుంది. ఈసారి వర్షపాతం సాధారణం కంటే అధికంగా నమోదు అవుతుందని ఐఎండీ ఏప్రిల్ నెలలోనే తెలిపింది. సాధారణం కంటే తక్కువగా వర్షపాతం కురిసే ఎల్‌నినో పరిస్థితులు లేవని చెప్పింది. భారత్‌లో 52 శాతం నికర సాగు భూమికి వానలే ఆధారం. భారత్‌లోని వ్యవసాయ ఉత్పత్తిలో దీని నుంచి 40 శాతం దిగుబడి వస్తుంది. ఇండియాలో ఆహార భద్రతతో పాటు– ఆర్థిక స్థిరత్వానికి నైరుతి రుతు పవనాలది ప్రధాన పాత్ర. 'నాలుగు నెలల రుతుపవన కాలంలో (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక సగటు– 87 సెంమీలో 105 శాతం వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశాం' అని అధికారులు అప్పట్లో ప్రకటించారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా భారతదేశంలో దాదాపు 87 సెంమీ వర్షం పడుతుంది. దీనిని దీర్ఘకాలిక సగటు– అంటారు. ఈ సంవత్సరం మాత్రం మొత్తం వర్షపాతం 87 సెంమీలో 105 శాతం ఉంటు–ందని అంచనా వేశారు. అంటే 91.35 సెంమీ వర్షపాతం పడుతుందని అంచనా వేసినట్లు– లెక్క. దేశ వ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి నైరుతి రుతుపవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.



# భారత్ దాడిలో పాక్ ఎయిర్ బేస్‌లు ధ్వంసం

## - కోలుకోలేని దెబ్బ కొట్టిన రక్షణ దళాలు
## - దేశం కోసం భారత్ బలగాలు ఎప్పుడూ సిద్ధమే
## - దేశ సార్వభౌమత్వానికి సవాల్ విసిరితే సహించేది లేదు
## - రక్షణశాఖ ప్రతినిధులు స్పష్టీకరణ

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : దేశ రక్షణ కోసం భారత సైనయం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని రక్షణశాఖ ప్రతినిధులు స్పష్టం చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడడంలో ముందుంటామని అన్నారు. కొన్ని రోజులుగా భారత్, పాక్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ఇరుదేశాల విదేశాంగ శాఖలు ప్రకటించాయి. ఈ ప్రకటన అనంతరం భారత సైనికాధికారులు మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై పాక్ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని, అయినప్పటికీ భారత సైన్యం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని వెల్లడించారు. భవిష్యత్తులో పాకిస్థాన్ దాడులకు తెగబడితే దీటుగా సమాధానమిస్తామని స్పష్టం చేశారు. భారత్‌పై కవ్వింపు చర్యలకు దిగి పాక్ తీవ్రంగా నష్టపోయిందని ఇండియన్ ఆర్మీ తెలిపింది.

భారత్–పాకిస్తాన్ కాల్పుల విరమణ ప్రకటన తర్వాత శనివారం విలేకరుల సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ.. భారత్ రా–400తోపాటు బ్రహ్మోస్ క్షిపణి స్థావరాలను పాకిస్తాన్ వైమానిక దళానికి చెందిన ఓఎ–17 నాశనం చేసిందంటూ పాకిస్తాన్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. ఎస్–400 సేఫ్ అని.. భారత ఆర్మీకి ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. భారత సాయుధ దళాలు పాకిస్తాన్‌లోని ప్రార్థనా స్థలాలను భారత్ టార్గెట్ చేయలేదని చెప్పారు. సిర్సా, జమ్ము, పఠాన్‌కోట్, భటిండా, నలియా, భుజ్‌లోని మన వైమానిక స్థావరాలు దెబ్బతిన్నాయని పాకిస్తాన్ అసత్య ప్రచారం చేసిందని పేర్కొన్నారు. పాకిస్తాన్ ఆర్మీ బేస్‌లను, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను భారత సైన్యం ధ్వంసం చేసిందని చెప్పారు. ఇక పాకిస్తాన్ ఎలాంటి కవ్వింపు చర్యలకు దిగినా దీటుగా జవాబిస్తామని సోఫియా ఖురేషి హెచ్చరించారు. కొన్ని రోజులుగా భారత్‌పై పాక్ అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. ఎస్–400, బ్రహ్మోస్ వ్యవస్థలపై వాళ్లు దాడి చేశారనడం అవాస్తవం. సిర్సా, జమ్ము, బఠిండా, భుజ్‌లపై దాడి పాక్ దాడి చేశామని ప్రచారం చేసింది. అది కూడా అబద్ధం. నలియా, పఠాన్‌కోట్ వాయుసేన స్థావరాలకు నష్టం కలిగించామని, చండీగఢ్ ఆయుధాగారంపై దాడి చేసినట్లు– పాక్ తప్పుడు ప్రకటనలు చేసింది. ప్రార్థనా మందిరాలపై భారత్ దాడి చేసిందని అంటోంది. భారత్ లౌకిక దేశం.. ప్రార్థనా మందిరాలపై ఎప్పుడూ దాడి చేయదు. మనం చేసిన ప్రతిదాడులతో పాక్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. పాకిస్థాన్ రాడార్, క్షిపణి రక్షణ వ్యవస్థలను నిర్వీర్యం చేశాం. కర్దు, సర్గోదా, జకోదాబాద్‌లోని పాక్ వాయుసేన స్థావరాలను భారత దళాలు ధ్వంసం చేశాయి. నియంత్రణ రేఖ పొడవునా పాక్‌కు తీవ్ర నష్టం కలిగించాం. కాల్పుల విరమణకు అంగీకరించినా నిరంతరం సైన్యం పూర్తి సన్నద్ధతతో ఉంటుంది' అని భారత సైనికాధికారులు వివరించారు. విలేకర్ల సమావేశంలో ఆర్టీ అధికారి రఘు నాయర్, వ్యోమికా సింగ్న సోఫియా ఖురేషిలు మాట్లాడారు.

# కాల్పుల విరమణలో డీజీఎంవోదే కీలక పాత్ర

## - తొలుత డీజీఎంవోల మధ్యే సంప్రదింపులు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : మనదేశంలో కాల్పుల విరమణ ఒప్పందాలు, సరిహద్దు ఉద్రిక్తతల వేళ డీజీఎంవోదే కీలక పాత్ర. రెండు దేశాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం ఏర్పడినప్పుడు తొలుత డీజీఎంవోల మధ్యే సంప్రదింపులు కొనసాగుతాయి. ఉద్రిక్తతలు తగ్గించడం, ఆయా దేశాల ఉద్దేశాలను వివరించడం, సాధ్యమైనవాటిని తక్షణమే పరిష్కరించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారు. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంట పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఆ సమయంలో భారత్–పాక్ డీజీఎంవోలు హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారు. కాల్పుల విరమణను ప్రస్తావించిన భారత్.. దాయాది దేశాన్ని హెచ్చరించినట్లు రక్షణశాఖ అప్పట్లో పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరయ్యింది. ప్రతిదాడులు చేసేందుకు దాయాది దేశం యత్నించినప్పటికీ.. భారత బలగాల దెబ్బకు తోకముడిచింది. చివరకు ఉద్రిక్తతలు తగ్గించాలని పాక్ కోరడంతో అందుకు భారత్ అంగీకరించగా.. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ఈ వ్యవహారంలో సైన్యంలోని డీజీఎంవో స్థాయి అధికారులు కీలకంగా వ్యవహరించారు. పరిస్థితులు తీవ్ర రూపం దాల్చుతున్న వేళ వీరి మధ్య పరస్పర అవగాహనతో ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడినట్లయ్యింది. సైనిక కార్యకలాపాల పర్యవేక్షణ, సమన్వయం చేసుకోవడంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ లదే పాత్ర కీలకం. సైన్యంలో సీనియర్ అధికారి స్థాయిలో ఉండే వీరు సైనిక ఆపరేషన్లలో వ్యూహాత్మక, కార్యాచరణను అమలు చేస్తుంటారు. ఆర్మీ చీఫ్‌తో నేరుగా సంప్రదింపులు జరుపుతూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తుంటారు. ప్రత్యర్థులపై దాడులు, శత్రుమూకలను దీటుగా ఎదుర్కొనే సైనిక ఆపరేషన్లకు వ్యూహాలు రచిస్తుంటారు. బలగాలను సిద్ధం చేయడం, రంగంలోకి దించడం వంటి విధులతో పాటు శాంతి పరిరక్షణలోనూ కీలకంగా వ్యవహరిస్తారు. సంయుక్త ఆపరేషన్‌ల సమయంలో వివిధ విభాగాల అధిపతుల మధ్య సంధానకర్తగా ఉంటారు. అటు నిఘా వ్యవస్థలతోనూ సమన్వయం చేసుకుంటూ వ్యూహాలు రచిస్తారు.

# ఆపరేషన్ సిందూర్‌లో కీలక ఉగ్రవాదులు హతం

## వివరాలు వెల్లడించిన రక్షణశాఖ వర్గాలు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 10 : ఆపరేషన్ సిందూర్‌లో జైష్–ఎ–మొహమ్మద్, లష్కరే తోయిబా ఉగ్ర సంస్థలకు సంబంధించిన కీలక ఉగ్రవాదులను భారత ఆర్మీ మట్టుబెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మే 7వ తేదీ బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని లష్కరే తోయిబా, జైషేతోపాటు తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ దాడి చేసింది. భారత దాడుల్లో 100మందికి పైగా ఉగ్రవాదులు మరణించినట్లు అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, చనిపోయిన వారిలో లష్కరే తోయిబా, జైషే ఉగ్రసంస్థల్లో కీలకంగా ఉన్న ముదస్సర్ ఖాదియన్ ఖాస్, హఫీజ్ ముహమ్మద్ జమీల్, మొహమ్మద్ యూసుఫ్ అజార్, ఖలీద్ (అబు ఆకాషా), మొహమ్మద్ హసన్ ఖాన్ అనే ఐదుగురు ఉగ్రవాదులు ఉన్నారని వర్గాలు తెలిపాయి. ఇందులో మొహమ్మద్ యూసుఫ్ అజార్.. జైషే చీఫ్ మసూద్ అజార్ బావమరిది అని నివేదికలు వెల్లడించాయి. కాగా, ఈ దాడుల్లో మసూద్ ఇప్పటికే తన సోదరుడిత్ సహా 10 కుటు–ంబ సభ్యులు, నలుగురు సన్నిహితులను కోల్పోయాడు. ఈ విషయాన్ని అంగీకరిస్తూ లేఖ కూడా విడుదల చేశాడు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

హైదరాబాద్,మే 10 : నగర శివారు ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం ఘోర ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న వాహనాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగి రెండు వాహనాలు కాలిపోయాయి. కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరు సజీవ దహనం కాగా మరో వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు–చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...నగరంలోని బహుదూర్ పూర్ తాడ్బన్, హెచ్‌బి కాలనీకి చెందిన వ్యాపారవేత్త దీపేష్ రితేష్ కుమార్ అగర్వాల్ కుమారుడు దీపేష్ అగర్వాల్ (23) తన స్నేహితులను కలిసి వస్తానని చెప్పి కారులో బయలుదేరాడు. విజయనగర్ కాలనీ విటిసికి చెందిన సంచయ్ మల్వాని (22), మాసాపేట్‌కు చెందిన ప్రియాన్షు మిట్టల్ (23)తో కలిసి వారు శంషాబాద్ వైపు నుండి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గండిచెరువు బ్రిడ్జి సమీపంలో ఔటర్‌పైకి రాగానే ఎలాంటి సిగ్నిల్స్ లేకుండా ఆగి ఉన్న వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగాయి. దాంతో రెండు వాహనాలు మంటలో పూర్తిగా దగ్ధమయ్యాయి.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com